
ప్రొడ్యూసర్స్ కంబైన్
ఇద్దరు అమ్మాయిలు
ఈస్ట్‌మన్ కలర్ జెమిని
దర్శకత్వం
పుట్టణ్ణ
రచన
డి.వి. నరసరాజు బి.ఏ
సంగీతం
కె.వి. మహదేవన్
నవరంగ

తొలిమాట

అందానికి

ఆనందానికి

అందుకు

శబ్దబ్రహ్మ

అదే యీ

నాటి మన కృతజ్ఞత

శబ్దపద్ధ ప్రహేళిక


అంజలితో

ఆశీర్వాదముతో

మీకు మేమిచ్చే

రసగుళిక.

ఒకే ఉతుకులో 3 దశలుగా పనిచేసే



డెట్ బట్టలను ఎక్కువ తెల్లగా ఉతుకుతుంది

—ఏ యితర పౌడరు కంటె

ఎలా చేస్తుందో ఎందుకు చేస్తుందో చూడండి:

1వ. దశ: డెట్‌లోగల ఒక ప్రత్యేకమైన పదార్థము బట్టలోనికి త్వరగా చొచ్చుకొనిపోయి బాగా అంటుకొని ఉన్న మట్టిని కూడ వదలిస్తుంది—బట్టలు శుభ్రపడతాయి.

2వ. దశ: డెట్ మట్టిని వదలించిన తరువాత దానిని బట్టకు మళ్లీ అంటుకోకుండా చేస్తుంది. దుస్తులు శుభ్రపడతాయి, శుభ్రముగా ఉంటాయి.

3వ. దశ: డెట్ బట్టలకు అదనపు తెల్లదనమును కలిగిస్తుంది—బట్టలు పూర్వము కంటె ఎక్కువ తెల్లగా ఉంటాయి! (నీలి లేక తెలుపు చేసే పదార్థమును చేర్చనక్కర్లేదు).

డెట్‌ను నేడే కొనండి! స్వస్తిక్ ఆయిల్ మిల్స్, బొంబాయి

SHILPI M 38A/70 TEL

సచిత్ర మాస పత్రిక

41.బి, బర్కెట్ రోడ్,

టి. నగర్. మద్రాసు-17,

విడి ప్రతి వెల

1 రూపాయి

ఏడాది చందా

పన్నెండు రూపాయలు

సంపుటి 8

అక్టోబర్ 1970

సంచిక 10

మేనేజింగ్ ఎడిటర్.

వి. వి. రాఘవయ్య.

ముఖచిత్రం

ఫిలిం క్రాఫ్ట్స్ వారి

'దేశమంటే మనుషులోయ్'

Printed and Published by V. V. Raghavaiah and Printed by K. Domodaram at Sri Kala Printers, 83, Lake view Road, Madras-33.

ఉత్తరాలు

జ్యోతి మాస పత్రిక కాను రాను సర్వాంగసుందరంగా తయారౌతోందను టలో అతిశయోక్తి లేదు—

శ్రీ శ్రీ గారి సిమబుక్కులు అందర్నీ ఆకర్షిస్తున్నాయి — వాటితోపాటు మరి కొన్ని కవితలను కూడ ప్రచురించగలరని ఆశిస్తాను.

ఈ సంచికలోని I.ఎ. వి. సీతారామ మూర్తిగారి కథ "బామ్మా! నేనూ నీ మనవడినే!" పత్రికకే హైలైట్ అనిపించింది — సరదాగా చక్కగా సాగిన ఇటు వంటి రచనలకు ఎక్కువ ప్రోత్సాహమిస్తే బాగుంటుంది. విట్లూ కార్టూన్లు ఎంతో బాగుంటున్నాయి,

కుమారి పి. నిర్మల,

రామ్మూర్తిపేట.

ఎడిటర్ గారూ,

జ్యోతిలో ముద్రారాక్షసాలు భరించ లేకుండా వున్నాయి. మీరేం చైలేరా? సెప్టెంబరు కాపీ మరీ ఘోరంగా వుంది.

భవదీయుడు,

వి. ఎస్. ఎ.

శ్రీ శ్రీ గారి పదబంధ ప్రహేళికతో సాహిత్యాభిలాషుల మెదడులకు మంచి మేత కలుగ జేశారు. ఈ శీర్షిక అలాగే కంటిన్యూ చేస్తే బాగుంటుంది.

యస్. వి. యస్. రాధ,

బరోడా.

దీపావళి ప్రత్యేక సంచిక సరిగ్గా ఏ తేదీన మా చేతుల్లో వుంటుందో... రెగ్యులర్ జ్యోతి ప్రతినెల ఒకటో తారీఖున వచ్చేట్లు ఏర్పాటు చేయగలరా?

యం. వెంకటేశ్వర్లు,

బిట్రగుంట.

వాసిరెడ్డి కాశీరత్నం రచన 'మోళ్లు చిగురుస్తాయి' చదివిన తర్వాత ఈనాటి అధునాతన పరిస్థితుల ప్రభావాల సంకెళ్ళ నుంచి తప్పించుకోగల స్త్రీ మూర్తులు యింకా మన పవిత్ర భారతంలో ఆశా జ్యోతుల్లా ప్రకాశిస్తున్నారనిపించింది. మూర్ఖత్వానికి లోనవుతున్న కొంతమంది ఆడవాళ్లు ఈ కథ చదివిన తర్వాత తప్పకుండా వారి జీవితాల్లో మంచిని చిగురింప చేసుకొని, తాత్కాలిక సుఖాలను

దూరంగా నెట్టి తమ పిల్లల భవిష్యత్తు కోసం జీవితాంతం కష్టపడుతారని ఆశిస్తున్నాను.

సీత,
మద్రాస్-4.

'జ్యోతి'లో కథలు తక్కువ సంఖ్యలో వస్తున్నందుకు చాలా బాధగావుంది. మరి కొన్ని పెంచలేరా? కష్టమా? పెంచితే బాగుంటుంది. మరేమంటారు?

ఆనంద్
కొవ్వూరు.

ఈ నెలలో కథలన్నీ బాగున్నాయి. ఒకదాన్ని యించి మరొకటి ఎంతో బాగుంది. ఇలాగే ప్రతినెలా జ్యోతి ప్రతివారిని ఆనందింపజేయాలని నా ఆకాంక్ష!

కె. సుమతి,
రాజమండ్రి.

సిరిసిరి బుక్కు

శ్రీనివాసరావు శ్రీరంగం
అన్నిటికి కదంబం
పోరాట తరంగం
వాయిస్తాడు నిష్యందం
గా విప్లవ మృదంగం

నేటి నిజమ్

కాపిటలిజమ్
నేషనలిజమ్
రివిజనిజమ్
కొంది రివల్యూషనిజమ్.
అదే నక్సలిజమ్.

గడ్డం మార్కు

ఆరెస్సెస్సు (R. S. S.)
స్టోర్సు
లోని వైన్సు
స్పిరిట్సు
తాగకు డేంజరస్సు

ఈ ఒక్క విషయంలోనే

తాపీ మేస్త్రి
లా డబ్బు విషయంలో శాస్త్రి
యంగా వుంటే మొగుడ్ని పునిస్త్రీ
కాకుండా ఇస్త్రీ
బట్టలా వుంచుతుంది స్త్రీ.

వారసత్వ సంపద

బ్రాహ్మణ విశ్వాసాలు
రాజుల నిశ్వాసాలు
రాణుల ఉఛ్వాసాలు
కథల విన్యాసాలు
ప్రాచీన సాహిత్య నీరసాశ్వాసాలు.

తల వెనక్కు వున్న జంతువు.

దిండు
కింద పోకచెక్కగుండు
రచనలు దం
గ, కాని దం...
గ పనికొస్తాయి భలే షంటు.

బ్రూట్ పాలిష్

ప్రీవీపర్సు
లి. సమర్థించినవాళ్లు పల్సు
ని పట్టుకొంట తెల్సు
కుని ఈసారి పన్సు
మో రు ఓ ంచండి బ్రదర్సు

—అత్తలూరి నరసింహారావు. తిరుపతి

లిమరిక్కులు శ్రీశ్రీ

అహాహో

ఇహ
లోకం ఒక ప్రహ
సనం ఒక రాక్షసుడి గుహ
అక్కడ తప్పకు స్పృహ
అహాహాహాహా
హాహాహాహా

ఇహిహీ

ఇందిర పందిరి నీడ
ఓహోయి గజ్జెల కుర్రోడ
జయేందిరను వెదుకాడ
బోతున్న నిన్ను జూడ
నవ్వొస్తది నాకు గూడ

తెలసా

విరసాని కెదురొడ్డి
అబ్బాయ్ గజ్జల మల్లారెడ్డి
నువ్వు రాస్తున్న గుడ్డి
విద్వేషపు రాతల జడ్డి
జనంవల్ల విరుగుతుంది అరసం నడ్డి

భూత వైద్యః

సిందికేటుగాళ్లు
పుండులాటి వాళ్లు
రియాక్షన్‌కి గీటురాళ్లు
ఇక్ష్వాకుల నాటి కుళ్లు
వాళ్ళంతా జోడెడ్ల నాటుబళ్లు

ఏం చేస్తాం

దాశరథి
నవ్యకళా నిధి
కావ్య పయోదధి
ఐనా చైనా అంటే అధి
కాధిక భయం ఆతని దుర్విధి

కిరాణా కొట్టు

పినారె
బళారె
అన్నిట్లో హుషారె
పినిమా రె
డీమేడ్ సరుక్కి తయారె

చూస్తారుగా

మీ యిష్టం
ఏదైనా అనండి బాలారిష్టం
లేదా సారస్వతారిష్టం
మరేదైనా కాని మా సిస్టం
రేపటి విప్లవానికి నాంది అనేదే స్పష్టం

మానిఫెస్టో

విప్లవ సాహిత్యం
పోయేదారి కంటక భూయిష్ఠం
దాని ప్రధానరసం బీభత్సం
దాని పునాది సాంఘిక యాథార్థ్యం
దాని ఆదర్శం వర్గరాహిత్యం

గ్, మ్, ఫ్

కవిమర్శకుల ఊహల్లో చిల్లులు
అచ్చులేని హల్లులు
రుద్రాక్ష పిల్లులు
వాళ్ల తల్లులు
నెత్తురు పీల్చే నల్లులు

హెచ్చరిక

నోటి దురుసు నోరి
నీరసపు ఎడారి
పేరులేని మారి
అటుపోతే కాలుజారి
చెడిపోతావ్ నీళ్ల కారి

నారాయణ నారాయణ

వెయ్యి పడగలు
లక్ష పిడకలు
లక్క పిడతలు
కాగితపు పడవలు
చాదస్తపు గొడవలు

శుభం భూయాత్

అమెరికా జులుం బెడిసింది
రష్యా హయాం ముగిసింది
ఇంగ్లాండ్ తోక ముడిచింది
ఐరాస కోరస్‌గా అరిచింది
జనచైనా గెలిచింది


గృహస్థులు
అజ్జరపు హనుమంతరావు

సాయంత్రం నాలుగ్గంటలయింది....

పూర్ణగర్భిణిలా అపసోపాలు పడుతున్న పూరీ-హైద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ కదలడానికింకా రెండు నిముషాలు వ్యవధి వుంది.

"వెళ్ళగానే పెద్దాడిచేత వుత్తరం వేయించు పార్వతీ ..." ప్రకాశం గారి గొంతు జీరపోయింది.

"ఛీ! అదేవిటండీ! నాలుగు రోజుల భాగ్యానికే అంత యిదయితే ఎలా? వాడవసరం తీరగానే మళ్ళీ రెక్కలు గట్టుకుని వాలనూ?...." అంది. రైలు కిటికీలోంచి పార్వతమ్మగారు భర్త బేలతనానికి జాలిపడుతూ; భర్త తనను గురించి బాధపడుతున్నందుకు శరీరం లిప్తపాటు పులకించినా, మనసులో మాత్రం ఆవిడకీ ఒక ప్రక్క బాధగానే వుంది-భర్తని వదలి వెళుతున్నందుకు.

రైలు కూతేసింది.

"పార్వతీ! పెద్దవాడేం చెప్పినా కాదనకు." రైలుతోబాటు నాలు గడుగులు ముందుకు వేసి ప్రకాశంగారు ముక్తసరిగా అన్న ముక్కలవి!

ఆయ నామాట లెందుకన్నారో, వాటి సందర్భం ఎమిటో పార్వతమ్మగార్కి అర్థం కాలేదు. వేయాలనుకున్న ప్రశ్న ఆవిడ పెదవులు దాటకుండానే రైలు ప్లాటుఫారం దాటించి.

గోదావరి బ్రిడ్జి మీదనుంచి భారంగా నడిచి వెళుతున్న రైలును కనుచూపుమేర దాకా చూపి, వెనుదిరిగారు ప్రకాశంగారు. బరువయిన ఆలోచనలతో భారంగా స్టేషను బయటి కొచ్చారాయన.

"రిక్షా బాబూ...." అంటూ ఒకరిద్దరు రిక్షాకాళ్ళు ముందు కొచ్చారు.

"వద్దు" అంటూ ముందుకు కదిలారాయన.

ఇంటికి పోబుద్ధి పుట్టలేదాయనకి. భార్య లేని ఇంటికి వెళ్ళడం అంటే ఆయనకెంతో వెగటనిపించింది. నెమ్మదిగా మ్యునిసిపల్ పార్కులో కొచ్చి సిమెంట్ బెంచీ మీద కూర్చున్నారు.

జరిగినది తల్చుకున్నకొద్దీ ఆయన మనస్సు అవమానంతో దహించుకుపోసాగింది.

"ఛీ....వృద్ధాప్యం ఎంతటి జుగుప్సాకరమైనది! అందులోనూ ఆర్థిక స్వాతంత్ర్యము లేని తనలాంటి వాళ్ళ బ్రతుకు యింకా నికృష్టం! కడుపున పుట్టిన వాళ్ళే సాఫీగా సాగిపోతున్న తమ జీవితసరళిలో తుఫాను సృష్టించినపుడు యిదేమిటని అడిగే వాక్ స్వాతంత్ర్యం లేని బ్రతుకు తన కెందుకు?" జరిగిన ఒక్కొక్క సంఘటన తల్చుకున్నకొద్దీ తన నిస్స

హాయ స్థితికి తన మీద తనకే జుగుప్స కలిగిందాయనకి.

'ఎంత ధైర్యంగా మాట్లాడాడు చిన్నాడు పొద్దున: అసలు వారం రోజుల బట్టి మొగుడు పెళ్ళాలిద్దరు గుసగుసలాడు కోడం చూసినప్పుడే అనుమానం వేసింది తనకి. కాని పెద్ద ప్రాధాన్యం యివ్వలేదు, తనప్పుడు. వ్యవహారం యింత త్వరలో యింత తీవ్రరూపం దాలుస్తుందని కలలో కూడ అనుకోలేదు తను....ఎంత సిగ్గు మాలినవాడు కాకపోతే, కన్నతండ్రితో "మిమ్మల్నిద్దర్ని పోషించడం కష్టం, చెరొక చోట వుండండి...." అని ఖచ్చితంగా చెప్తాడా? పార్వతి మాటలు వింటే వాడ్ని అక్కడి కక్కడే దులిపేసి వుందును. కాని అది పురాణం వినడానికి వెళ్ళడంతో అ మాటలు వినే దుస్థితి తనొక్కడికే పట్టింది. అంతే!! అన్న రెండు మాటలు ముక్తసరిగా అనేసి యిక ముఖం చెల్లక వెళ్ళిపోయాడు. వాజమ్మ! పైగా. అన్నగారి కూడా తనే రాసి, యిద్దరూ చెరొక చోట వుండడానికి ఏర్పాటు చేశాట్ట! అయినా పెద్దాడికి మాత్రం బుద్ధి వుండక్కర్లా! తల్లిదండ్రులిద్దర్నీ చెరొకరు పంచుకుంటారా? యిద్దరూ ఒకచోట పడి వుంటే గుప్పెడు మెతుకులు పెట్టలేరూ?? తనిన్నాళ్లా పెద్దాడి మీద ఆశ పెట్టుకుని వుండేవాడు. హుం.... వాడి నిర్ణయం కూడా అదే అయినప్పుడు తను ఏ మాట అనీ ప్రయోజనం ఏవిఁటి? వెలితపడ్డం తప్ప! అందుకే జరిగినదాన్ని కప్పిపుచ్చి పార్వతిని పెద్దాడి దగ్గరకి ఏదో అవసరం వుందట రమ్మని రాశాడు. వెళ్ళిరా....' అని అబద్ధం చెప్పి పంపించాడు. అక్కడి కెళ్ళేక తెలుస్తుంది దానికి-యిక తాము యిద్దరూ శాశ్వతంగా వేరుగా వుండాలని!! ఏడుస్తుంది. యిద్దరి కొడుకుల్ని తిట్టి పోస్తుంది, ఆ తర్వాత తనని కూడా తిడుతుంది - అబద్ధం చెప్పి పంపించి నందుకు. కావాలనే తను కూడా యిష్టపడి యీ పని చేశాడని మళ్ళీ మళ్ళీ ఏడుస్తుంది. కాని దానికేం తెలుసు? తన మనసులో ఎన్ని అగ్నిగోళాలు బ్రద్దలవుతున్నాయో?'

ఆలోచిస్తున్న ప్రకాశం గారికి చెప్పలేని దుఃఖం వచ్చింది. 'ఈ వృద్ధాప్యంలో యీ ఎడబాటు ఎందుకు సృష్టించావ్ భగవాన్? ఏభయి సంవత్సరాలు సాఫీగాసాగిన తమ జీవిత సరళిలో అపస్వృతి యిప్పు డెందుకు పలికింది? నా పార్వతి నన్ను వదిలి వుండలేదు. 'నలుగు రోజుల భాగ్యానికే అంత బెంపేలుపడిపోతే ఎలా?' అని నాకు ధైర్యం చెప్పిన అ అమాయకురాల్ని శాశ్వతంగా వదలి వుండడం ఎలా? ఎలా?'' మూగగా ఆక్రందించిం దాయన మనస్సు, అప్రయత్నంగా రెండు కన్నీటి బొట్లు జల జలా రాలి డొక్కా మీద పడ్డాయి, కండువాతో వొత్తుతున్నా రాయన.

"ఏడుస్తున్నావా ప్రకాశం...." ఆప్యా

యంతో నిండిన కంఠం.

ప్రకాశంగారి కొకప్పుడు అత్యంత పరిచయమైనది.

ఉలిక్కిపడి చుట్టూ చూశారాయన. ఆయనకి పది గజాల పరిధిలో ఎవరూలేరు చిరు చీకటి తప్ప, ఒక్కసారిగా ఆయన వొళ్ళు జలదరించింది ఎందుకో.

చల్లటిగాలి వీస్తున్నా చిరు చెమటలు క్రమ్ముతున్నాయాయన్ని.

"యిలా చూడు ప్రకాశం...." అదే కంఠం.

చటుక్కున ప్రక్కకి తిరిగారు ప్రకాశం గారు.

చుట్టు ప్రక్కల ప్రదేశం అంతా ఒక్కసారిగా నిశ్శబ్దమై పోయింది.

రేడియో సంగీతం, రోడ్డు మీద జనం తాలూకు గందరగోళం, కార్ల మోత అన్ని హఠాత్తుగా ఆగిపోయాయి. తనేదో నిర్జన మైన ప్రదేశానికి వెళ్ళిపోయినట్టు, ఏదో భయంకరమైన నిశ్శబ్దంలో ఒంటరిగా కూర్చున్నట్టు అనిపించిందాయనకి. ఒళ్ళు బరువెక్కింది.

అంతలోనే ఆయన కళ్ళ ముందు తెల్లటి దట్టమైన పొగ....ఆ పొగలో అస్పష్టంగా కనిపించిన ఆకారం క్రమంగా స్పష్టమై రూపుదాల్చి ఆయిన ముందు సాక్షాత్కరిందింది,

"అమ్మ!" అప్రయత్నంగా వణికా యాయన పెదవులు.

"ఎందుకురా ఏడుస్తావు? ఆనాడు నువ్వు చేసిన నిర్వాకమే యీనాడు నీ పిల్లలు నీకు చేశారు."

గట్టిగా నవ్విందా ఆకారం. యిప్పుడా కంఠంలో యిందాకటి ఆప్యాయత లేదు. ఎత్తిపొడుస్తున్నట్టున్నాయా మాటలు.

"అమ్మా...." అంటూ గట్టిగా ఒక్క కేక వేశారు ప్రకాశంగారు.

అంతే! మరుక్షణం తెల్లటి పొగ, పొగతోబాటు ఆ ఆకారం మాయమై పోయింది;

చుట్టు ప్రక్కల గందరగోళం, రోడ్డు మీది కలకలం రేడియో సంగీతం అన్ని 'స్విచ్' ఆన్ చేసినట్టు మళ్ళీ ఆయన చుట్టూ ముసురుకున్నాయి శరీరం తేలిక పడింది. కాని మనస్సు పాతిక సంవత్స రాలు వెనక్కి పరుగులు తీసింది.

ఆనాటి సంఘటన....

హృదయ విదారకమైన సంఘటన.... మళ్ళీ యీనాడు తన విషయంలోనే అతి భయంకరమైందిగా, దుస్సహమైందిగా రూపు దాల్చింది,

ఆనాడు తను చేసిన పని ఎంత దారుణ మయిందో, అందుకా ముసలి ప్రాణాలు ఎంత క్షోభించాయో ఈనాడాయన స్వయ ముగా తెలుసుకున్నారు.

జరిగినదంతా సినిమా రీలులా ఆయన ముందు తిరిగింది....బండిలో కూర్చున్న తల్లి!

ఎర్రటి పట్టుచీర! ఆకుపచ్చ జాకెట్టు! ఐదవతనానికి నూటికి నూరుపాళ్లు ప్రా

నిధ్యం వహించేటట్టు కూర్చున్న తన మాతృమూర్తి!!

కంటికి మింటికి ఏకధారగా ఏడ్చింది.

"నాయనా ప్రకాశం! యిది మంచి పని కాదురా! యిక బతికినంత కాలం బతకం; మమ్మల్ని విడదీయకురా! అన్నయ్యని నే వొప్పిస్తాగా! మమ్మల్నిద్దర్ని ఒక చోట పడివుంటనీయండిరా....మా నాన్నకదూ" అని.

కాని తన మనస్సు కరగలేదు.

వీధి గుమ్మంలో శూన్యమనస్కుడై తన మనస్సు మారుతుందేమోనని ఎదురు చూస్తున్న తండ్రిని తనసలు పట్టించుకో లేదానాడు.

అది జరిగిన నెల్లాళ్ళకే....

"నాయనా ప్రకాశం! నీ తలిదండ్రుల్ని నువ్వు గౌరవిస్తేనే నిన్ను నీ పిల్లలు గౌరవిస్తారు, వీళ్ళని నువ్వు ఏవగించుకుని దూరం చేసుకుంటే నీ పిల్లలు నీకు చేసే దదే! ఇది కఠిన సత్యం...." అంటూ శాశ్వతంగా కళ్ళు మూశాడు తండ్రి, ఆయన దినవారాలు పూర్తి కాకుండానే తల్లి కూడా ఆయన్ని చేరుకుని, తన ఆదర్శ సతీత్వాన్ని నిరూపించుకుంది.

....

ఒక్కసారిగా నిట్టూర్చారు ప్రకాశం గారు. పూర్తిగా మైకం వొదిలి పోయింది ప్పుడాయనకి.

అవును: అదే నిజం!! జరగవలసిందే అక్షరాలా జరిగింది, 'పార్వతీ! చూశావా!' అనాడు నువ్వే నన్ను వారించి వుంటే యీనాడిలా జరిగి వుండేది కాదేమో!? ఆ దంపతుల శాసనానికి గురయిన మనని దేవుడు కూడా రక్షించలేడు.

....అనుభవించాల్సిందే! బాధపడకు! పడటం అవసరం, నిష్ప్రయోజనంకూడా.

గొణుక్కుంటూ లేచి తడబడే అడుగులతో గృహోన్ముఖులయ్యారు, ప్రకాశం గారు.

వట్టి తిట్లు :-

"సున్నకి సున్న చేరిస్తే ఏమవుతుందోయ్?"

"రెండు సున్నలు."

"కాదు సున్నం."

"పది మధ్య సున్న పెడితే."

"పంది."

"ఛ. తిట్టుగాస్తాతగలేసావు. నువు వందఅనుండాలి. నేను పంది అనుండాలి"

జోక్ బాక్స్

సులభమార్గం

"నా దగ్గిర అద్భుతమైన వాచీ ఉంది. దానికి మరమ్మతులు అక్కర్లేదు. కీ యివ్వక్కర్లేదు. అసలు 'కీ' ఉండదు. గంటల ముల్లు నిముషాలముల్లు లేవు,"

మరి టైం ఎలా, తెలుస్తుంది?"

"ఏముంది?" ఎవర్నడిగినా చెబుతారు."

మధ్య తరగతి ప్రజలు

మధ్యప్రదేశ్ రాజదానిలో ఇద్దరు త్రాగుచేతులు తూలుకుంటూ వస్తున్నారు, రోడ్డుప్రక్కన వెలుగుతున్న మెర్కురి లైటును చూసి అది చంద్రుడని ఒకడు కాదు సూర్యుడని మరొకడు వాదులాడుకున్నారు. ఇంతలో ఆ దారిన ఒక పెద్దమనిషి రావడం చూసి "మీరు చెప్పండిసార్, అది చందురుడా. సూరీడా?" అని అడిగారు,


"నాకూ తెలీదయ్యా. నే నీ ఊరికి కొత్తగా వచ్చాను." అని అతగాడు తూలుకుంటూ వెళ్ళిపోయాడు.

పేను మందు


తలలో పేలు పడితే అవి పోవడానికి అధునాతమైన మందు కనిపెట్టాడొకా యన.

ఆయన చెప్పినది:

"ఏం లేదుసార్. మంచి విస్కీగాని, బ్రాందీగాని ఒక శేరెషెడు తీసుకొని నెత్తికి రాసుకోవాలి. ఆ పైన ఓ గుప్పెడు గండ్ర ఇసుక జుట్టునిండా జల్లుకోవాలి. ఓ గంటయేసరికి తలలో పేలు మద్యం తాగి కైపెక్కి అంతు జాటులోవున్న రాళ్ళతో ఒకదాన్నొకటి కొట్టుకు ఛస్తాయి."


ఇదిగో ఒక నిరపాయమైన తలనొప్పి బిళ్ల!
అవేదన్





ఆకలి శిఖరాలు

ఆ రోజు సూర్యం ఆఫీసుకి చాలా ఆలస్యంగా వచ్చాడు.

వస్తూనే నా దగ్గరకి వచ్చి నేను అడక్కుండానే సంజాయిషీ చెప్పడం ప్రారంభించాడు.

"మా బస్తీలో రాత్రి చిన్న కొట్లాట జరిగింది సార్! రాత్రంతా ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని గడిపాం."

"ఏం! ఏమైంది?" అన్నాను విసుగ్గా. ఆలస్యంగా వచ్చినవాడు నాకు ముందే వూహించుకోకుండా వస్తాడా అనుకుంటూ.

అందులో సూర్యం చాలా తెలివయిన కుర్రాడు. ఎంతసేపు తప్పు తన మీద లేకుండా తప్పించుకోవటం బాగా తెలిసిన చతురుడు.

"మన హిందువు అమ్మాయిని రాత్రి తురకతను చెయ్యి పట్టుకున్నాట్ట; ఆ అమ్మాయి కేకలు పెట్టింది. వాళ్లూ వీళ్లూ గుమి గూడారు. మాటా మాటా పెరిగింది మీరెంతంటే మీరెంత అనుకున్నారు. పట్టుదలలు వచ్చేసినాయి. మతాల గురించి కులాల గురించి ఎత్తిపొడుచుకున్నారు."

"ఊఁ!" యిక నీ పని చూసుకో మన్నట్టు విసుగ్గా చూసాను.

కాస్త సందిస్తే సూర్యం ఎప్పుడూ దేనిమీదనో, దానిమీద భారతమో, రామాయణమో చెప్పేస్తాడు.

సూర్యం వెళ్ళిపోయాడు.

నగరంలో కొన్ని కొన్ని ప్రాంతాల్లో మతకల్లోహాలు లేపి, దోపిడీ, దౌర్జన్యాలు చేయాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారని, ప్రభుత్వం యిది ముందే పసిగట్టి దానికి తగిన చర్య తీసుకుంటోందని నిన్న ప్రాంతీయవార్తల్లో విన్నాను. ఈ నాయకులకి జ్ఞానం లేదు.

వాళ్ళు వాళ్ళ స్వార్థాలకి, పదవులు నిలుపుకోటానికి ఏదయినా చేస్తారు. యీ మనుష్యులకి అంతకంటే బుద్ధిలేదు. వీళ్ళకి ఆపేక్షలూ ఎక్కువే ఆవేశాలూ ఎక్కువే: ఒక్క నిముషంలో మనమంతా ఒకటి అంటారు. రెండో క్షణంలో పోరా! నువ్వెంత ఏ బ్రతుకెంత అన్నట్టు తీసి

పారేసినట్లు మాట్లాడతారు. దీనికంతటికీ కారణం నిరంతర కుక్షితులు! వాళ్ళకు తెలియదు. ఎదుటవాళ్ళు తమని ఎలా వుపయోగించుకుంటున్నారో గ్రహించలేరు ఏదన్నా వచ్చిందంటే మాత్రం వుద్రేకం వెల్లువలా పొంగి వస్తుంది. వెనకా ముందు చూడలేరు, ఇది వాళ్ళ అమాయకత్వమా? లేక బలహీనతా?

సాయంత్రం 5 గం. అవుతుండగా. సూర్యం కోసం ఎవరో కుర్రాడు వేగంగా వచ్చాడు

కూలిపేటలో దొమ్మి జరుగుతోందిట. కొంతమంది గాయపడ్డారు, ఒక పిల్లాడు చచ్చిపోయాడని తెలుస్తోంది.

నేను వ్రాస్తున్న కాగితాలు ప్రక్కన పెట్టి గబగబా ఆఫీసుకి తాళం వేసి పరుగెత్తాను.

ఇలాటి పన్లకి నేనే వెళ్ళక తప్పదు. శర్మ, శాస్త్రి మిగతా ఎవరికి పురమాయించినా వాళ్లెక్కడో ఓ చోట కూర్చుని వచ్చేస్తారు. రిపోర్టు సరిగ్గా తీసుకురారు.

అందుకని సాధ్యమైనంతవరకూముఖ్య

యద్దనపూడి సులోచనారాణి

ఇద్దరూ కలిసి నా దగ్గరకి పరుగెత్తుకు వచ్చారు.

సూర్యం ఖంగారుగా, గాభరాగా నన్నడిగాడు.

"సార్! మా బస్తీలో కొట్లాటలు అవుతున్నాయట! మా నాయిన వూళ్లో లేడు. నేను యింటికి వెళతాను. మా అమ్మా, అక్క ఒక్కళ్లే వున్నారు."

సూర్యం వెళ్లిపోటానికి అనుమతి యిచ్చాను.

దాదాపు గంట-గంటన్నర తర్వాత—

తెలిసిన ఏజెంట్ ఒకతను ఫోన్ చేసాడు,

మైనవి, యిబ్బంది కలిగితే వాటికి నేనే వెళతాను.

ఆ పేట దగ్గరకి రావటానికి టాక్సీ వాళ్ళు ఎవ్వరూ యిష్టపడలేదు. చివరికి ఆటోరిక్షా అతను మీటర్ చార్జి మీద రెట్టింపు యిస్తానని ఆశ పెడితే వచ్చాడు.

ఆ పేటకి కాస్త దూరంలోనే నన్ను వదిలి వెళ్ళాడు.

ఆ పేట మొత్తానికి ఒక పేటలో ఘర్షణ తీవ్రంగా వుంది.

అక్కడ హిందువులు, ముస్లింలు సమానంగా వున్నారు.

వారం రోజుల క్రితమే యీ పేటకి

జరిగిన కథ

అనాథశరణాలయంలో వచ్చిన వుద్యోగంలో యెంతో కాలం నిలువలేకపోయాను. ఇంటర్‌వ్యూకి వెళ్ళిన నాకు గోపాలంతో పరిచయమైంది ఉన్నట్టుండి గోపాలానికి సుస్తీ చేయడం వల్ల అతని డ్యూటీ నేను చేపట్టి ఆ విధి నిర్వహణలో సమాజంచే దొంగగా ఊహించబడ్డాను.

బాబాయి ఏదో సంబంధం ఉన్నదని ఆరువేల కట్నం ఇస్తారనీ దాంతో తన బాకీ తీర్చవచ్చని ఉత్తరం రాశాడు. నేను ఆ సంబంధం చేసుకోను. నీ బాకీ తీర్చలేని అసమర్ధుడనే అని ఉత్తరం రాశాను. గోపాలం ఆరోగ్యం కొంత కుదుటపడింది, గోపాలం బలవంతంమీద సినిమాహాలు గేటు కీపరుగా చేరటానికి ఒప్పుకున్నాను.

అక్కడ తలవని తలంపుగా పాత పరిచయస్తురాలు శాంతి తటస్థపడింది. సిగ్గుతో కుంచించుక పోయాను. గతమంతా స్మృతిపథంలో తిరగడం మొదలైంది.

తరువాత 'జ్వాలాముఖి' పత్రిక నుండి ఇంటర్‌వ్యూ వచ్చింది. ఎడిటర్ ఆదరంతో ఆ ఉద్యోగం నాకే యిచ్చారు.

ఒక రోజున శాంతి నా కోసం గోపాలం ఇంటికి వచ్చి వాళ్ళ ఫ్యాక్టరీలో మేనేజరుగా చేరమని కోరింది. నాకు వేరే ఉద్యోగం దొరికింది మీ దగ్గర చేరలేను అని చెప్పాను. అలా అన్నందుకు గోపాలానికి నా మీద కోపం వచ్చింది. తరువాత గోపాలం ఆ ఉద్యోగంలో చేరాడు. 'జ్వాలాముఖి' సర్క్యులేషన్ పెంచాలనే ఉద్దేశ్యం 'ఇదీ మనదేశం' అన్న హెడ్డింగుతో ఒక శీర్షిక ప్రారంభించాను.

తరువాత "జ్వాలాముఖి" పేపరు ఎత్తేసి, ప్రెస్‌ను అమ్మేస్తామన్నారు గాని సుభద్రమ్మగారు ఎవరిదగ్గరో డబ్బు తీసుకుని నా చేత నోటు వ్రాయించి యిచ్చారు. దానికి ప్రతిఫలంగా నన్ను అ ప్రెస్‌లో భాగస్వామిగా వుండన్నారు తరువాత ఆ అప్పిచ్చింది శాంత అని తెలిసింది.

కుసుమ ఆత్మహత్య చేసుకోబోయింది. మరోసారి అలాంటి పిచ్చి ప్రయత్నాలు చేయబోనని మాట తీసుకున్నాను. కుసుమని సుబద్రమ్మగారి దగ్గరకు తీసుకు వెళ్ళాను. కుసుమ క్లబ్‌లోవున్న చిన్న లైబ్రరీలో గుమాస్తాగా చేరింది. పత్రిక విషయంలో నాకు, సుదర్శనం గారికి అభిప్రాయం వేరైంది. సత్య తెల్పిన యాక్సిడెంట్ ప్రదేశానికి వెళ్ళాను. అక్కడి భీభత్సం చూసి, నాకు మతిపోయింది. ఒక్కటే వస్తుందనుకున్న సత్యవెంట సలీమ్ కూడా రావటంతో నాకు నిరాశ కలిగింది.

—ఇక చదవండి.



వచ్చాను నేను.

గణేష్ చతుర్ధినాడు. వాళ్లు వాళ్లు ఎలాటి అరమరికలు లేకుండా కలిసి ఆ వుత్సవంలో పాల్గొని నవ్వులతో, కేరింతలు కొడుతూ గంతులు వెయడం నా కళ్ళారా నేను చూసాను.

ఈ కాస్తలో ఎందుకిలా అయిందా, యింత పెద్ద బద్దవైరులుగా ఒకళ్ళని చూస్తే యింకోరు మండిపడటానికి కారణం ఏమిటో నాకు బోధపడలేదు.

కెమెరా తీసుకుని, ఆవేశంతో పూనకం వచ్చినట్టు, పిచ్చెక్కినట్టు ఆవరిస్తున్న ఆ గుంపుల్ని తప్పించుకుంటూ, అవసరం అయితే ఓ పక్కకి తొలిగి నిలబడి [illegible] ముందుకు సాగుతూ నడిచిపోసాగాను. ఇంతలో నా కెదురుగా పెద్ద మంట కనిపించింది. హాహాకారాలు చెలరేగినాయి. ఎవరిదో గుడిసె తగలబడుతోంది.

అందరూ దాన్ని చూసి ఆనందంగా గంతులు వేస్తున్నారు. ఆ మంట చల్లారకుండా అందులో కాగితాలు, కర్రలు ఏవేవో లాక్కొచ్చి వేస్తున్నారు చప్పట్లు చరిచి నవ్వుతున్నారు. నోట్లో వేళ్లు పెట్టి బిగ్గరగా యీలలు వేస్తున్నారు.

తగలబడుతున్న ఆ మంట ముందు ఆనందంగా గంతులు వేస్తూన్న వాళ్ళ ముఖాల్లో దీప్తివంతంగా మెరుస్తున్న ఆ రాక్షసానందం చూడగానే నేను క్షణం

సేపు ప్రాణ్నడిపోయినట్టు అలాగే నిల బడిపోయాను. వాళ్ళసలు మనుష్యులేనా అనిపించింది.

ఇంతలో మరో గుంపు 18 సం. కుర్రాడిని చేతులుమీద ఎత్తుకొని అక్కడికి తీసుకు వచ్చింది. అతని బట్టలు చిరిగి పోయి వున్నాయి. ముఖం మీద దెబ్బ తగిలి రక్తం కారుతోంది.

పహిల్వాన్‌లా వున్న ఇద్దరు గుండాలు ఆ కుర్రానిని కాళ్ళు చేతులూ పట్టుకుని వుయ్యాలలా వూపుతూ ఆ మంటలోకి విసిరిపారేస్తామంటున్నారు,

ఆ కుర్రాడు పిచ్చివాడిలా కేకలు పెడు తున్నాడు,

వాళ్ళకి దణ్ణాలు పెడుతున్నాడు. ప్రతి మాలుటున్నాడు, అరుస్తూ ఏడుస్తున్నాడు.

వాడి క్షోభ అంతా ఆ గుంపుకి మహా దానందంగా వుంది. ఆ దృశ్యం చూడగానే నా రక్తం మరిగిపోయింది! చుట్టు దడికట్టి నిలబడిన ఎవరూ కాదనరేం? వారెవరేలా ఆలికిడింది. వాళ్ళ నిస్సహాయత్వం నాకర్థ మైంది! ఎవరికి వారికే భయం! అన్న కొద్ది ఆ ఘాతుక చర్య ఎప్పుడైనా అవచ్చు!

కొద్దిసేపు ఆ కుర్రాడిని వుయ్యాల వూపి, బెదిరించినట్లు అతన్ని నిలేసారు.

ఒక గుండా అతని వీపు మీద రెండు గుద్దులు గుద్ది సాచినట్టు తోసాడు.

ఆ కుర్రవాడు కొనవూపిరితో బైట పడ్డట్టుగా, అక్కడ నుంచి తూలుతూ పరుగెత్తాడు.

నేను యిక్కడ ఎక్కువసేపు నిల బడటం అట్టే మంచిది కాదనిపించింది. ఫోటోలు తీసుకోవటం కూడా అమోదమే!

వాళ్ళ దృష్టి నా మీద కేంద్రీకరించ బడటం మంచిది కాదు. వుద్రేకంతో విలయతాండవం చేస్తున్న పిశాచాల్లా వున్నారు వాళ్ళు.

సహజంగా నాకు భయం అనేది తెలి యకపోయినా, వివేకం హెచ్చరించడంతో కేవలం జాగ్రత్తగా వుండటమే మంచి దనిపించింది.

ఇంతలో అటువైపు పోలీస్ వాన్ వస్తున్న సైరన్, పోలీస్ విజిల్స్ వినిపిం చాయి. గుంపుగా గుమి గూడినవాళ్ళు ఎక్కడి వాళ్ళక్కడ చెల్లాచెదరయి పోయారు.

పోలీసువాళ్ళు దిగుతూనే లాఠీ చార్జి ప్రారంభించారు,

చాలా మంది పారిపోయారు.

కానీ కొంతమంది మాత్రం ఎదురు తిరిగారు.

పోలీసుల్ని, ప్రభుత్వాన్ని బండ బూతులు తిడుతూ, అక్కడ చేతికందినవి తీసి పోలీసులపైన విసరసాగారు.

చూరు వంగిపోయిన ఒక పాతయింటి వాడలో గోడకి అంటుకుపోయి నిలబడిన నేను అక్కడ నుంచి బైట పడటం ఎలాగా అని చూడసాగాను.

పోలీసులు ముందుకు వెళ్ళిన కొద్దీ

గూండాలు వెనక్కి వెళుతూనే వాళ్ళ మీద రాళ్ళు విసరసాగారు

ఆ సందు కొంత ఖాళీ అయింది

నా వెనక పరుగెత్తుతున్న ధ్వని అయింది

నేనున్న యింటి పక్కనుంచి గూండా లిద్దరు పరుగెత్తటం చూసాను పోలీసులు వున్నారు కాబట్టి నాకంతగా ఏం ప్రమాదం లేదు అనుకున్న నేను ఆ యిద్దరిని ఫోటో తీసుకున్నాను

ఫ్లాష్ బల్బ్ గప్పున వాళ్ళ ముఖాల మీద వెలిగి ఆరిపోవడంతో ఒక్క క్షణం కళ్ళు మూసుకున్నవాళ్లు వెంటనే తెరిచి నా వైపు చూసారు ఎవడ్రా వీడు మన ఫోటోలు తీస్తున్నాడు? ఒకతను అనటం వినిపించింది

ఆ యిద్దరూ నా వెంట బడ్డాయి

ఒక్కడయితే నేను నిలబడి ఎదుర్కో గలిగేవాడినేమో! ఇద్దరవడంతో లాభం లేదనిపించింది

నేను వెనక్కి తిరిగి కాలికొద్ది పరుగు ప్రారంభించాను

వాళ్ళు నన్ననుసరించొచ్చారు

నా కెదురుగా ఎవరిదో యింటి గోడ అడ్డు వచ్చేసింది

ఆ యింటి తలుపులు కిటికీలతోసహా బిడాయించి వున్నాయి దబ దబ ఆ తలుపు తట్టాను

లోపల మనుష్యులున్నారో లేదో తెలి యదు కానీ తలుపులు తెరుచుకోలేదు

వెనక నుంచి గూండా వస్తూనే వున్నాడు

తల తిప్పి అతని వైపు చూసిన నేను పక్కసందులోకి బాణంలా దూసుకు పోయాను

ఆ సందు కూడా చాలా చిన్నదే!

గూండా దగ్గర దగ్గరకి వచ్చేస్తున్నాడు

ఇక పరుగెత్తి లాభం లేదనిపించింది ఆయాసంతో నా గుండెలు పువ్వెత్తున లేస్తున్నాయి

అయినాసరే తెగించి పరుగు ఆపి అత నికి అభిముఖంగా నిలబడ్డాను

ఎవడ్రా నువ్వు అన్నాడు వాడు



"నీ మొగుడిని" అని చెప్పాలన్నంత కోపం వచ్చింది. కానీ ఎలాగో తమాయించుకున్నాను.

"నాకు తెలుసు. పోలీసోళ్ళ మనిషివి. అయితే యిది చేయకం."

నా కెమెరామీద చేయి వేయబోయాడు.

చేయెత్తి బలంగా అతని చేయి మీద కొట్టాను.

ఒక్క క్షణం ఆగాడు, వీధి లైటు కాంతిలో వాడి కళ్లు చింతనిప్పుల్లా మెరుస్తున్నాయి. మనిషి డోసులో వున్నట్టు వాసన గుప్పుమని తెలియ వస్తుంది. నాకు కాస్త ధైర్యం వచ్చింది.

"ఏం? చూస్తావా నా చేతి రుచి" చేయెత్తాడు.

నేను చప్పున పక్కకు తప్పుకున్నాను గూండా నా మీద పడబోయినవాడల్లా గోడ మీద పడ్డాడు.

ఇవతలకి వచ్చిన నేను చురుగ్గా పరుగెత్తబోయాను. వాడిచేయి వచ్చి నా చేయి మీద పడి యినప పిడికిలిలా బిగుసుకుంది.

"వురేయ్" అన్నాడు జేబులోంచి చాకు తీస్తూ.

అది చూడగానే నా ఒళ్ళు ఝల్లుమంది. నా చేయి ఒకటి వాడి చేతిలో చిక్కడి వుంది. రెండో చేయి కెమెరాని గట్టిగా పట్టుకుని వుంది. మనుష్యులతో కలబడటం అయితే రెండు తిన్నా నాలుగు తన్నవచ్చు. కానీ ఆయుధంతో ఎలా? అంచులో అంత పదునుగా, మొనతేలి, తళతళలాడుతున్న దానితోనా?

"చూస్తావురా రుచి?" అన్నాడు. కాని ప్రయత్నం గమనించగానే వాడి కళ్ళలోకి పైశాచికమైన ఆనందం వచ్చింది.

నేను వాడి మాట వినిపించుకోలేదు. రెండు కళ్ళు కేంద్రీకరించి ఆ చాకు వేపే చూడసాగాను.

నాకేమిటో హఠాత్తుగా నా జీవితం అయిపోయినట్టుగా అనిపించింది. ఆ చాకు దిగకూడని చోటున దిగితే యింకేమైనా వుందా!

వేటకత్తి మేకపిల్ల మెడమీద వేయబోనున్న వాడినా వున్నాడు.

అనుకోకుండా హఠాత్తుగా ఏ వెనకమంచో ఏ వెన్నులోనో కత్తిపోటు తగిలితే మనకు తెలియదుగాబట్టి బాధ తెలుస్తుంది తప్ప భయం వుండదు.

యిది ఎదురుగా వస్తున్నా - వస్తున్నా అని చెబుతూ రావటం! ఎలాంటి నిగ్రహాలు, ధైర్యంగల మనిషికయినా మనసు చిగురుటాకులా కంపించక మానదు!

చాకు దగ్గర దగ్గరగా నా పీకకి అభిముఖంగా వస్తోంది. దానివైపు తీక్షణంగా కన్నార్పకుండా చూసిన నేను, చటుక్కున మెరపులా నా బలం అంతా వుపయోగించి పక్కకు తిరిగేసాను. నా పీకలో దిగాల్సిన చాకు బల్లెంగా భుజం దిగువుగా జబ్బలోకి దిగిపోయింది.

నాకు తెలియకుండానే నేను కెవ్వుమన్నాను.

ఒక్కసారి మంటలాంటిది శరీరం అంతా భగ్గుమంది. ఆ నొప్పికి, బాధకి కళ్ళు బైర్లు కమ్మేశాయి.

నా అరుపు వినిపించో, లేక నా దేవతలు కరుణించో ఇంతలో పెద్దగాఅరుస్తూ పోలీసు జీప్ ఆ సందులోకి వచ్చేసింది. ఒక్క క్షణం నా చేయి పట్టి తన వైపు గుంజుకోబోతున్న గూండా ఆగాడు. పోలీసులది చూడగానే నా చేయి వదిలి వెనక సందులోకి మెరుపులా మాయమయ్యాడు.

తలకి హెల్మెట్స్, చేతిలో లాఠీలు వున్న పోలీసులు నా దగ్గరికి పరుగెత్తుకు వచ్చారు. ఒకతను లాఠీ ఎత్తాడు. నేను వాళ్ళకి జేబులోనుంచి నా విజిటింగ్ కార్డు తీసి చూపించాను.

"మీరా! ఈ సమయంలో యిక్కడికి వస్తారా ఎవరైనా?"

నా తెలివి తక్కువ తనానికి మందలిస్తూ. నన్ను అక్కడనుంచి తక్షణం వెళ్ళిపొమ్మని ఆదేశించారు

కత్తి మొన తగిలిన చోట చేత్తో గట్టిగా బిగించి పట్టుకున్నాను.భుజం వూడి క్రింద పడుతుందేమోనన్నంత బాధగా వుంది. అరచేతినిండా తడిగుడ్డ పిండితే వచ్చినట్టు రక్తం వచ్చేసింది. అదేం చూసుకునే టైమ్ లేనివాడిలా ఎలాగో అక్కడ నుంచి బైట పడ్డాను.

వీధిలో అక్కడక్కడా పోలీసులుతప్ప ఒక్క పిట్ట లేదు. ఎక్కడి వాళ్ళక్కడ మాయమయ్యారు, అంతా నిర్మానుష్యంగా వుంది, ఆ గుడిసె యింకా రావణాసురుడి కాష్టంలా తగలబడుతూనే వుంది ఇంతలో ఫైరింజన్ గణగణలాడుతూ ఏస్తూన్నట్టు మోత వినిపించింది. నేను సెంటర్ వరకూ నడుచుకుంటూ వచ్చాను,

మామూలుగా అక్కడ టాక్సీలు, ఆటోరిక్షాలు, రిక్షాలు గుంపుగా వుండేవి. ఈ రోజు ఒకటి కూడా లేదు. ఈ గొడవ మొదలవగానే అన్నీ తలో దిక్కుకీ పిట్టల్లా లేచి పోయాయి. దాదాపు నాలుగు ఫర్లాంగులు నడిచిం తర్వాత ఒక రిక్షా కనిపించింది. రిక్షా అతను వయసు మళ్ళిన వాడు. మొదట ఒప్పుకోలేదు.

తర్వాత వాడు చేయూపి 'కూర్చోండి, నాకు రాత్రిపూట చూపు బాగా ఆనదు బాబూ!' అన్నాడు.

● కిలో సగ మెంత?"

"సున్న, అది ఎలాగో చెప్పడం మొదలు పెడితే పాఠకులు కోపంవచ్చి ఈ పేజి కాస్తా చింపేస్తారు."

● భార్య చెప్పుచేతల్లో ఉంటూ ఆ సంగతి చెప్పడానికి సిగ్గుపడే భర్తల్ని సులభంగా కనిపెట్టవచ్చు. సాధారణంగా వాళ్లు కంచాలు కడుగుతూ ఈలపాట పాడుతూ ఉంటారు.

రిక్షాలో కూలబడ్డాను.

మెయిన్ రోడ్డు మీద నించి వెళ్ళి పోటానికి వీల్లేకపోయింది.

'మీకు తెలీదా బాబూ! కర్ఫ్యూ పెట్టారు' అన్నాడు.

చివరికి ఎలాగయితేనేం సందులు. గొందుల్లోంచి తీసుకు వచ్చాడు. అక్కడికి సుభద్రమ్మగారి యిల్లు దగ్గరవటంతో ఆ అడ్రస్ చెప్పాను. ఆ యింటి ముందు దిగి జేబులోనుంచి పది రూపాయల కాగితము తీసి ఆ తాత చేతిలో పెట్టేసాను. ఈ కర్ఫ్యూ మూలంగా అతను మళ్ళీ అంత దూరం వెళ్ళవచ్చు' వెళ్ళలేక పోవచ్చు. కేవలం గాయపడ్డాననే జాలితో నన్ను తీసుకు వచ్చాడు.

నేను తలుపు తట్టగానే సుభద్రమ్మగారే వచ్చి తలుపు తీసారు.

గుమ్మంలో నిలబడిన నన్ను చూడగానే ఆశ్చర్యపోతూ, 'నువ్వా!' అన్నారు.

నేను నవ్వబోయాను. కాని నవ్వు రాలేదు.

''యిదేమిటి! ఎలా వచ్చావు? అలా వున్నావేమిటి? రా లోపలకి'' ఒక్కసారిగా అనేస్తూ లోపలకి వెళ్ళారావిడ.

నేను లోపలకి అడుగు పెట్టగానే ఆవిడ కెవ్వు మంది.

'అమ్మయ్యో! ఏమిటిది? యింత రక్తమేమిటి?''

నేను క్లుప్తంగా చెబుతుండగా, యింతలో ఎవరు ఆంటీ?' అంటూ సత్య లోపల నుంచి వచ్చింది.

అప్పటికే బాగా నీరసంగా అయి కాళ్ళు వణుకుతున్నట్టున్న నేను అక్కడున్న సోఫాలో కూలబడ్డాను.

''రవి! భుజం మీద ఎవరో కత్తితో పొడిచారుట!''

సత్య అప్పటికే అక్కడికి వచ్చింది.

సుభద్రమ్మగారు అన్న యీ మాట వినగానే సత్య కళ్ళల్లో వున్న నిద్రమత్తు ఎగిరిపోయింది.

ఆదుర్దాగా నా పక్కకి వచ్చి 'గాయం ఎక్కడ ' అంది.

నేను చూపుతాను!

''నా అదృష్టం! డాక్టరుగారు యిక్కడే వుండటం!'' నవ్వుతూ అన్నాను.

సత్యని చూడగానే నాలో నిస్సత్తువ కొద్దిగా ఎగిరిపోయింది. అది నా భ్రమో, లేక వాస్తవమో కానీ, బాధ కూడా యింత అతంలా భరించలేనట్టుగా అనిపించలేదు,

సత్య నన్ను వెంటనే షర్టు తీసేయమని కోరింది,

షర్టు విప్పటమా? అందులో అంతగా పరిచయం లేని యిద్దరి ఆడవాళ్ళ ఎదుట! నాకు కేవలం బిడియంగా అనిపించింది.

'ఆంటీ! త్వరగా కొద్దిగా వేడినీళ్ళు పెట్టు' అంటూ సత్య లోపలికి వెళ్ళింది.

సత్య తిరిగి వచ్చింది. కుర్చీలో యింకా అలాగే కూర్చుని వున్న నన్ను చూడగానే కళ్ళు పెద్దవి చేస్తూ "అదేమిటి యింకా షర్టు విప్ప లేదేం? యిప్పటికి పోయిన రక్తం చాల లేదా?" అంది.

"షర్టు విప్పకుండా కట్టు కట్టడానికి కాదా?" మొహమాటంగా అన్నాను.

"ఎందుకు కాదు?"

సత్య నా దగ్గరగా వచ్చింది. గాయం అయిన చోట కత్తిపోటుకి కొద్దిగా చిరిగిన షర్టుని వేళ్ళతో పర్రున చింపేసింది.

"అరె, యిదేమిటి?" విస్తుపోతూ అన్నాను.

"షర్టు విప్పకుండా గాయానికి కట్టు కట్టాలంటే యిదొక్కటే మార్గం." సీరి యస్‌గా అంది.

సత్యవతికి కోపం వచ్చిందని గ్రహిం చాను.

సత్యని కేవలం ఆగమని షర్టు విప్పే శాను. సత్య గాయాన్ని టించర్ తడి పిన దూదితో క్లీన్ చేస్తుంటే మంటతో భగ్గుమంది! 'అబ్బా!' అన్నాను నిటారుగా అవుతూ.

"ఏం సాహసం గలవాళ్ళకి ఓర్పు కూడా వుండాలే! యీ కాస్త భరించలేరా?

ఒక పిచ్చాసుపత్రిని జిల్లాకలక్టరుగారు విజిట్ చేస్తున్నారు. ఆయన అన్ని వార్డులు చూస్తూ ఒకచోట కొచ్చారు. ఆయన వెనుకనే పిచ్చివాడొకడు వచ్చి భుజం తట్టాడు. కలక్టరుగారు వెనక్కి తిరిగారు.

పిచ్చివాడు:-ఎవరు నువ్వు?

ఆ ప్రశ్నకి కలక్టరుగారు కొంచెం తికమకపడి, క్షణమాగి:

"నేనా - నేను ఈ జిల్లా కలక్టర్ను!" అన్నారు. జవాబు వింటూనే పిచ్చి వాడు పిచ్చి నవ్వు నవ్వి:

"ఫర్వాలేదు. చప్పనే నయమయి పోతుందిలే! నేనిక్కడ కొచ్చిన కొత్తలో గవర్నర్నేవాడిని."

—రాధికా శంభుప్రసాద్

అంది.

సత్యడాక్టర్! రోజుకి నాలాంటి వాళ్ళకి వంద మందిని ముట్టుకోవచ్చు. ఆ స్పర్శ యాంత్రికంగా, ఎలాటి అనుభూతి లేకుండా వుండవచ్చు. కానీ నేను అలా కాదు. మామూలు మనిషిని. ఆడవాళ్ళ స్పర్శ ఎరగని వాడిని. అందులో సత్యని చూస్తేనే నా మనసు విచిత్రంగా అనుభూతి చెందుతుంది. ఆ అమ్మాయి నా గాయానికి కట్టు కడుతూ నన్ను తాకుతుంటే, షర్టు లేకుండా, బనీనుతోనున్న నేను ఆ వేళ్లు తగలగానే చక్కిలిగింతలు పెట్టినట్టు కదిలాను.

"చూడు ఆంటీ! మరీ చిన్న పిల్లాడిలా ఎలా చేస్తున్నారో!" సత్య సుభద్రమ్మ గారితో ఫిర్యాదు చేసింది

ఆవిడ నవ్వారు.

చాలా సేపయిం తర్వాత సత్య నాకు భోజనం వద్దని చెబితే, సుభద్రమ్మగారు బ్రెడ్, వేడి వేడి పాలు యిచ్చారు.

నేను అది తింటూ, పాలు తాగుతూ క్లుప్తంగా నాకు గాయం ఎలా తగిలిందో వివరించాను.

సత్య డైనింగ్ టేబుల్ దగ్గర గా కూర్చుని, నేను చెప్పిన మాటల్ని శ్రద్ధగా వింది!

గూండా నా మీద కలియబడుతున్న దృశ్యం నేను వర్ణిస్తుంటే-సత్య కళ్ళలో గిర్రున నీళ్ళు తిరగటం నేను గమనించక పోలేదు.

(సశేషం)

బాలవాక్యం :-


కొడుకు తెచ్చిన ప్రోగ్రెస్ కార్డు చూసి తండ్రి కోపంగా "ఇవన్నా నీకు వచ్చే మార్కులు? నీ వరస నాకేం నచ్చ లేదు," అన్నాడు.
నేను ముందరే చెప్పానా నాన్నా - మీకు నచ్చదు, చూపించవద్దని కాని మేష్టారే, పట్టికెళ్ళు - అని బలవంతం చేశారు."

మధుర హాస్యం :-

కొన్నేళ్ల క్రితం తమిళ చిత్రాలలో 'హాస్యనటు'గా పేరుపొందిన ఎన్. ఎస్. కృష్ణన్; టి. ఏ. మధురంతో కలిసి ఒకసారి ఓ ఒక టీ-పార్టీకి వెళ్ళాడు. స్వీట్లూ, హాట్లూ అయ్యాక కాఫీ యివ్వబోతుండగా కృష్ణన్ "కాఫీ వద్దు, "టీ" యివ్వమన్నాడు.

"ఏం కాఫీ తాగరా?" అన్నాడు ప్రక్కన కూర్చొన్న మరొకాయన "తాగుతాను కాని టియే మధురం." అన్నాడు కృష్ణన్.

పదబంధ ప్రహేళిక శ్రీశ్రీ




అడ్డం

1. కారుకి పెట్రోలు లాగ కలానికి కావలిసింది
3. ఆ గదిలో. ఈ గదిలో ఏ గదిలో ఉండదు!
7. ఒక రైలుస్టేషను
8. జయించగలిగిన తిరుగుబాటుదారు పొడి అక్షరాలతో గెలిచేది
9. మరో రైలుస్టేషను
11. విరోధాలు (రాత్రికి కావచ్చు)
13. దరిద్రులు
15. ఇంగ్లీషులో వెళ్ళు అరవంలో రా అందుకో మామిడిపండు
17 బ గరు పండే నెల
19 శక్తికాదు, విభక్తి! ఓం ప్రథమంగా
21. ఉదాహరణకి ఇదే
22. 11 లో డా' 9 లో కొన్ని
24. ఇండియా, సిలోన్, ఇజ్రాయెల్ యేలిక
25. రెండు మాత్రలు మేస్తారు!
27. సియార్ నక్క కాదు. స్వతంత్ర నాయకుడు
28. "—" గారం ఒకమసాలా, మొత్తం చెరసాల
30. నీళ్ళమధ్య నేల
31. "—" కట్టడం అంటే చావడం—

నిలువు

2. ఒకరా, ఇంకొకరా, మరొకరా
3. పండు, నీళ్ళలో కొట్టేది
4. ఇళ్ల గుమ్మాల ముందు ఆకారంలేని మేఘాలు
5. వీళ్లు మనమే!
6. మీ చేతికి అలంకారం
10. నాట్యనాయిక
12. గరుత్మంతా! వైనతేయా!
14. ఇది చేతకాని పనికాదు
15 తురకల తిండి
16. కా, వా, వా, వా, వా
17. దుఃఖం వగడానికి గురువు
18 గాలి కావచ్చు అదృష్టం కావచ్చు
20. తెలకు
23 ఇక రాదు
24 తురుష్కమంత్రి
26 ఈ రోజులలో విద్యార్థులు రాళ్లతో చేస్తున్న పని
27. అక్కినేని, నందమూరి ఇద్దరిలోనూ ఉంది
28. శుక్లపక్షం 15.

క్రీ సొల్యూషను నెం 2



విజేతలు :

1 పి. వి. కృష్ణారావు, గుండుగొలను. 2. జె. కృష్ణసోమయాజులు, రాజమండ్రి 3. జిల్లా పరిషత్ ఉపాధ్యాయ బృందం కొత్తపట్నం. 4. డా॥ వై.

జె పి; ఇ వి, యస్. వి. పి; సి. ఎ. పి. పి; పి. ఆర్. 5, వి. ది. సత్యనారాయణ శెట్టి. యం. యస్. సి, తిరుపతి. 6. వి, వెంకటలక్ష్మి ప్రసన్న, బి యస్. సి. ఏలూరు. 7, యస్. యస్. మూర్తి, యస్, వి. రావు, యస్, రాజ్యలక్ష్మి, హైదరాబాద్. 8. ఎ. పి. వరథానమ్మ, గాంధి-4. 9. రమాసుబ్రహ్మణ్యం, న్యూ ఢిల్లీ-23. 10. పామర్తి సుబ్బారావు, సికింద్రాబాద్-15, 11. మల్లవరపు భ్రమరసువాసిని, రామగూడెం. 12. వల్లూరి దుర్గా సావిత్రీదేవి, నాగపూర్. 13. భట్టారం ఉదయిని, కరీంనగర్. 14. ఎ. విజయలక్ష్మి, బొంబాయి-5. 15. ఎన్. రామకృష్ణారావు, విశాఖపట్నం-5.

సమాధానాల మీద శ్రీ శ్రీ రిపోర్టు

ఈసారి చాలామంది నన్నోడించారు. నా ట్రిక్కులన్నీ తెలిసిపోయినట్టుంది. ఒకటి, రెండు తప్పులతో పంపవాళ్ళ పేర్లుకూడా ప్రకటించ మందామనుకున్నాను గాని ఆల్-కరెక్టు జాబితాయే చాలామంది. వాళ్ళందరికీ నా ధన్యవాదాలు. తతిమా వాళ్లకి ఓదార్పులు. ఇప్పటి ప్రహేళికలో మరికొంచెం క్లిష్టమైన క్లూలు ఇచ్చాను. చూదాం. ఎందరు గెలుస్తారో ?

(పజిల్ విషయంలో ఏమైనా నాకు వ్రాయదలిస్తే

C/o. ఎడిటర్ జ్యోతి అని వ్రాయగలందులకు ప్రార్థన).

శ్రీ. శ్రీ.

జబర్దస్తీ :-

ఒక రైతు బస్తీవచ్చి గారడీవాడు తమాషాలు చేస్తుంటే చూసి, చూసి, కొంతసేపటికి జేబులో డబ్బు పోయిందని పిర్యాదు చేశాడు.

"జేబులోంచి డబ్బు తీస్తుంటే దొంగను పట్టుకోలేక పోయావా?" అన్నాడు పోలీస్.

''అది గూడా గారడిలో భాగమే గాబోలు, మనం గొడవ చెయ్యాడమెందు కని ఊరుకున్నానండి.''

పనికిరాని పరిజ్ఞానం

పెద్ద జంతువులలో కన్న చిన్న జంతువులలో హృదయస్పందన అతివేగంగా జరుగుతుంది. ఉదాహరణకు ఏనుగు హృదయము నిముషమునకు 25–40 మార్లు. చిట్టెలుక హృదయము 300–500 మార్లు కొట్టుకొనును.

* * *

తెలుగు భాషలోని మొట్టమొదటి రామాయణం గోనా బుద్ధారెడ్డిచే రచింపబడిన రంగనాథ రామాయణం.

* * *

ప్రప్రథమముగా జైలులో సాహిత్యాన్ని రాసినవాడు గ్రేయిస్ నేవియస్.

* * *

కర్క్ అనే ఇంగ్లాండు దేశస్థుడు రిఫ్రజరేటరును కనుగొన్నాడు.

* * *

ప్రపంచంలోకెల్ల ఎత్తయిన జలపాతం వెనుజులా (దక్షిణ అమెరికా).

* * *

"లవ్స్ లేబర్ లాస్ట్" అను నది షేక్స్పియర్ రచించిన మొదటి నాటకం.

* * *

2000 సం॥ పూర్వము ఆసియాలోని మెగ్నీషియా అనే పట్టణంలో ప్రప్రథమంగా అయస్కాంత శిలలు లభించినవి. అందుచే వానిని ' మేగ్నెట్ " అని పిలుస్తారు.

* * *

రెడ్‌క్రాస్ సంఘాన్ని 1859 లో హెన్రీ డ్యూనాంట్ అనునతడు స్థాపించాడు.

* * *

మానవుని శరీరంలోని 206 ఎముకలు ,—

కపాలము 8, ముఖం 14; హాయాయిడ్ ఎముక 1; చెవికి 3 వంతున 2 × 3 = 6, ప్రక్కటెముకలు 2 × 12 = 24; ఉరోస్థి 1, భుజవలయము 2 × 2 = 4; చేతులకు 2 × 30 = 60; కటివలయము 2 × 1 = 2; కాళ్ళకు 2 × 30 = 60, వెన్నెముక 26.

సేకరణ : డి. జనార్ధన్.

మిలట్రీ బొమ్మ

పైడిపల్లి సత్యానంద్

సత్తిబాబు ఆవులించాడు.

ఆవులిస్తూనే అందరి పిల్లలతో బాటు "రెండొళ్ళు పద్దెమిళ్ళు ముప్ఫై యాళు...." అన్నాడు. యాంత్రికంగా నల్లబోర్డు పక్కనున్న నల్లుల కుర్చీలోని మేష్టారు బెత్తంతో బద్ధకంగా, కుర్చీకోడుమీద కొడుతూ, చిరాకుగా రెండో యెక్కం పిల్లలచేత వల్లింపజేస్తున్నాడు. పిల్లలు ఆ పాకస్కూలు పైకప్పు లేచేటట్టు ఘొల్లుమంటూ ఎక్కం దొక్క చింపేస్తున్నారు.

సత్తిబాబు మళ్ళీ ఆవులించి 'బెత్తం మేష్టారు'కేసి చూసాడు. ఆ నారాయణ మేష్టార్ని పిల్లలందరూ సదా బెత్తం మేష్టరు అనే పిలుచుకుంటారు. ప్రాణం పోయినా ఆయన ఇబ్బంది పడడేమోగాని, బెత్తం పోతే ఊరుకోడుఆయన. ఆ బెత్తం ఆయినకి ఆసరా. ఆయుధం. ఆభరణం.

"ఒరేయ్ పిల్లకాయలూ.... కాసేపు నోళ్ళు మూసుకూర్చోండి. కిక్కురు మంటే చర్మం ఒలుస్తా...." ఓ అర్దరు ఓ టెరిబుల్ వార్నింగ్ ఇచ్చి నీరసంగా కళ్ళుమూసుకున్నాడాయన. నాలుగు నెలల బట్టి గ్రాంటుకాని జీతాలు, ఇంట్లో ఈదురో గోడా అంటూ గోడదగ్గర మంచంమీద పడుకునివుండి ముసల్తల్లి. ముఫ్ఫయి ఏళ్ళ క్రితం బంగారుబొమ్మలా వుండి, ప్రస్తుతం తుప్పట్టినపాతసీనారేకుబొమ్మలా వున్న పెళ్ళాం, రోగాలతో-రొచ్చులతో దిష్టిబొమ్మల్లా వున్న పిల్లలు. తరుచూ వెలగని పొయ్యిలో పడుకునే పిల్లులు, ఒంట్లోనూ, ఇంట్లోనూ, కళ్ళలోనూ ఉండే చీకటి, ఉన్నప్పుడు వచ్చిన ఎక్కాలనే మళ్ళీమళ్ళీ చెప్పుకుంటూ గడిపేసిన ఇరవై అయిదేళ్ళు అన్నీ తలచుకుంటూ బెత్తం ఒళ్లో పెట్టుకుని కూర్చున్నారు బెత్తం మేష్టారు.

గంట ఎప్పుడు మోగుతుందాఅని ఆలోచిస్తున్నారు ఆయన.

ఆఆలోచనతో సత్తిబాబుఆలోచనకూడా ఏకీభవిస్తుంది.

సత్తిబాబుకూడా గంట ఎప్పుడు కొడుతారా అని అనుకుంటున్నాడు.

పాకతో వున్న ఆ పాతగది కిటికీ

లోంచి ఎర్రటి సాయింసంధ్య, లోపలికి పల్చగా పడుతోంది. బెత్తం మేష్టారి వార్నింగ్ లెక్కలేనట్లుగా రణగొణధ్వని చేస్తున్నారు. బుల్లిసూరిగాడు మంచి బొంగరాలు ఎక్కడ దొరుకుతాయో వివరంగా ఓ ఇద్దరికి వివరిస్తున్నాడు. ఊరు చివర దేరాలో ఉన్న 'సరకసు' గురించి గందరగోళంగా చెపుతున్నాడు చంద్రరావు. తన పెనిసిలు పారేసి, తెలీదంటోన్నందుకు మొద్దురావుడిని నాలుగు కొట్టేసి, కసితీరక "బెల్లుకాసీరా .... బయిటున్నయి నీకు కాజాలు." అని బెదిరిస్తున్నాడు సోంబాబుగాడు, మొద్దురావుడు 'బెల్లెప్పుడవుద్దా' అని బెంగెట్టేసుకున్నాడు. మహాలక్ష్మి వరాలుకి 'సుక్కలాట' నేర్పుతోంది. శివయిగాడు వాచికం వాడికి తెలీకుండా చింపినందుకు, కళ్ళనీళ్ళెట్టుకుని, మేష్టర్ని మినహాయించి అందర్నీ అనుమానించి బూతులెట్టుకుంటున్నాడు. కేశవలు గాడు వాడుమొన్న చూపిన 'ఎన్టీవోడి స్టంట్‌సినిమాలోని కుస్తీ లని అభినయిస్తూ రవణమ్మని, రాజమ్మని సీతని ఝడిపిస్తున్నాడు. క్లాసు క్లాసులా లేదు. జూనియర్ కురుక్షేత్రంలా వుంది.

సత్తిబాబుకి మాత్రం 'గంటెప్పుడవుద్దా' అని వుంది.

అందుకు కారణం వుంది. సత్తిబాబు మళ్లీ ఆవులించాడు. మేష్టరుకేసి చూసాడు. వాడు అప్పుడెప్పుడో రోడ్డుమధ్యగుంపులో ఎవడో ఓ పాముకీ: ముంగీసకీ దెబ్బలాట పెట్టడం చూశాడు. పెద్దపాము, చిన్న ముంగీస. రెండూ చాలాసేపు కొట్లాడుకున్నాయి. ఆ కొట్లాటలో అప్పుడప్పుడు ఆ పాము, ముంగీసకి భయపడి వెర్రిముండలాగ ముడుచుకుపోయేది. అలా ముడుచుకున్న పాములాగ అనిపించారు కర్చీలోని బెత్తం మేష్టారు వాడి మనసుకి! ఏడాది నుంచీ బడికివస్తున్న తనకే 'విసువుగా' ఎప్పుడు పోదామా అనివుంది....పాపం బోళ్ళఏళ్ళనుంచీ వచ్చే మాష్టారుకి పోదాం అనిపించదా.... విసువు వెయ్యదా....అని పిస్తుంది అప్పుడప్పుడు వాడికి.

కాని బెత్తం మేష్టారుకి, బడిమీదేకాక బతుకుమీదే విసుగ్గా వుందని బళ్ళోంచి.... ఊళ్లోంచేకాక భూమ్మీంచే పోదాం అని పిస్తుందని వాడికి తెలీనే లేదు.

గంట కొట్టారు.

పిల్లలు లబ, లబ లాడుతూ.... తోసుకుంటూ...., తొక్కుకుంటూ .... కేకలు వేస్తూ.... పరుగెడుతున్నారు. నెత్తురు నరకంలోంచి, పెనుభూతపుపిడికిలిలోంచి. పువ్వులలోకి, నవ్వులలోకి వెళుతూన్నట్టు పరుగెడుతున్నారు. బెత్తంమేష్టరు స్కూలు అనే బాధలోంచి, కొంప అనే భయంలోకి వెళ్ళాలని విచారంగా ఒళ్లు విరుచుకుని లేచారు.

సత్తిబాబు అందర్నీ తోసుకుంటూ వీధిలోకి వచ్చాడు. వేగంగా, ఉషారుగా నడుస్తున్నాడు.

సన్నటి ఆ సందులో అక్కడోటీ, అక్కడోటీ విసిరేసినట్టు ఉన్నాయి వేప

చెట్లు. చెట్ల ఆకుల్లోంచి. ఎర్రటి సాయం సంధ్య నెత్తురు డాగుల్లాగ నేలమీద పడు తోంది. పరుగెడుతున్న పిల్లల అలజడికి, అక్కడా అక్కడా వున్న కాట్లకుక్కలు అటూ, యిటూ పరుగెడుతున్నాయి. రోడ్డు ప్రక్కన చెప్పులకొట్టు సోమయ్య, బిచాణా ఎత్తేస్తున్నాడు. సాయంకాలపుచల్లగాలిమెల్లి గా వీస్తోంది. ఎండిన ఎంగిలాకులు, ఎవరి కోసమో ఎగిరెగిరి ఎటో పడుతున్నాయి.

సత్తిబాబు ఉషారుగా నడుస్తున్నాడు.

వాడి ఉషారుకి బడి వదలటం అనేది కారణం కాదు. మరో ముఖ్య కారణం వుంది....

"నాన్నారు మిలట్రీ బొమ్మ తెచ్చేసుం టారు." అనుకున్నాడు.

వేగంగా నడుస్తున్నాడు.

సుమారు పదిహేను రోజులక్రితం సత్తి బాబు వాళ్ళ నాన్నారితో కలపి బొమ్మల కొట్టుకి వెళ్ళాడు. నాలుగునెల్లున్న మూడో పిల్లకి ఓ గిలక్కాయ కొనాలని, కొనమని పెళ్ళాం పదేపదే చెప్పగా దాని ఖరీదు పద ణాలు అని తెలిపి, ఓ రూపాయి జేబులో వేసుకుని, పెద్దాడ్ని వెంటేసుకుని బొమ్మల కొట్టుకి వెళ్ళాడు సూర్నారాయణ. రంగుల దీపాల వెలుగులో రంగురంగులబొమ్మల్తో ఆ కొట్టు 'బొమ్మల లోకం'లా అనిపిం చింది సత్తిబాబుకి. అద్దాల బీరువాల్లో పెద్దవీ చిన్నవీ, చితకవీ, అన్నీ కనిపించాయి. వాడికి. ఆ కొట్లో అమ్మకంజరిపే తెల్ల చొక్కా ఆసాములు, పెద్ద పెద్ద బొమ్మ



ల్లాగ కాసేపు - బొమ్మలువున్న అదృష్ట వంతుల్లాగ కాసేపు అనిపించారు వాడి ప్రాణానికి. కానీ వాళ్ళ నాన్నారికి ఆయన ప్రాణానికి "డబ్బుల్లోచేసే దొంగ వెధ

వల్లా....'' అనిపించారు వాళ్ళు. వాళ్ళ నాన్నగారు తక్కువ వెలలో, ఎక్కువ చప్పుడుచేసే మేలురకం గిలక్కాయని ఎంచుకునే ప్రయత్నంలో వుండగా సత్తిబాబు ఆయన చెయ్యి విడిపించుకుని, బొమ్మల తనిఖీకి బయల్దేరాడు. లాగూ, చొక్కా వేసుకున్న కోతిబొమ్మ వాడికి బావుంది డప్పువాయించే ఎలుగుబంటి వాడికి నచ్చింది, గడుగ్గాయిలా కళ్ళుకదిపే దొరసానిబొమ్మ వాడికి కావాలనిపించింది ఆటోమేటిక్ పిస్టల్ వాడికి పట్టుకుపోవాలనిపించింది. సింహం బొమ్మ, చేపలవాడి బొమ్మ, గుర్రంబొమ్మ వాడికి తప్పకుండా కొనుక్కోవాలనిపించింది. ఆ తరవాత వాడు చూసాడు మిలట్రీ బొమ్మని. ఆ మిలట్రీవాడి నెత్తిన ఎర్రటోపీ వుంది. చేతిలో ఓ తుపాకీ వుంది. కాళ్ళకి బూట్లు, సాక్సులు వున్నాయి. ఆ మిలట్రీవాడు చాలా ధీమాగా చూస్తున్నాడు. "నన్ను కొనుక్కోరా సత్తిబాబూ....'' అంటోన్నట్టున్నాడు వాడు.

సత్తిబాబు ఆ మిలట్రీబొమ్మకేసిచూస్తూ వుండిపోయాడు.

అద్దానికి మొహం ఆన్చి, కళ్ళు పెద్దవి చేసి, ఆ బొమ్మకేసి చూస్తూ వుండిపోయాడు.

ఆబొమ్మ వుండాలి. తనకి వుండాలి. అనుకున్నాడు వాడు

ఆ బొమ్మలేకపోతే బ్రతుకు నిరర్ధకమనిపించింది వాడికి.

ఆ మిలట్రీవాడికి వెనకాల ఓ 'కీ' వుంటుందని, ఆ కీ ఇస్తే వాడు అటూ ఇటూ కవాతు చేస్తాడని వాడికి తెలుసు. సరిగ్గా అలాటిబొమ్మనే వాడు ఓ నెలక్రితం చిట్టిగాడి ఇంట్లో చూసాడు. అది వాళ్ళ నాన్నగారు 'హైద్రాబాద్ నుంచి తెచ్చారని చిట్టిగాడు చెప్పాడు! కీ యిచ్చిచూపించాడు కూడాను.... 'అలాటిది ప్రపంచంలో ఒకటే వుందనీ, ఆదికాస్తా వాళ్ళనాన్నారు కొనేసారని' చిట్టిగాడు చెబితే సత్తిబాబు కాస్త బాధపడ్డాడు.

ఇంకోటుంటే మా నాన్న కొనేశును'' అన్నాడు. ఇంటికి వచ్చేశాడు. ఇప్పుడు ఈ మిలట్రీబొమ్మ చూడగానే అలాటిది ఇంకోటికూడా వుందని అనుకున్నాడు.

వెంటనే ఆలస్యం చెయ్యకుండా ఆ ఒక్కటీ కొనేసుకోవాలని అనుకున్నాడు.

"నాన్నారూ....'' అని పిలిచాడు.

గిలక్కాయకి అరవై పైసలిచ్చి, మిగిలిన నలభై పైసలు లెక్క చూసుకుంటున్న సూర్నారాయణ—"ఏంట్రా బాబూ....'' అని వాడివైపు తిరిగారు.

సత్తిబాబు వేల్తో మిలట్రీబొమ్మకేసి చూపించాడు.

"మిలట్రీవాడి బొమ్మ బావుందొరేయ్ బావుంది....''బొమ్మని అప్రిషియేట్ చేశాడు సూర్నారాయణ ఖర్చులేని పనికనక.

"నాక్కావాలి....'' సత్తిబాబు చల్లచల్లగా చావుకబురులా చెప్పాడు.

"కొనుక్కుందాం....మళ్లీవచ్చి కొను

కు్కుందాం...." సూన్నారాయణ, సత్తి బాబు చెయ్యి పట్టుకుని బైటకి బయల్దేరాడు

సత్తిబాబు మొరాయింపాడు. "నాకది కొనూ...." తలాయించి అడిగేశాడు.

ఈ లోపల కొట్లో తెల్లబట్టలఆసామి, కుర్రాడి మోజు కనిపెట్టేసి "ఇదా బాబూ" అంటూ మిలట్రీవాడిని బయిటకి తీసి, బల్లమీద పెట్టి కీ యిచ్చి వదిలాడు. మిలట్రీవాడు హుాందాగా, దర్జాగా, ఓ నాలుగడుగులు వేసి మళ్ళీ బిగుసుకు పోయాడు.

"ఆ బొమ్మకోసం...." అన్నాడు సత్తి బాబు.

"ఎంతండీ అది...." సూన్నారాయణ బితుకు, బితుకు మంటోనే అడిగాడు.

"ట్వెల్వ్ రుపీస్...." చిన్నగానవ్వాడు తెల్లచొక్కావాడు.

సూన్నారాయణ కాళ్ళు చల్లబడ్డాయి.

వెధవ బొమ్మ పన్నెండ్రూపాయరా... దారుణం, దారుణం, భూమ్మీద పాపం ఎక్కువై పోతోంది అనుకున్నాడు.

"ఒరేయ్ బాబూ— మళ్ళీవచ్చి కొను క్కుందాం...." సూన్నారాయణ, సత్తి బాబుని బుజ్జగించబోయాడు. 'నాన్నారు,

ఆబద్ధాలుచెప్పి మోసం చేశేబోతున్నారని కనిపెట్టేసట్టున్నాడు వాడు.... ఉహూఁ వద్దు ఇప్పుడే కొను....ఁ....ఁ" అన్నాడు.

"మళ్ళీవద్దాంలే...." రెక్కపట్టుకుని కొడుకుని కదపబోయాడు

"బొమ్మాఁ...." అనే రాగం తీస్తూ, మిలట్రీ బొమ్మలా బిగుసుకు పోయాడు సత్తిబాబు. సూన్నారాయణకి కాళ్ళలోంచి కంగారు పట్టుకుంది.

"సీకు పదపైసలు ఇస్తాగా...." ఆశ పెట్టబోయాడు.

'నాకొద్దూ...' అంటూ తన అభిప్రాయాన్ని వెల్లడి చేసాడు సత్తిబాబు

కొట్టువాడు సరదాగా చూస్తున్నాడు.

సూన్నారయణ అమాంతం కొడుకుని ఎత్తుకుని గబ, గబ కొట్లోంచి బైటకి పరుగెత్తాడు - అక్కడుంటె ఇక ప్రమాద మని.

సత్తిబాబు ఏడుపు అందుకున్నాడు.

సూన్నారయణ ఓ కిళ్లీకొట్టదగ్గర ఆగి, రెండు చాక్లెట్స్‌కొని వాడికిచ్చాడు. ఇచ్చి 'రేపెళ్ళి కొనుక్కుందాం... ఏడవకురా బాబూ ఏడవకు....' అన్నాడు.

సత్తిబాబు చాక్లెట్స్‌ని ఓ సారిచూచి, అవి 'లంచం' అని కనిపెట్టి, అవి తింటే తాను లొంగిపోయినట్టు లెక్క అని ఊహించి, బలంగా ఎడంగా ఉన్న కాలవలోకి గిరవాటేశాడు.

సూన్నారాయణకు ఒళ్ళు మండింది.

'విళ్ళలేం చేశాయిరా అలా విసిరేశు కున్నావు...." అని కసురుకున్నాడు.

సత్తిబాబు సమాదానం చెప్పకుండా ఏడుస్తున్నాడు. సూన్నారాయణ ఇక లాభం లేదని, రిక్షా కేకేసి ఎక్కి, "వేగిరం.... వేగిరం" అంటూ, వేగంగా కొడుకుతో ఇంటికి జేరాడు.

ఇంట్లో ఏడుపు స్వాతంత్రం ఎక్కువుంది కనుక 'ఘొల్లు'మని ఏడిచాడు సత్తిబాబు.

"ఏమిట్రాఁ బాబూ.... ఏమయిందండీ వీడికి...." ఆదుర్దాగా భర్తని అడుగుతూ కొడుకుని దగ్గరికి తీసుకుంది శాంతమ్మ.

"నా తలకాయ అయిండి. వెధవసంత. వెంటబెట్టుకు వెళ్ళకపోయినాబావుండును." అని విసుక్కుంటూ. బట్టలు మార్చుకుని పెరట్లోకి వెళ్ళాడుసూన్నారాయణ.అప్పుడు సత్తిబాబు ఏడుస్తూనే 'బొమ్మ' గురించి 'అమ్మ'కి చెప్పాడు.

"ఏమిటండీఁ.... మిలట్రీ బొమ్మ అంటాడు...." అని భర్తను అడిగింది ఆ ఇల్లాలు.

"ఏడిశాడు. ఆ కొట్లో ఓ మిలట్రీవాడి బొమ్మ తగులడింది.... అది కావాలని గొడవ.... వెధవ గొడవ.... వెధవ గొడవాని...."

కొన్లేక పోయారా...." ఆవిడ అంది.

"బుద్ధిలేపోతే సరి.... వెధవ మిలట్రీ వెధవ బొమ్మ .... పన్నెండురూపాయలట. మన బతుకులకి తోడు.... పన్నెండ్రూపాయిల బొమ్మ కూడానూ...."

విసుక్కుని కసురుకున్నాడు సూన్నా రాయణ.

శాంతమ్మ మరిమాట్లాడలేదు. మౌనంగా వూరుకుంది.

సత్తిబాబు మాత్రం వూరుకోలేదు. ఆ రోజు నుంచి, ప్రతీ రోజూ, సాధ్యమయినంత ఎక్కువ సమయం ఏడవసాగాడు. ఇంట్లోవున్న ఒకటీ, అర పాతబొమ్మల్ని వీదిలో పారేశాడు. అన్నం తినడం మానేశాడు. ఎప్పుడూ ఒకటే ఏడుపు-'' మిలట్రీ బొమ్మ.... మిలట్రీ బొమ్మ....''

నాలుగయిదు రోజులు శాంతమ్మ పట్టించుకోలేదు వాడి ఏడుపుని.

సూన్నారాయణ పట్టించుకుని పడ చీవాట్లెట్టే వాడు కొడుకుని.

సత్తిబాబు పట్టు వదల్లేదు.

రాత్రిళ్ళు నిద్రలో కూడ పలవరించ సాగాడు,

శాంతమ్మ బెంగెట్టుకుంది,

సూన్నారాయణకి దిగులు పట్టుకుంది.

కొడుకు వాలకం చూసి భార్యాభర్తలు ఇద్దరూ కంగారు పడ్డారు.

''చిన్నవెధవ ఏదో రెండ్రోజులు ఏడిచి ఊరుకుంటాడనుకున్నారు'' గాని ఇలా పట్టువదలని విక్రమార్కుడి మార్కు కుర్రాడిలా, తయారవతాడని అనుకోలేదు.

''పోనీ ఆ బొమ్మ కొని పారేయకూడదండీ....'' ఒక రాత్రి శాంతమ్మ అంది.

మంచం మీద కూర్చున్న సూన్నారాయణ, ఇల్లాటి కళ్ళ కేసి చూసాడు-

ఇద్దరి చూపుల్లోనూ, చీకటిలో మెరుపులా, బాధ కదిలింది.

పన్నెండు రూపాయల విలువ వాళ్ళకి బాగా తెలుసు.

పన్నెండు రూపాయలు పెడితే, చిరుగుల చీరలు కట్టుకెని బ్రతికే పెళ్ళానికి ఓ చీర వస్తుందని. బీటలు పడిన చిమ్నీతో వున్న అరికెన్ లాంతరుకి బదులు కొత్త అరికెను లాంతరు వస్తుందని, తెగిపోయి డజను కుట్లతో వున్న తనచెప్పులకి బదులు కొత్తచెప్పులు వస్తాయని, రెండోపిల్లకటానిక్ సీసా వస్తుందని, ఎప్పటినుంచో సినిమా చూడాలనే కోరిక తీరుతుందని, ఆర్నెల్లక్రితం అయిపోయిన పౌడర్‌డబ్బా, పళ్ళూడిన దువ్వెన, బీటలుపడిన అద్దం వస్తాయని, తెగిన నవారున్న మంచానికి కొత్త నవారు వస్తుందని, ఓ వారం రోజులపాటు అన్నంలోకి కూరా-నారా వస్తుందని, ఇంకా, ఎన్నో.... ఎన్నెన్నో

పరుపైన మాట :

పల్లెటూరి రోడ్డుమీద ఒక చిన్న కారు ఆగి ఉంది. దారేపోతున్న ఒక గాడిద దాని కేసి ఆశ్చర్యంగా చూసి చూసి అడిగింది. ''నువ్వెవరు?'' అని.

''నన్ను ఫియట్ అంటారు'' అంది గర్వంగా కారు, "నువ్వెవరు?'' గాడిద అటూ ఇటూ చూసి మెల్లిగా ''నేను గుర్రాన్ని" అంది.

వస్తాయని సూన్నారాయణకి తెలుసు.

శాంతమ్మకి కూడా తెలుసు.... తెలుసు....

వాళ్ళ బతుక్కి పన్నెండు రూపాయలతో - వెన్నెల వుంది. వెలుగు వుంది.

పన్నెండు రూపాయలకి - సంతోషం వుంది. సరదా వుంది.

పన్నెండు రూపాయలకి - మాధుర్యం వుంది. ఎంతో విలువ వుంది.

పన్నెండు రూపాయలలో కొన్ని గడిచే రోజులున్నాయి. వెలిగే కలలు వున్నాయి.

పన్నెండు రూపాయలకి వెలలేనిఖరీదు వుంది వాళ్ళ దృష్టిలో....

"ఓ దిక్కుమాలిన మిలట్రీ బొమ్మ కోసం పన్నెండ్రూపాయలు తగలెయ్యటం నిజంగా, ఘోరం, ఘోరం."

అందుకే ఆ రాత్రి ఆ ఆలూ-మగలూ ఒకరి కళ్ళల్లోకి ఒకరు అలా చూసుకున్నారు. అదే సమయంలో ఏకంగా నేల మీద పడుకున్న సత్తిబాబు....నిద్దట్లో.... "మిలట్రీ....బొమ్మ...."-అని పలవరించాడు. ఒకసారి వాడికేసి చూసి, మళ్లీ సూన్నారాయణ కళ్ళల్లోకిచూసి చేతులతో మొహం దాచుకుంది శాంతమ్మ.

పెళ్ళాం ఏడుస్తోందని గ్రహించాడు సూన్నారాయణ.

ఆ నాలుగు గోడల మధ్య, గుడ్డిదీపవు వెలుగులో. చేతులలో మొహం దాచుకుని నిశ్శబ్దంగా ఏడుస్తోంది శాంతమ్మ.

ఇది జీవితం. ఇది ప్రపంచం. ఇది నిన్ను ఏడిపిస్తుంది. ఇది నిన్ను గాయపరుస్తుంది.

నీవి అతిస్వల్పమయిన కలలు.... అయినా అవి ఎప్పుడూ తీరవు.

నీ గుండెలో ఎప్పుడూ మంటలు.... అవి ఎప్పుడూ, ఆరవు, ఆరవు.

నీ బ్రతుకులో వచ్చిన పువ్వులు.... అవి మరి పుయ్యవు, పుయ్యవు.

కాసింత వెలుగు అయినా నీ ఇంటి ముందు వాకిట్లో కురియదు, కురియదు.

నీ కొడుకు ఎవడికొట్లోనో బొమ్మ కోసం ఏడుస్తాడు. నువ్వు వాడి అమ్మవయి ఏడుస్తావు. నీ మొగుడు బ్రతుకు

చేతిలో వెర్రిబొమ్మై నిలుస్తాడు.

మీ అందరూ మట్టిబొమ్మలయి, విరుగుతారు, కరుగుతారు.

ఆరాత్రి సూన్నారాయణ నిద్రపోకుండా దెయ్యంలా కూర్చున్నాడు.

తెల్లవారింది. ఆ తరవాత మరోమూడు సార్లు తెల్లవారింది.

సూర్యుడు ప్రతిరోజూ ఉదయిస్తున్నాడు.

సత్తిబాబు ప్రతి ఉదయం 'మిల్ట్రీ బొమ్మ' గురించి అనర్గళంగా ఏడుస్తున్నాడు.

"వెధవకి దెయ్యంగాని పట్టిందేవిటేఁ." సూర్నారాయణ ఉండబట్టలేక అన్నాడు.

"ఛాఁ.... అవేం ముక్కలండీ ...", కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ అందిశాంతమ్మ.

మరో రెండు రోజులు చూశాడు సూర్నారాయణ. మరి లాభం లేదనుకున్నాడు. ఆ రోజు పుదయం సత్తిబాబు-శాంతమ్మ - మధ్యనుండ - కడిగొట్టుడి - అందరూ వుండగా ప్రకటించాడు - "ఆ సాయంకాలం, మిలటరీ వాడి బొమ్మ తేబోతున్నట్టు."

సత్తిబాబు నమ్మలేనట్టు ఓ సారి నాన్నాకేసి చూసాడు.

ఇదేదయినా అబద్ధపు ప్రకటన ఏమో అని వాడికి వాస్త అనుమానం కలిగింది.

అది గ్రహించి "నిజంగానే ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు పట్టుకొస్తాను...." అని నొక్కి వక్కాణించాడు సూన్నారాయణ.

సత్తిబాబు కళ్ళల్లో ఆశ్చర్యం, ఆనందం ఒక్కసారిగా మెదిలాయి.

చాలాకాలం తుసానులో చిక్కుకున్న ఓడలోని ప్రయాణీకులికి, ఓ ఉదయం పచ్చటి సూర్యుడు, అల్లరిచెయ్యనిసాగరం, కనిపించే పచ్చటి నేల చల్లటివాతావరణం- ఒక్కసారిగా ఎదురవుతే కలిగే ఆనందం, కలిగింది వాడికి. కోటి జన్మల కోరిక తీరుతోన్నట్టు, అనిపించింది వాడికి.

నాన్నారు దేవుడిలాగా అనిపించారు వాడికి.

సత్తిబాబు నవ్వాడు.

సరదాగా నవ్వాడు.

అఁగోరా బాబూ.... బొమ్మ తెస్తానంటున్నారు నాన్నారు. మరి ఇవాళ బడికెళతావా." అంది శాంతమ్మ. తలూపాడు సత్తిబాబు.

అప్పుడు వాడు బడికి వెళ్లాడు. కొడుకు బడికి వెళ్ళాక, భర్తఆఫీసుకు వెళ్ళేముందు అడిగింది శాంతమ్మ-" ఆ బొమ్మకి డబ్బెక్కడదండీ ఇప్పుడు-" అని.

ఆఫీసులో సుబ్రమణ్యాన్నడిగానునిన్న. ఇవాళ ఇస్తానన్నాడు ఆఫీసులో...."

సూన్నారాయణ సమాధానం చెప్పి బయటికి నడిచాడు.

ఆ మధ్యాహ్నం సూన్నారాయణ - సుబ్రమణ్యాన్ని పన్నెండు రూపాయలు అడగటం, 'సారీ బ్రదర్ సర్దుబాటవలేదు రేపిస్తాను....' అని సుబ్రమణ్యం చెప్ప

టం, మతిపోయినవాడిలా ఆ మధ్యాహ్నపు మండుటెండలో సూర్యనారాయణ నిలబడిపోవటం. ఆ సాయంకాలం ఆఫీసు నుంచి "అగర్వాల్ పాన్ బ్రోకర్స్" దగ్గరకు వెళ్ళి, కుడిచేతి చిటికెనవ్రేలినున్న పెళ్ళినాటి ఉంగరం తాకట్టు పెట్టి ఇరవై రూపాయలు సూర్యనారాయణ పుచ్చుకోవటం, ఆ దిక్కుమాలిన 'మిలట్రీబొమ్మ' వున్న బొమ్మల కొట్టుకేసి అతను నీరసంగా, బయలు దేరటం,- ఇవేవి బడినుంచి ఇంటికి వస్తోన్న సత్తిబాబుకి తెలీదు. తెలీనే తెలీదు. వాడికి తెలిసున్నదల్లా-" నాన్నారు ఇవాళ మిలట్రీబొమ్మ తెస్తారు. అన్న విషయం మాత్రమే.

సత్తిబాబు సందులోంచి రోడ్డుమీదకి వచ్చాడు. ఆ సాయంకాలం ఆ నగరపు నడిబొడ్డున, ఆ మెయిన్‌రోడ్డుమీద అందంగా పరుచుకుంది. క్లబ్బులకేసి బయిల్దేరే ఖరీదయిన కారులు. కిటకిటలాడే జనంతో. పెట, పెటలాడే బస్సులు, చేతులు ఎత్తి తడుపుకువస్తున్న చావునుంచి తప్పించుకోడానికా అన్నట్టు హడావిడిగా పరుగెత్తే ఆడవాళ్ళు, మగవాళ్లు, పిల్లలు పెద్దలు ... అంతా సందడి. అంతా అలజడి.

ఆ సాయింకాలం - అమెరికన్ మ్యూజిక్‌కి అంగాంగం అదిలించి, విదిలించి, నీ కళ్ళముందు కదిలించే కేబ్‌రట్ డాన్సర్‌లా వుంది.

ఆ సాయం సంధ్య - నీ జవరాలి నునులేత చెక్కిళ్ళపై విరబూసిన కెంపు వెన్నెల. సిగ్గుల, నిగ్గుల నిగ నిగలాగ వుంది.

ఆ సంధ్యాకాల రక్తిమ నీ ప్రేయసి అరుణాధర తాంబూల రక్తిమలాగవుంది. సత్తిబాబుకి ఆ సాయంకాలం బొమ్మల కొట్టులాగ, ఆ మనుషులు కీ యిచ్చిన బొమ్మలు లాగ, కార్లు కీ కార్లులాగ, అనిపిస్తున్నాయి. సత్తిబాబుకి ఇంటిపట్ల సరదా ఎక్కువయ్యింది.

'మిలట్రీవాడి బొమ్మట్టుగుని పిట్టిగా డింటికి పోవాల, పీరునాయుడు అట్టాంటిది పెపంచకంలో ఓటే వుంటుందని కోసే గాదు. ఇది సూపించి ఇంకోటీకూడా వుందొరేయ్ ఎర్రినాయాలా.... అని సెప్పాలి. నా బొమ్మ సూసి ఎధవ సూపు తేల్చేస్తాడు. అడికివ్వను, ఇవ్వను గాక ఇవ్వను, వాడిది నాకిచ్చేదేటి? ఆ బొమ్మ ఎంకులుగాడికి, సుబ్బిగాడికి, మొద్దు అప్పిగాడికి సూపించాలి. ముట్టుగోనియ్యను. 'కీ' నానే త్రిప్పి సూపిత్తాను. అల్లందరూ "ఒరేయ్ సత్తీ ఓమారివ్వరా." అని బతిమాలెత్తారు అప్పుడు నాను సెనకమాకూడదు. అల్లందరూ కిందవడి దొల్లేసి, సచ్చినా యివ్వను. రేతిరి బొమ్మిలపెట్టిలో పెట్టి తాలం ఎయ్యాల. దొంగనాయాళ్లు కొట్టేసినా కొట్టీగ్రలు....

సత్తిబాబులో ఉషారెక్కువయింది.

ఎగ్జైట్‌మెంట్‌తో వాడి మనసు వాడిని ఊపేస్తోంది. అదే సమయంలో




ఫొటోగ్రఫీలో వినోదం కోసం అగ్ఫా క్లిక్ III

అభ్యాసానికి, అనుదిన వినియోగానికి అత్యుత్తమం

- ఉపయోగించుట తేలిక. ఎడ్జస్టుమెంట్లు అవసరం లేదు.
- ప్రతి 120 ఫిలిమ్‌తో, 12 పెద్ద సైజు (6 x 6 సెమీ) చిత్రాలు తీయవచ్చు.
- ఎవర్-రెడీ కేస్, పోర్ట్రెయిట్ లెన్సు, మరియు ఫ్లాష్ గన్ అదనపు వెలకు లభిస్తాయి.

రంగులు మెరుమిట్లు గొలిపే ప్రింట్లు, ఎన్‌లార్జిమెంట్లు కావాలంటే, అగ్ఫా ఫొటో పేపరే వాడండి.



రు. 40.00
(పన్నులు అదనం)

అధీకృత అగ్ఫా డీలర్ల వద్ద లభిస్తాయి.
అగ్ఫా గెవార్ట్ సహకారంతో, తయారు చేయువారు:
ది న్యూ ఇండియా ఇండస్ట్రీస్ లి., బరోడా.

ఏకైక పంపిణీదారులు:
అగ్ఫా-గెవార్ట్ ఇండియా లిమిటెడ్
బొంబాయి . క్రొత్త ఢిల్లీ . కలకత్తా . మద్రాసు

® ఫొటోగ్రఫిక్ ఉత్పత్తుల నిర్మాతలు, అగ్ఫా-గెవార్ట్ ఎ.జి. లెవర్కుసెన్ యొక్క రిజిస్టర్డ్ ట్రేడ్ మార్కు.

అగ్ఫా క్లిక్—భారతదేశంలో విస్తార ప్రచారంలో ఉన్న కెమెరా

CMAG-130-

రోడ్డుకి అటుపక్కన బొమ్మలకొట్టు కనిపించింది వాడికి. బొమ్మలకొట్టు ఒకటే కనిపిస్తే బాగానే వుండును, ఆ కొట్లోకి వెళుతున్న సూర్నారాయణ కనిపించాడు.

"నాన్నారు మిలట్రీ బొమ్మ కోసవే" సత్తిబాబు పట్టరాని ఆనందంతో రోడ్డుకి అడ్డంపడి బొమ్మల కొట్టువైపుపరుగెట్టాడు.

ఆ క్షణంలో కొట్లోనితెల్లబట్టలఆసామి సూర్నారాయణతో-

"సారీ సార్ ఆ మిలట్రీ బొమ్మలు అయిపోయాయి నెక్స్ వీక్‌లో మళ్లీ వస్తాయి" అంటున్నాడు.

సూర్నారాయణకి గుండెకాయ ఎవరో దెయ్యపుచేత్తో పట్టినలిపినట్టయింది. అతనికి కళ్ళముందు మిలట్రీబొమ్మ, ఆ తరవాత సత్తిబాబు, ఆ పైన తెల్లబట్టల ఆసామీ వరసగా కనిపించారు.

ఆ తెల్లబట్టల వాడిని చావగొట్టి బొమ్మలన్నీ పిరగ్గొట్టి, కొట్టుకి నిప్పెట్టా లనిపించింది సూర్నారాయణకి.

నీరసంగా కొట్లోంచి బయటకొచ్చాడు. అప్పుడు అతనికి రోడ్డుమధ్య ఓ ఆగిన లారీ, దానిచుట్టూ జనం, గుంపు, గడబిడ కనిపించింది. గుంపు దగ్గరికి వెళ్ళాడు సూర్నారాయణ.

గుంపులో అందరూ తలోమాట అంటున్నారు. తలోమాట వింటున్నారు. ప్రాణం వుందా.... ఏమిటి.... ఇంకెక్కడుంటుంది సార్.... రియల్లీ.... ఆస్పత్రి.... త్వరగా.... నోయూజ్ మాష్టారూ.... లారీ వెధవలకి ఈ మధ్య ఒళ్లుపొగరెక్కిందండీ.... ఓలమ్మో బుర్ర పుచ్చకాయల్లే బద్దలయినాదే.... దూరంగా వుండండి.... పాపం.... చిన్నకుర్రాడండీ.... ఆయన కండీ.... మిమ్మల్నే.... రక్తం బాగా పోయింది.... ఇంతకీ డ్రయివర్ ఏడి సార్ ... అప్పే చూశ్శేమండి ... మిమ్మల్నెవడు చూడమన్నారండీ ... ఆస్పత్రికి రాల్ ... పోలీస్.... ఎవరిపిల్లాడో.... పుస్తకాలు అవిగో సార్ ...తగలకండి.... శ్రీరామచంద్రా లేచి ఎవడి మొఖం చూసాడో.... నోనో పోలీసులు రావాలండి.... గెంటకండీ.... శివశివా.... హియీజ్ డెడ్.... అయ్యొయ్యో మర గయా.... దారుణం లెండి.... లారీ నంబర్ నోట్ చెయ్యండి ... మిజరబుల్.... తప్పుకోండి మెదడు బైటికి వచ్చేసిందండీ.... డ్రయివర్ తప్పు లేదండీ ... కుర్రాడే అడ్డుగా వచ్చాడటండీ.... నా కళ్ళతో చూశాసార్.... ఏమయినా మన దేశంలో యాక్సిడెంట్‌లు ఎక్కువయ్యాయి.... అమెరికాలో మరీ నటండీ.... మందుగొట్టి స్టీరింగ్ పుచ్చుకుంటె ఇకనే మరి.... అబ్బబ్బ.... చక్రం తలఎక్కేసిందండీ ...దారుణం.... శివశివా... ఎడ్రస్ ఎలాగండి ... మాష్టారు నాకాలు తొక్కేస్తున్నారు.... అంతాదేవుడి దయే.... వుండండి.... ఆస్పత్రి ... అరె.... పోలీసు....

సూర్నారాయణ గుంపులోంచి ఆ

మధ్యన వున్న నేలమీద ఆ శవాన్ని ఒంగి చూసాడు. అంతే! అతనికి కళ్ళలో గున పాలు గుచ్చినట్టయ్యింది. సత్తిబాబు బుర్ర బద్దలయి మాంసపు ముద్ద బయిటికి వచ్చేసింది....

"నాన్నా... సత్తీ..." గుంపులోని మాటలని, ఆ రణగొణ ధ్వనిని ఆ సాయంకాలాన్ని చీల్చేటట్టు భయంకరంగా అరిచాడు సూర్నారాయణ. అందరూ అతని వైపు చూసారు.

సూర్నారాయణ ఓ క్షణం కొడుకు శవంకేసి చూసి పిచ్చివాడిలా "నే చూళ్ళేను....నే చూళ్ళేను... నో ఐకాంట్ సీ...." అని అరుస్తూ వెనక్కి, వెనక్కి అడుగులు వేస్తున్నాడు. అతని కళ్ళలోంచి కన్నీళ్ళు రావడం లేదు. అవి గడ్డ కట్టాయి: అతని గొంతులోంచి మాట రావటం లేదు. అది మూగబోయింది, అతని మనస్సుకి మతి పోయింది. అందరూ అతన్నే చూస్తున్నారు.

హఠాత్తుగా మరో సారి...."బాబూ... సత్తీ...." అని అరిచి వెనక్కి, వెనక్కి అడుగులు వేస్తూ కళ్ళు మూసుకున్నాడు.

అంతే! నువ్వూ వెనక్కి, వెనక్కి అడుగులెయ్యాలి. బ్రతుకు నీ మీదకి భూతమై వస్తుంది, నీ కళ్ళు మూతలు పడాలి. నీ చుట్టూ చీకట్లు నిండాలి. నీ నవ్వుల నావ, నెత్తురు మడుగులో మునిగి పోవాలి. నీ పువ్వుల బుట్టల్లో పాములు పుట్టలు పెట్టాలి, నీ బ్రతుకుని ఏదో రోజు దెయ్యపు కాలు రాసిస్తుంది. నీ కొడుకుని 'మిలట్రీ బొమ్మ' పిశాచమై మింగేస్తుంది.

మూసుకో కళ్లు మూసుకో....

నడుపు వెనక్కి నడుపు...

ఆ లారీ ముందు నెత్తురు మడుగులో మాంసం ముద్దలా పడివున్నాడు సత్తిబాబు. పగిలిన తల తాలూకు కళ్లు నీకేసే చూస్తున్నాడు, ఆ మెదడులో ఏ కోరికా లేదు. ఆ కళ్లలో ఏ కలా లేదు.

ఆ కుర్రాడిలో ఏ మాత్రం ప్రాణం లేదు.

ఇక, ఇప్పుడు సత్తిబాబుకి మిలట్రీ

సౌందర్యము మరియు తాజాదనపు భావన...సింథాల్ సబ్బుతో






మీ కోసము...అపూర్వమైన సౌందర్యము,
రోజంతా తాజాదనము...
రెండు విధములుగా పనిచేసే సింథాల్ సబ్బుతో
సింథాల్ లో ప్రపంచములో
కెల్ల ఎంతో బాగుగా పనిచేసే క్రిమినాశిని జి-11
(హెక్సాక్లోరోఫిన్) ఉంది.
జి-11 గల సింథాల్ మాత్రమే
మిమ్మల్ని అందముగా
తాజాగా ఉంచగలదు

సింథాల్ నిజంగా దుర్గంధ నివారిణి సబ్బు

Intarpub/ GS/20A TL



బొమ్మ వద్దనేవద్దు.

ఆ పన్నెండు రూపాయిలలో వాళ్ళమ్మ చీర కొనేసుకోవచ్చు వాళ్ళ నాన్న చెప్పులు కొనుక్కోవచ్చు, ఇంటికి వెల్లేయించుకో వచ్చు. ఇంట్లోకి దీపం కొనుక్కోవచ్చు చెల్లాయికి టానిక్ కొనవచ్చు. భోంచె యచ్చు.

'ఆ పన్నెండు రూపాయిలతో మీరు ఏదయిన కొనేసుకోండి... నాకు మిలట్రీ బొమ్మ వద్దు'- అన్నట్టున్నాడు నెత్తురు మడుగులో సత్తిబాబు.

ఇక సత్తిబాబుకి మిలట్రీ బొమ్మ మీరు కొనక్కర్లేదు. కొనక్కరలేదు,

అ తరువాత పది రోజులు పోయాక, పేవెంట్ మీద నడుస్తున్న సూన్నారాయణ బొమ్మల కొట్టు ముందు ఆగి రోడ్డు మధ్యకి చూసాడు.

అక్కడ ఏమీ లేదు....

ఎవరో అతని భుజం మీద తట్టారు.

తల తిప్పి చూసాడు. కొట్టు గుమ్మం దగ్గర నిలుచున్నాడు బొమ్మల కొట్టతను. నవ్వుతూ అన్నాడు.

"మిలట్రీ బొమ్మలు మా దగ్గర ఉన్నాయి....కావాలా సార్...."

"మా బొమ్మ మా దగ్గర లేదు.... మాకు వద్దు...."

సూన్నారాయణ వెర్రివాడిలా అడుగులు వేశాడు.


వర్షం
ముప్పిరాల
శ్రీధరమూర్తి

వర్షం—

జోరుగా వర్షం—
చల్లగా. అమృతపు జల్లులా
ముత్యాల సరాల్లా,
ముద్దుగా వర్షం.

బయట, పరచివున్న పచ్చని తివాసీ లాంటి లాన్‌లో. గడ్డిమొక్కలు వంగుతూ, లేస్తూ షోగ్గా, నృత్యం చేస్తున్నాయ్.

గడ్డిమొక్క కొసన నిల్చున్న, వర్షపు బిందువు ఫ్లడ్ లైట్ (Flood light)లో, పెళ్ళికూతురి ముక్కు పుడకలా మెరిసి పోతూంది. క్రోటన్ మొక్క నంటిపెట్టు కున్న, ఒంటి పువ్వు జ్ఞానోదయమైన మనసులా ఎర్రగా నిల్చొని వుంది.

గులాబీ మొక్కలు ఉర్దూ కవితా సుంద రిలా కళ్ళకు మత్తెక్కిస్తూన్నాయ్.

మేడపైన, అద్దాల గదిలో—

"చూశావా శేఖర్: లాన్ మీది నీటి బిందువుల్ని అలా చూడు. సీ దట్ డెలికసీ (See that delicacy) ఉర్దూలో దీన్నే "షబ్నం" అంటారు."

"అరే, ముకుంద్, పదింటికల్లా వస్తా మన్న వీళ్ళిద్దరూ, ఎనిమిదయినా రారే? ఎక్కడ మజా చేస్తున్నారో!"

బ్రాందీ బుడ్డిని చూస్తూ కూర్చోటం చాలా కష్టం. రెండు ప్రారంభిద్దామంటే వీళ్ళొచ్చి చావరు, ఎలా."

"చాలా బోర్డం (Boredum) గా వుందోయ్ ఈ రోజు?"

'కంపెనీ లేక, అంతేగా?"

"అదొక కారణం అనుకో, అప్పటికే ఫోను చేశాను ఆఫీసు నించి. అంతా బుక్కయి పోయారట, ఈ రాత్రికి. ఈ రోజంతా ఇలాగే వంటరిగానే దాటె య్యాలి."

"అదేం? ఈ రోజు బజారు సరుకు మీదెందుకు పడ్డావ్? నీ ఓ. సీ. లన్నీ ఏం అయినట్లు?"

"ఆఁ, ఏం ఓ. పి. లో ఎప్పుడూ ఒక అవాంతరం. అనుకోనట్లు ఎవరో ఒకరు తగలడుతూంటారు వాళ్ళ ఇళ్ళల్లో. మిసెస్ జాన్ ఫోనులో సారీ చెప్పింది. జాన్ ఈ రోజే కాంప్ నించీ, వచ్చాడట. శాంతికి గెస్టు లొచ్చేరట. ఏం మునిగి పోయిందనో వీళ్ళంతా ఈ రోజు ఇలా కట్టకట్టుకొని వచ్చి పడ్డారు."

"అందుకనేగా, నేను నీ కెప్పుడూ చెపుతూ వుండటం, నీదంటూ పిల్ల నొక దాన్ని పెళ్ళాడమని."

"అఘోరించావ్‌లే! గంగలో దూక మని చెప్పావు గాదు. అసలింతకీ, నీ సలహా నువ్వే పాటించవు ఎందుకు?"

నా సంగతి అలా వదిలెయ్. నా పెళ్ళి

బాటిల్తో ఎప్పుడో అయిపోయింది. కానీ ఈ లోన్లినెస్ (loneliness) నన్ను చాలా బాధ పెడుతూంది. త్రాగుబోతు మొగుణ్ణి ఏ ఆడదయినా సహి స్తుందంటావా?''

"అలా అనుకోకు. త్రాగుబోతు గూడా ఒక మంచి భర్త కాగలడని ఏదో కథలో చదివాను, ఇటీవల.''

"డామ్. పేదవాళ్ళలో లేని మంచిని భూతద్దంలో చూపెట్టే కథలవి. కూలి వెధవల్ని పని చెయ్యకుండా తిరగబడమని ప్రబోధించే కథల కేమీ తక్కువలేదు. ఈ దేశంలో.''

అరె పదవుతోంది. వీళ్లేవవయినట్లు? ఇంకా వీళ్ళకోసం కాచుక్కూచోటం మియర్ ఫూలిష్ (Mere foolish) కమాన్, గొంతు తడుపుకుందాం.

*　　*　　*

వర్షం—

ఇంటా బయటా వర్షం—

చూర్లోంచి కారే నీటి కంపు—

పొగ చూరిన గోడల మీదుగా, వాన నీళ్ళ చెమట కంపు—

పై కప్పులో ఎలుకల గోల—

అవి జారి కింద పడ్డప్పుడు, టప్పున శబ్దం.

"అరెరే, చంటివాణ్ణి ఇలా జరుపు లక్ష్మీ! తడిసి పోతున్నాడు, వెధవ.''

ఆఁ వస్తున్నా. ఏవండీ మిమ్మల్నే! వంటింట్లో బిందె అలా ఆ చూరు కింద పెట్టండి. కొంపంతా చెరువయి పోతూంది, మరీ.''

ఆకాశం నించే పెళ్ళున ఉరుములు.

"లక్ష్మీ, రెండోదాన్ని చేతికె త్తుకో. జడుసుకొన్నట్లుంది. పాపం!''

"ఇదిగో, వీడికి పాలిచ్చి.... ఈ నెలైనా కా స్త పెంకులు తిరగేయించమని చెప్పండి. రాత్రంతా నిద్ర లేకుండా, ఎన్నాళ్ళిలా జాగారం? అసలిదంతా మీ మెత్తదనం వల్లనే. ఇల్లుగలాయన్ని మీ రెప్పుడైనా నిలేసి అడిగిన పాపాన పోయారా? అమ్మయినా అడగందే పెట్టదు కద. ఈ కొంప ఎప్పుడో మనందరి మీద కూలి తీరుతుంది అంతటితో విముక్తి. ఛీ ఛీ, ఏం బతుకులు.''

ఇటు తిరిగి పడుకొన్న సుబ్బారావుకు అన్నీ వినిపిస్తూనే వున్నాయ్.

పాపం! లక్ష్మికి అసలు కిటుకు తెలీదు. ఇప్పటికే తను నాలుగు నెలల అద్దె బాకీ. ఇక, ఏ మొహం పెట్టుకొని రిపేరు చేయించమని అడగటం? అంత వరకూ ఆయన పెద్ద మనిషి. తనను, భార్యా బిడ్డల్తో బైటికి గెంటేసి, రోడ్డెక్కించ లేద.

ఎప్పుడో పదేళ్ళ క్రితం, తన కాలేజీ రోజుల్లో చదివినకవిత్వం గుర్తు కొచ్చింది, సుబ్బారావుకు.

"కలల పంచనిండీ కారే సంతృప్తి ధార నిద్దుర బిందెలలోనైనా, పట్టుకొనీయండి. నిత్తినైమిత్తికాల వంటింట్లో చూరునించి లేమి కారుతోంది చూడండి

పరిస్థితుల పెంకులు తిరగవేయించండి.''

ఆ రోజుల్లో ఎంత తర్జన, భర్జనలా పుస్తకం మీద. ఇంతకీ, పుస్తకం పేరేమిటబ్బా? ఊ' గుర్తుకు రావడం లేదు.

మొదటిసారి ఆ పుస్తకం చదివినప్పుడు, తనకెంత ఆనందం. ఎంత ఉత్సాహం!

ఈ రోజు, తన అనుభవంలోకి అదే వచ్చేసరికీ, ఎంత బాధ.

కాలేజీలో నేర్చుకున్నవి ఈ బతుకులో ఏం పనికొచ్చాయ్?

ఎన్ని ఆదర్శాలు ఆ రోజుల్లో! ఎంత ఆవేశం! ఏదెదో చేసెయ్యాలని ఎంత తపన! రోజు కొక పూట కూడా కూడు లేనివాళ్ళు 75 శాతం వుంటూన్న ఈ దేశాన్ని, మరమ్మత్తు చెయ్యాలని, ఈ దారిద్ర్యం కరుపును మొదలంటా కడిగెయ్యాలని. ఉబలాటం!

కానీ, ఈ రోజిలా ఈ గ్లోరిఫైడ్ నేమ్ ఫర్ స్లేవరీలో (glorified name for slavery) తనకూ, ఇతర్లకి పనికి రాని బరువు బతుకును మోస్తూ, తన దరిద్రం, అసఖ్యత, కనీసం భార్యకు గూడా తెలియనీని వానిటీ, (vanity) ఫాల్స్ ప్రెస్టిజ్ (False prestige) లో ఎన్నాళ్ళు ఇంకా ఎన్నేళ్ళు?

అని ఆలోచిస్తూ, తడవని కాస్త చోటుకోసం చీకట్లో తడుముకుంటూ వుండిపోయాడు, సుబ్బారావు—ఇంటర్ యూనివర్సిటీ ఎలెక్యూషన్ పోటీలో గోల్ మెడల్ విన్నర్.

*   *   *

వర్షం—

భోరున వర్షం—

టి. బి రోగి దగ్గుతూన్నట్లు ఉండీ ఉండీ, వురుములు—

మెరుపు వెలుగుల్లో కాలవనీటి కంపు నీళ్ళు, గజ్జికుక్కలు పందులు—

నేలంతా తడి, చిత్తడి.

చిత చితలు, పటపటలు.

"ఒసే కనకం, ఒక రూపాయుంటే ఇయ్యవే! గిరాకీ తగలగానే తిరిగిచ్చేస్తాను. ప్రొద్దిటినించీ కూటికి నోచుకోలేదు, నేను.''

"మన బతుకుల్ని దరిద్రం పట్టుకొన్నట్లు, ఈ వూరిని ఈ వాన పట్టుకొంది. ఇంత వర్షంలో ఏ మగాడూ ఈ పేటకేసి రాడు. పస్తావన్నా, రిషావాళ్ళు ఇటుకేసి రారు. ఎవరి కడుపు నింపుతుందో తెలీదు గానీ, ఈ యేళ మన కడుపు గొడుతూంది ఈ వాన నయాపైస కళ్ళ జూపి నాలుగు రోజు లయింది.''

"కొట్లో తోసేస్తానని హంగామా చేసి, బొడ్లో వున్న రెండు రూపాయలూ పీక్కుపోయాడు, పోలీసెంకటసామి.''

"మొన్న తీసుకున్న ఇంజీషన్కి ఇంకా డబ్బు లీలేదని, బూతులు తిట్టిపోయాడు. కంపోండరు రాజయ్య.''

"పోయిన్నెల కాతాలో బాకీ పెట్టేనని, మెడ బట్టుక గెంటేశాడు, టీ కొట్టువాడు.''

"తాగడానికి డబ్బులీ లేదని, చితక

తన్ని పోయాడు, రంగడు.''

"ఛీ! ఏం బతుకులే? మనవేం బతుకులే, కనకం! మానం అమ్ముకొని మడి మాన్యాలు సంపాయించారట, మునుపు, మనలాంటోళ్ళు. ప్ఛీ! ఆ రోజు లెల్లి పోయాయ్. మానం పోతే పోయింది, మందే కడుపు మండుతూనే ఉంది. కొత్తల్లో ఏడవడానికి కళ్ళ నిండా కడవల నీల్లుండేయి. ఇప్పుడవీ లేవ్! ఏం బావుకుందామని ఇంకా బతకటం?''

"ఏమే? డబ్బు లడిగితే ఇలా రాయిలా నిల్చుంటావేం? కడుపులో ఎలికలు తిరుగుతూంటేనూ.''

''నాకాడ ఎక్కడివే డబ్బులు, సరసా. నివ్వేదో ఏదాంతం జెబుతూంటే. మరింకేదో గుర్తుకొచ్చి, ఆలోచిస్తూన్నా.''

"నిన్ననేగా, గాంధీ లాడ్జి కెల్లోచ్చావ్? ఏమైపోయిన వెంటి దబులన్నీ, నా కాడ ఎర్రేసాలు ఏస్తావుటే. కనకం!

"ఆ చెప్పొచ్చావ్లే, సంబరం. పది రూపాయ లిస్తామన్న నాయాళ్ళు పనయిపోయాక మూర్రూపాయలు చేతిలో పెట్టారు. ఇదెం నాయం అనడిగతే తన్ని తగలేశారు, సచ్చినోళ్ళ ,ట్రోకరు నాయాలు అందులో రూపాయిన్నర, జుట్టు పుచ్చుక తీసుకుపోయాడు. ఇహనా కాడ, మిగిలిం దేవిటే, ఎర్రి మొగమా?''

"నువ్వు బతుకుని సాగదీపి ఆలోచిస్తున్నావింకా, నేనా పని ఎప్పుడో మానేశాను. బతుకెలా తోస్తే, అలా వంగి, కాస్త నిలద్రొక్కుకొని పొట్ట నింపుకోడమే మన పని.''

"అదిగాక, మనవేం బతుకులు, ఎందుకు పుట్టేం, ఏం బావుకుందావని, ఇంకా బతుకుతున్నా, అని ఆలోచిస్తూ కూర్చున్నావో, నీకు రెండ్రోజుల్లో పిచ్చెత్తి పోతుంది. లేకుంటే దేవుడు సల్లగా సూస్తే, బుర్ర బద్దలై సచ్చిపోతావ్. ఇంటూన్నావే సరసా?''

వర్షం, భోరున వర్షం.

ఆకాశం ఏడుస్తూంది. కడుపు లేడుస్తూన్నాయ్.

కళ్ళు వర్షిస్తూన్నాయ్.

కడవలు, కడవలు—

కన్నీళ్ళ కడవలు—

కళ్ళలో కన్నీళ్ళ కడవలు—

వర్షం.

జంతు లక్షణం :-

''24 కాళ్లు, 24 చేతులు, ఎర్రటి కళ్లు, రెండు కోరలు ఉండు పచ్చగా వుండే దాన్నేమంటారు?''

''నాకు తెలియదు-'' ఏమంటారు?''

"నాకూ తెలియదుగాని, నీ కాలరుమీద పాకుతోంది."

దీని పేరు ప్రపంచం

మాహానుమంతరావు

గత రోజునుండి ఎన్నిసార్లు చదివినా తనివితీరని ఆ ఉత్తరాన్ని తిరిగి వణికే చేతులతో ఇంకోసారి చదివింది సునంద.

సునందా డియర్ !

అబ్బా ఎన్నాళ్ళకి తిరిగి కలుసుకున్నాం. కనీసం ఈ ఉత్తరంలోనైనా. మై డియర్ స్వీట్ ఎన్ని రోజులయింది నిన్ను చూసి. ఉద్యోగం కోసం హైద్రాబాద్ వెళ్ళిపోయావు నీవు, నీ ఎడ్రస్ కోసం ఎంత యాతనపడ్డానో చెప్పలేను. మీ అమ్మ నీ ఎడ్రస్ ఎంత గుట్టుగా దాచింది. మీ అమ్మ చనిపోయిన పది రోజులకి వెతగ్గా, వెతగ్గా కనబడ్డాయి నీ ఉత్తరాలు. దేవుడి అరుగుమీద పేపరు క్రింద ఎంత గోప్యంగా దాచింది! నీ ఉత్తరాల్ని చూడగానే నిన్ను చూసినట్లు ఎంత సంబరపడ్డానో చెప్పలేను. మై డియర్. పూర్ ఆంటి ఎంత కష్టపడింది, నిన్ను నాకు దూరం చేయాలని. అందుకే అనుభవించింది, కడసారిగా నిన్ను చూడలేకపోయింది, నువ్వు కనీసం ఆమె శవాన్నైనా చూడలేక పోయావు సారీ. .. మీ అమ్మ చనిపోయిందని ముందుగా రాయలేకపోయాను, మీ అమ్మ పోయిందని తెలియగానే నీ ఎడ్రస్ కోసం గది అంతా వెదికాం నీకోసం వాకబు చేశాం. మా ప్రయత్నాలు ఫలించలేదు. చివరికి నేనే దహనం చేశాను. సారీ ..మై డియర్.. .వస్తున్నాను...,నీకోసం...నేనిక వుండలేను .

ఇక చదవలేకపోయింది సునంద. దుఃఖ భారంచేత వణికిపోతూ "అమ్మా నన్ను విడిచి వెళ్ళిపోయావా? నన్ను వంటరిదాన్ని చేసి పోయావా"" అంటూ బిగ్గరగా రోదించింది, అంతలో గది తలుపుమీద చప్పుడయింది. ఆమె వీపుమీద ఎవరో చరిచినట్లయింది. ఉలిక్కిపడింది. "కేశవరావు. ...కేశవరావు-" అంటూ

పిచ్చిగా గొణుక్కుంది. ఆమె కళ్ళకి చీకట్లు కమ్ముతున్నాయి, తలుపుమీద చప్పుడు ఉధృతమవుతోంది, భయంతో అనాలోచితంగా తలుపులు తీసింది.

మల్లె పువ్వులాంటి తెల్లని దుస్తులతో సత్యమూర్తి!

అతను లోపలికి వస్తూనే అన్నాడు—

"మీ అమ్మగారు పోయారుటగా ?"

"మీకెవరు చెప్పారు ?" ఆవేశంగా ప్రశ్నించిందా అబల,

"ఆఫీసులో చెప్పారు" నిర్లిప్తంగా సమాధానం.

"ఆఫీసులో పని చేసే ఆడవాళ్ళ ఎడ్రస్‌లు కనుక్కోవడమేనా మీ పని ?" ఆ కోమలి కంఠం కటువుగా పలికింది. ఆమె ప్రశ్నకి సమాధానం చెప్పకుండా అన్నాడతను సానుభూతితో—

"నేనీ వార్త విని చాలా బాధపడ్డాను"

"ఎందుకో ?" కంచులా మ్రోగింది ఆమె కమనీయ కంఠం.

"మీ అమ్మగారు పోయారని విని చాలా విచారిస్తున్నాను" అన్నాడతను తన మామూలు ధోరణిలో సౌమ్యంగా.

"నా ప్రశ్నలకి సమాధానాలు చెప్పడం లేదు"

"క్షమించండి....మీరిప్పుడు చాలా ఆందోళనగా వున్నారు సునందాదేవిగారూ" అతని మాటలకి అడ్డు వస్తూ తీవ్రంగా అంది "యిక్కడ దేవీలూ, రాణులు ఎవ్వరూ లేరు."

"క్షమించండి" అన్నాడు ప్రాధేయ పూర్వకంగా.

"క్షమించండి....క్షమించండి...క్షమిం చడమే మేం నేర్చుకోవాలి, స్త్రీకి క్షమ అవసరం - అంతేనంటారా ?"

"నన్ను మీరు అర్థం చేసుకోవడం లేదు"

"మిమ్మల్ని నేను అర్థం చేసుకొనే లోగా ఈ ప్రపంచం మనల్ని అపార్థం చేసుకుంటుంది."

"మీరు నన్ను చూసి ఎందుకు భయ పడుతున్నారో, బాధపడుతున్నారో ఊహించలేకుండా వున్నాను"

"మీరు నన్నెందుకు వెంబడిస్తున్నారో; పలకరిస్తున్నారో నాకూ అర్థంకాకుండా వుంది."

"మానవుడు సంఘజీవి. మీరు బాధ పడుతున్నారని విని-" అతని మాటలకి అడ్డు వస్తూ చురుగ్గా అంది "ఈ సంఘం భౌతికంగా ఎంత విశాలమైనదో మాన సికంగా అంత సంకుచితమైనది. ఈ సంఘంవల్ల చెడిపోయేది మీరు కాదు. నేను."

"మిమ్మల్ని నేను ప్రేమిస్తున్నాను" అన్నాడతను తడబడుతూ అనాలోచితంగా.

"షటప్....గెట్ అవుట్" ఆమె కళ్ళల్లో నిప్పులు కురుస్తున్నాయి, కలకత్తా కాళిలా వున్న ఆమెని చూస్తూ గాఢంగా నిట్టూర్చి, బయటికి నడిచాడు సత్యమూర్తి. అతను వెళ్ళి వెళ్ళగానే తలుపులు బిగిం



చింది సునంద.

"అమ్మా....అమ్మా....నన్ను ఒంటరిగా వదిలి వెళ్ళిపోయావా?" అంటూ పిచ్చిగా జుత్తుపీక్కుంటూ ఏడ్వసాగింది.

* * *

సునంద అమ్మ చిన్నతనంలోనే వైధవ్యం పొందింది విధిచేత వంచింపబడింది. యిటు పుట్టింటిని అటు మెట్టింటిని కాదని నా దగ్గిర బానిసగా యాంత్రంగా పడి వుండడం యిష్టంలేక తన స్వశక్తితో



కుట్టుమిషన్ ఆధారంతో బ్రతికి,. భర్త దూరమయ్యాక భూమిమీద పడిన సునందని బాధ్యతతో పెంచింది. బి. ఏ. వరకు చదువు చెప్పించింది. ఆత్మ బలమే నీ ఆయువు అంటూ హైద్రాబాద్ పంపింది ఉద్యోగ నిమిత్తమై.

"చాలీచాలని ఆదాయంతో బాధపడుతూ నీకెందుకే ఈ చదువు.... కేశవరావుని పెండ్లి చేసుకోకూడదూ" అంటూ ఉచిత సలహాలిచ్చిన బంధువులకి "మా అమ్మ

ఆనందంకోసం చదువుతున్నా''నని సమాధానమిచ్చేది సునంద. ''నీకెందుకే ఈ ఉద్యోగాలు .. కేశవరావుకి బోలెడంత ఆస్తి వుంది'' అని అంటే ''మా అమ్మ ఆనందం కోసం చేస్తాను ఉద్యోగం''అనేది సునంద.

ఉద్యోగం చేసి బాగా డబ్బు సంపాదించి తల్లిని సుఖపెడతామనుకున్న సునందకి నేడు తల్లి లేదు. ఉద్యోగంలో చేరగానే తల్లికి ఉత్తరాలు రాసింది. వెంటనే తీసుకు రాలేకపోయింది. జీతాలు రాగానే తీసుకు వద్దామనుకుంది. జీతం తీసుకుని తల్లి దగ్గరకి వెళ్దామనుకున్న రోజునే వచ్చింది ఉత్తరం కేశవరావు దగ్గరనుండి


కేశవరావు సునందకి దూరపు చుట్టం వివాహితుడు. ''భార్యకి విడాకులిచ్చాను. నిన్ను పెండ్లి చేసుకుంటా''నంటాడు సునందని.

సునంద తల్లి కిష్టంలేదు. కాని, కొంత మంది ఆమె బంధువులు (కేశవరావుచే ప్రేరేపించబడినవారు) తమ కొడుకుల సంగతి మాట్లాడకుండా కేశవరావు-అతని ఆస్తి - గుణం - రూపంగురించి వర్ణిస్తూ లొట్టలు వేస్తూ (తమ కూతుళ్ళని యివ్వడానికి సందేహిస్తారు) సునందనిచ్చి పెండ్లి చేయమని సలహాలిచ్చేవారు. కాని సునంద కివేమీ పట్టేవి కాదు. కాలేజీలో చదివింది. చదువుని మాత్రమే. ఈ ప్రేమలూ, పెండ్లిండ్లు గురించి ఎప్పుడూ ఆలోచించేది కాదు. ఆమెకి సదా కనబడేది కుట్టు మిషన్ మీద కూచున్న తల్లి ఆమె కష్టం, తన కర్తవ్యం,

సునంద కాలేజీలో చదువుతున్నప్పుడు ఆమెని వెంబడించి విఫలులైనవారు ప్రేమికులు'' ఆమె ఉద్యోగంలో చేరిన కొద్ది రోజులలోనే ఆమె సమీపానికి రావడానికి సాహసించాడు సత్యమూర్తి ఆమె ఆఫీసుకి వెళ్ళేటప్పుడు. తిరిగి వచ్చేటప్పుడు అనుసరిస్తూ, కావాలని పలుకరిస్తూ, నలుగురు నోళ్ళల్లో పడ్డాడు యిది సునంద కిష్టం లేదు. అప్పటివరకు ఆమె గమ్యం తల్లి సుఖం, ఆఫీసులో చేరిన తరువాత ప్రతీ వెధవా (నైంటీపర్సంట్ ఆమె దృష్టిలో) ఆమె వొంటిమీద దుస్తులు తొలగించి నగ్నంగా చూస్తున్నట్లు ఫీల్ అవుతూ పళ్ళు యికిలించడం ఆమె గమనించింది ఈ ఉద్యోగుల కళ్ళల్లో కాలేజీ విద్యార్థుల కళ్ళల్లోని మృదుత్వం, నిర్మల మందహాసం కనబడకపోగా, కాలుతున్న కోర్కెల కసిత్వం ఆమెకి కనబడింది, అందనిది అందుకోవాలని ఆరాటం.

సత్యమూర్తి చనువుని చిన్న పిల్లవాడి చేష్టగా కొట్టివేసింది. మాధవరావు ఆమె మనసులో వున్నాడు, నలిగిన బట్టలు కట్టడు క్రాఫ్ చెక్కుచెదరనీయడు ఎవరితోనూ ఎక్కువ మాట్లాడడు. తన పని, తన గొడవ మర్యాదస్తుడు. మృదువుగా మాట్లాడుతాడు. తల వంచుకు నడుస్తాడు. ఎవరిని ఆకర్షించ ప్రయత్నించడు. అతనెక్కువగా మాట్లాడేది బట్టతల ముసలి గుమస్తాతో,

* * *



కుటుంబము అంతటికి ఫోస్ఫోమిన్® వల్ల ఆరోగ్యము కలుగును
ఫోస్ఫోమిన్
• శక్తిని పెంపొందించును.
• ఆకలిని అధికము చేయును.
• సమాన శక్తిని హెచ్చించును.
• శరీరము యొక్క రోగనిరోధక శక్తిని ఎక్కువచేయును.
SQUIBB
Phosfomin
VITAMINS ELIXIR
SQUIBB
SARABHAI CHEMICALS
ఫోస్ఫోమిన్...
ఆకుపచ్చని పండ్ల రుచిగల
విటమిన్ టానిక్
Shilpi HPMA-35A/70 TEL

అందుకే ఈ అపరంజి అతనింటికి వెళ్ళింది. అంత బాధలోనూ దుఃఖంలోనూ ఆమెని సదా భయపెట్టేది కేశవరావు రాక అతను వట్టి రౌడీ. జులాయి. అతను వస్తే తన జీవితం ఎంత దుర్భరమవుతుందో ఊహించలేక పోతున్నది. అన్నింటికి తెగించినవాడు అతను. అందమైన ఈమెని అందుకోకుండా వెళ్ళడు. అందుకే ఆమెకి భయం. ఈ భయ నివారణకై వెళ్ళింది మాధవరావు యింటికి. చీకటి పడిన తరువాత అతనిల్లు కనుక్కోవడం కష్టమయింది ఆమెకి. వీధి గుమ్మంలోనే ఆహ్వానించాడు మాధవరావు.

"ఏదో పనిమీద వచ్చినట్లున్నారు?"

"అవును" అందామె నిర్లిప్తంగా.

"ఏమైనా అర్జంట్ పనా....లేకపోతే ఒక అయిదు నిమిషాలుండండి.. సాయంకాల పూజ పూర్తిచేసి వస్తాను."

"క్షమించండి మీకు యిబ్బంది కలిగిస్తున్నాను.. మా అమ్మగారు పోయింది" అందామె నేలచూపులు చూస్తూ అతను గబగబా .."మీ అమ్మగారు పోయారా! అరే....అరే... పాపం...." అంటూ గాఢంగా నిట్టూర్చి "ఎప్పుడు పోయారు.... మీ స్వగ్రామం వెళ్ళాలా... వెంట పదండి...."

"పోయి చాలా రోజులయింది" అందామె బలహీనంగా.

"మీకెప్పుడు తెలిసింది ?"

"నిన్న....ఈ రోజూ నిన్నా కూడా ఆఫీస్‌కి రాలేదు నేను."

"రాలేదా ?" అన్నాడతను సంశయంగా,

"మిమ్మల్ని యిబ్బంది పెడుతున్నట్లున్నాను—నాకో సలహా కావాలి" పమిటకొంగు వేలికి చుట్టుకుంటూ అందామె.

"ఎంత మాట అడగండి."

పెద్దమనిషి తరహాగా అన్నాడు మాధవరావు.

అంతలో వరండాలోకి ఎవరో వచ్చినట్లు అలికిడయింది. ఆమెకేమీ చెప్పకుండా గబగబా బయటికి వచ్చాడు మాధవరావు. చవకరకం సెంటు వాసన గుప్పుమని గాలికి వచ్చి ఆమె ముక్కుపుటల్ని బ్రద్దలు చేసింది. ఆమె విప్పారిన నేత్రాలు చీకటి వెలుగుల మధ్య అతను మాట్లాడుతున్న స్త్రీ నగ్న స్వరూపాన్ని ఆమె కట్టుకున్న వస్త్రాలలోంచి చూస్తున్నాయి. గాజుల గలగలలు: ఆమె చెవికి సోకని వాళ్ల సంభాషణ ఆమెని కలవర పెడుతున్నాయి.

అతను లోపలికి వచ్చాడు. ఏదో మాట్లాడాలనుకున్న ఆమె నోరు మూత పడలేదు. కాని మాట్లాడలేక పోయింది.

"పనిమనిషి. సినిమాకి పోతుందట. డబ్బులు కావాలిట" అతనేదో అంటున్నాడు.

సునంద గబగబా గది గుమ్మం దగ్గరకి వచ్చింది.

"గురూ తల్లి వచ్చింది. మనంక్షౌ ఆ

గాలి అన్నావు. అప్పుడే గూటికి చేర్చావా గురూ'' అంటూ గళ్ళచొక్కాలో వస్తున్న బట్టతల మనిషిని చూపి నిశ్చేష్టితురాలై యింది సునంద. "పయోవిషకుంభాలు.... మృగాలూ...." అంటూ కసితీరా తిట్టింది. కాని వాళ్లు మృగాలుగానే వస్తున్నారు ఆమె దగ్గరికి. ఆమె కెప్పున కేకవేసింది.

మాధరరావు ఆమె నోటిని మూయ లేక పోయాడు.

స్వతంత్ర పౌరులందరూ ఆ యింటి దగ్గరికి చేరారు. "ఏమిటన్నారు." ముసలి బట్టతల గుమాస్తా చెబుతున్నాడు. మాధవ రావు అనువదిస్తున్నాడు ఈ రోజుల్లో ఆడవాళ్ళు బరితెగించి పోయారు, తన ఉద్యోగం ఖాయపరచడానికి శ్రీరామ శ్రీరామ అనకూడదుగాని" అంటూ గుట కలు మింగి "యిటు వంటి నీచపు పనులు మేం చెయ్యం. నీ ఉద్యోగం పోవడం ఖాయం అన్నాం. మామీద పగబట్టింది. మమ్మల్ని అల్లరి చేయడానికి ఈ రగడ ఏర్పాటు చేసింది బాబూ." చేతులు జోడి స్తున్నాడు మాధవరావు. అప్పుడే పిల్లలతో రిక్షాదిగిన మాధవరావు భార్య యింటి ముందు జనం; భర్తనీ, సునందనీ చూసి; సంగతి అర్ధం చేసుకుని లోపలికి వెళ్ళి పోయింది.

ఆమెకి భర్త స్వభావం తెలుసు అందుకే మాట్లాడలేదు. కాని యింటి ముందున్న ప్రజలకీ విషయం తెలీదు. వాళ్ళకి తెలిసినది తమకివాక్‌స్వాతంత్ర్యం; స్వేచ్ఛా వున్నాయని. అందుకే స్వాతి శయంతో కళ్ళముందున్న సత్యాన్ని పరీ క్షించాక; చెవులతో విన్నదానికి ప్రాముఖ్య మిచ్చి ఆమెని ముద్దాయిగా నిలబెట్టారు. ఆమె వల్లే సంఘం నాశనమై పోతోందిట. ధర్మం నశిస్తున్నదిట! కరువు కాటకాలు ఏర్పడుతున్నాయట. అన్నిరకాలమాటలు! తాము వల్లెవేసిన పెద్దల సూక్తులు కరువు తీరా అని: కంఠశోష రాగా, ముసలిపీనుగ యిచ్చిన బీడీలతో, మాధవరావు ఇచ్చిన సిగరెట్లతో సంతోషపడి ఆమెకి 'పతిత' అని టైటిల్ యిచ్చి సర్దుకుంది సంఘం. తలుపులు వేశాడు మాధవరావు కరుడు గట్టిన ఆ చీకటిలో కరినశిలలా నిలుచుంది. ఆమె. ఆమెలో చలనం లేదు.

చలనమున్న ముసలి గుమస్తా రెండు మూడు నిమిషాలు రోడ్డుమీద తిరిగి వస్తూ పోతున్న జనం వంక, ఆమెవంక మార్చి మార్చి చూసి 'డామిట్ కథ అడ్డం తిరి గిందని' వెళ్ళిపోయాడు.

అప్పుడు కదిలింది ఆమె.

* * *

ఆగింది ఆమె తాను అనుకున్నగమ్యం రాగానే. కాని ముందుకి వెళ్ళలేక పోయింది. చీకటిలో సముద్రపు అలలు విచిత్రంగా కనిపిస్తున్నాయి ఆమెకి. కడలి కెరటాల కదలికలో అందం కని పిస్తున్నది ఆమెకి. ఆ నీలి ఆకాశంలో మెరిసే నక్షత్రాలు విచిత్రంగా చూస్తున్న నగరాన్ని వెనక్కితిరిగి చూపించి. ఆ

నగర ప్రజలు దీపావళి చేసుకుంటున్నట్ల నిపించింది ఆమెకి. కదిలే వాహనాలు, కదులుతున్న ప్రజ. యంత్రాల ఘోష. దీపాలవెలుగు. ఆ వెలుగులో ఆనందంతో అందమైన ప్రజావాహిని. వారి ఆనందానికి అసూయపడింది. తానా అదృష్టపు ఆనం దానికి నోచుకోలేదని బాధ పడింది. తానెందుకు బ్రతకాలి - ఎవరి కోసం ఆమె ఆలోచనలు ఆగాయి. తెల్లని దుస్తు

లతో మానవాకారం కెరటాలమధ్యలోకి వెళ్ళడం గమనించింది. ఆమె వంటికి కరెంటుషాక్ తగిలినట్లయింది ఆమె యాదృచ్ఛికంగా, గబగబా తాను ముందుకి వెళ్ళి అతని చేతిని పట్టుకుని వెనక్కి లాగ బోయింది. గాని సముద్ర కెరటం వాళ్ళిద్ద రినీ వొడ్డున పడవేసింది.

చల్లని మెత్తని యిసుకమీద యిద్దరు.

రెండు నిముషాల అనంతరం బలహీ నంగా కళ్ళు విప్పుతూ అన్నాడతను.

"నేనెక్కడున్నాను?"

యిసుకలో పిచ్చిగీతలు గీస్తున్న ఆమె అంది.

"దీనిపేరు ప్రపంచం."

సత్యమూర్తి గాభరాపడి లేచి కూచు న్నాడు.

"మీరెందుకీ సాహసం చేశారు" అందామె తిరిగి.

"మీరు నన్ను గెట్ అవుట్ అన్నారు. వెళ్ళిపోదామని వచ్చాను.... కాని మీరే వచ్చి మళ్ళీ వెనక్కి లాగారు".

ఆమె వంక చూస్తూ అన్నాడు.

'నన్ను ఎందుకురక్షించారో తెలుసుకో వచ్చా?" అన్నాడతను తిరిగి! ఆమె సముద్ర కెరటాలవంక రెండు నిమిషాలు చూసి అంది "నాకోసం."

అతని కళ్ళు ఆనందంతో మెరిశాయి; ఆమె దగ్గరికి వచ్చాడు.

మనోవ్యాధి

కిరణ్‌కుమార్

వంట పని పూర్తిచేసి ప్రక్క గదిలో కొచ్చిన పద్మావతికి హాల్లో నుంచి ప్రక్కింటి ఆండాళమ్మ మాటలు వినిపిస్తున్నాయి.

"నువ్వు అదృష్టవంతు రాలివే సుభద్రమ్మా. శ్రీదేవి భూదేవిలాంటి కోడళ్లు, నట్టింటి బంగారంలా మనమడు మనుమరాలు. — ఇల్లంతా చక్క దిద్దుతూ ఎంతో మంచితనంతో, శాంతంతో — నీ పెద్దకోడలు పద్మావత మ్మని చూస్తే నాకు చెప్పలేనంత ఆనందం అనిపిస్తుందే!" దీర్ఘాలు తీస్తూ అంటూంది ఆండాళమ్మ.

"నిజంగా పద్మావతమ్మ లాంటివాళ్ళు నూటికో కోటికో ఒకళ్ళుంటారు అ నిదానం, ఔదార్యం, హుందాతనం, ఓపిక, విసుగనే మాటే లేకుండా ఎంత చాకిరీ అయినా చేస్తుంది. ఒక్క నిమిషమైనా వూర్కే వున్నట్టు కనుపించదు." ఎదురింటి రంగనాయికమ్మ మాటలవి.

"అట్లా చాకిరీ చేసేనమ్మా దానికిక పిల్లలు కలగకుండా అయింది."

సుభద్రమ్మకి తన పెద్దకోడలు మూడేళ్ళ క్రితం నీళ్ళ బిందెతో మెట్లపద్ద పడ్డప్పుడు డాక్టరు చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చి బాధపడింది.

"ఆవిడకిక పిల్లలు కలగక పోతేనేం. చిన్నకోడ లుందిగా వంశాభివృద్ధి చేయ టానికి" ఆండాళ్ళమ్మ తన ఉద్దేశ్యం వెలిబుచ్చింది.

"ఆఁ....సరస్వతమ్మ పిల్లలు పద్మావతమ్మ పిల్ల లవుతారా. పద్మావతి కడుపున పుడితే ఆవిడ గుణాల్లో కొన్నయినా వస్తాయి వాళ్ళకి." రంగనాయికమ్మ అంది

"సరస్వతి పిల్లలకి మాత్రమేం, రఘు మూడేళ్ళ వాడయినా ఎంతో తెలివిగా వుంటాడు. పద్మావతి ఇంటికి పెద్దకోడలు కాబట్టి ఆ మాటలుగానీ...." ఆండాళ్ళమ్మ కోడలు నళిని తన స్నేహితురాలు సరస్వతిని మెప్పించాలని అంది.

"పద్మావతికి పిల్లలంటే ఎలాగయినా అదొక యిది! ఆవిడ పిల్లలకి ఈవిడ పిల్లలికి సహస్రాంతకం తేడా వుంటుంది." సుభద్రమ్మ చిన్న కోడలు సరస్వతిని చూపిస్తూ, రంగనాయికమ్మ, నళిని అభిప్రాయాన్ని ఖండించింది.

"ఏం, నా బాబుకేం. వాడెందులోనూ ఎవరికీ తీసిపోడు. ఈ వంశోద్ధారకుడు వాడే. నా తోటి కోడలు కూతురు కంటే నా పిల్లలు అన్నివిధాల గొప్పవాళ్లే అవుతారు. బండెడు చాకిరీ చేసి మంచివాళ్ళని పించుకున్నంత మాత్రాన, తెలివైన పిల్లలు పుడతారా! లింగుమంటూ ఒక్క పిల్లని కన్న తల్లీ తల్లే!" రంగనాయికమ్మ మాటలికి సరస్వతికి తన స్వాతిశయం దెబ్బ తిన్నట్లనిపించి, తన ఎదుటే, తోటికోడలు పద్మావతి కంటె తనని తక్కువగా జమ కడితే, అంతరంగంలో పద్మావతి మీద గౌరవం వున్నా, భరించ లేకపోయింది సరస్వతి.

"నువ్వు మాత్రమేం పదిమంది పిల్లల్ని కన్నావా?" సరస్వతికి కోపం వచ్చిన సంగతి తెలిసికూడా అంది రంగనాయికమ్మ.

"పది మందిని కనకపోతే మాత్రమేం నేను మగబిడ్డ తల్లిని. నాకేం. అన్ని విధాలా మిగతావాళ్ళకంటె నే నధికమే" సరస్వతి స్వాతిశయం మరొక మెట్టెక్కింది.

"అయినా మా కెందు కొచ్చిందిలే అమ్మా. వస్తాం." అండాళ్ళమ్మతోబాటు మిగిలిన వారంతా వెళ్ళిపోయారు. సుభద్రమ్మ, సరస్వతి మాత్రం హాల్లో నిశ్శబ్దంలో కూర్చున్నారు.

గదిలో నుంచుని ఆ మాటలన్ని విన్న పద్మావతి ముఖం వివర్ణమయింది. పద్మావతి మనసులో ఆమె ఎన్నడూ ఎరుగని అసహ్యం, కోపం, అసూయ చెలరేగాయి సరస్వతి మీద—సరస్వతికి నాపై ఇంత ద్వేషం, అక్కసు వున్నా యన్నమాట! మగపిల్లవాడి తల్లినని ఎంత గర్వం! నా ఎదుట; నాపై ఆదరణ నటిస్తూ మనసులో వేరే విధంగా ఆలోచించటం సరస్వతి స్వభావమా! నాలుగేళ్ళ నుంచీ నేనా విషయం గ్రహించనే లేకపోయానే. - తను ఎదురుగా వుండి, సరస్వతి అట్లా మాట్లాడుతూంటే చూస్తూ ఎలా కూర్చో గలిగింది అత్తయ్య. అత్తయ్య ఆ మాటలు వింటూ మవునంగా కూర్చున్నదంటే ఆమెకు కూడా నాపై అదే అభిప్రాయం వుందా?- నా శక్తంతా ధారపోసి పగలనక రాత్రనక శ్రమిస్తూ, అత్త మామలకీ, మరిదికీ, తోటి కోడలుకీ, ఇంటిల్లపాదికీ నేను చాకిరీ చేస్తూంటే దానికి ప్రతిఫలమా యిది ?— తను మగ పిల్లవాణ్ణి కంటే మాత్రం నన్ను గురించి అంత అవహేళనగా ఎందుకు మాట్లాడటం. తను పనిమనిషితో సమంగా సరస్వతి నన్ను భావిస్తుందన్న మాట!—అయినా తప్పంతా నాదీ ఆయనదీను. రాత్రింబవళ్లూ పొలం పట్టుక్కూ-

ర్చాని వెట్టి చాకిరీ చేస్తూ కుప్పలుగా పండి స్తాడు ఆయన. ఎవరికోసం ? వీళ్లందరి కోసం కాదూ! తమ్ముడు పంచాయితీ ప్రెసిడెంటని మురిసిపోతూ వుంటారు ఆయనకేం ఒరిగిందో అందువల్ల! ముఖ్యంగా నాది' పద్మావతి యింక ఆలో చించలేక తల భారంగా అనిపించి చాప మీద మేను వాల్చింది

* * *

శివరామయ్య పెదపాక గ్రామంలో మోతుబరీ రైతు అతనికి ఇద్దరు సంతా నం పెద్దవాడు వెంకట్రామయ్య, రెండో వాడు రాజారావు. సుభద్రమ్మ అతని భార్య.

వెంకట్రామయ్య భార్య పద్మావతి వారికి ఒక్కగా నొక్క కూతురు రమ. రమ వయస్సు ఆయిదేళ్లు. రమ పుట్టిన తరువాత రెండేళ్ళకు పద్మావతి తిరిగి గర్భ వతయింది. కానీ ఇంట్లోకి నీళ్ళు తెస్తూ, దొడ్డి గుమ్మం పద్దున్న మెట్ల దగ్గర కాలు జారి బిందెతోపాటుగా క్రింద పడటం మూలాన ఆమె గర్భకోశానికి దెబ్బ తగి లింది అపరేషన్ చేసి చనిపోయిన శిశు వును బయటకు తీశారు. ఆ కారణాన యిహ పిల్లలు కలిగే అవకాశం లేకుండా పోయింది పద్మావతికి.

రాజారావు భార్య సరస్వతి. రాజారావు బి. ఎ; దాకా చదివాడు. చదువుకున్న పిల్ల కావాలని సరస్వతిని పెళ్ళి చేసుకున్నాడు. రఘు వాళ్ళ బిడ్డ. వాడికి మూడేళ్ళుం టాయి.

వెంకట్రామయ్య వ్యయసాయం తనే స్వయంగా చూసుకుంటాడు రాజారావుకు పొలం పనులు రాక, యిష్టం లేక, రాజ కీయాల్లో దిగి గ్రామ పంచాయతీ ప్రెసి డెంటయ్యాడు. వారి కుటుంబం అంటే గ్రామంలోని వారందరికీ చాలా గౌరవం

* * *

"అమ్మా. అమ్మా" దొడ్లోంచి రమ కేకలు వినిపించి, ఏమయిందోనని వంట చేస్తున్న పద్మావతి వంట గదిలోంచి దొడ్లోకి వెళ్ళింది.

రమ భావిలోకి చెయి చూపిస్తూ అమ్మా ఆడుతూ ఆడుతూ, తమ్ముడు నూతిలో పడ్డాడే" ఏడుస్తూ చెప్పింది. పద్మావతి కంగారు పడింది. త్వరత్వరగా భావి దగ్గ రున్న బొక్కెన భావిలోకి వేసింది. భావిలో నుండి రఘు అరుస్తున్నాడు.— పద్మావతి మనసులో మధ్యాహ్నం సరస్వతి అన్న మాటలు వినిపించాయి. 'వీడిని చూసు కునేగా సరస్వతికి అంత అహం. ఆ గర్వంతోనేగా నన్నలా అంది! నా మీద అంత అలుసు, ద్వేషం వున్నదాని కొడు కును నేనెందుకు రక్షించాలి ? .... నాకేం పట్టింది. మంచితనానికి ఈ లోకంలో విలువేముంది గనక! వీడే లేకపోతే, సర స్వతికా గర్వం వుండదుగా!'—

రమ పిలిచిన పిలుపు విని ముందు సావడిలో కూర్చునున్న వెంకట్రామయ్యా మిగిలినివారంతా దొడ్లోకి వచ్చారు. పద్మా

వతి, చేతిలోని బొక్కెన నీటిలోకి వేసింది.

"ఏమయింది పద్మా? ఏమయింది? నూతిలోకి దిగడానికి సిద్ధమవుతూ అన్నాడు వెంకట్రామయ్య.

"ఆడుకుంటూ ఆడుకుంటూ రఘు కాలు జారి నూతిలో పడ్డాడట రమ పెట్టిన అరుపును విని నే నొచ్చాను" బొక్కెనను యింకా భావిలోనే వుంచి అంది పద్మావతి.

"ఎన్నిసార్లు చెప్పినా వినిపించు కుంటారా, భావిచుట్టూ ఎత్తుగా పరలు కట్టించండీ అంటే." వెనకనుంచి సుభద్రమ్మ అంటూంది.

"అంత యిల్లుంటే ఈ గాడిదలు నూతి దగ్గరే ఎందుకు ఆడాలి?" శివరామయ్యకు కోపం వచ్చినట్టుంది.

సరస్వతి అయోమయంగా భావిలోకి చూస్తూ నుంచునుంది మనసులోని ఆవేదనంతా ఆమె ముఖంలో కనుపిస్తూంది.

రమ పాలిపోయిన ముఖంతో నుంచునుంది, తప్పు చేసినదానిలాగా. వెంకట్రామయ్య రఘుని భుజాన వేసుకుని భావిలోంచి బైటకు తీసుకొచ్చాడు. సరస్వతి వుబికి వస్తున్న రోదనను ఆపులేక పోయింది. "బాబూ" అంటూ ఏడ్చేసింది.

"అరుగు మీద పడుకోబెట్టి కడుపు నొక్కి ముందుగా వాడు మింగిన నీళ్ళను బైటకు తీయండి. ఒరేయ్ రామయ్యా. నువెళ్ళి డాక్టరుగార్ని త్వరగా పిలుచుకుని రా." ఆతురతపడుతున్నాడు శివరామయ్య.

డాక్టరు వచ్చాడు కళ్ళు తేలవేసి వున్న రఘుని పరీక్షించి "ఆలస్యమయిపోయింది వెంకట్రామయ్యగారూ. ప్రయోజనం లేదు. చనిపోయాడు." అని చెప్పి వెళ్ళిపోయాడు.

సరస్వతి గుండెల్లో కోటి కుంపట్లు మండుతున్నాయి. కళ్ళు నీటి ధారలు కారుస్తూ వుంటే ఆమె నోటి నుండి సముద్రపు ఘోష వినుపిస్తూంది. సుభద్రమ్మ పరిస్థితి అలానే వుంది. ఒక్క సుభద్రమ్మే ఏమిటి, అక్కడున్న ప్రతి ఒక్కరి పరిస్థితీ అట్లాగే వుంది. ప్రతికళ్లూ చెమర్చినాయి.

మృతదేహాన్ని తీసుకుపోతూంటే సరస్వతినీ, కట్టలు త్రెంచుకొస్తున్న ఆమె శోకాన్నీ ఆపటం ఎవరికీ సాధ్యం కాలేదు. కానీ విధిని ఎవరూ ధిక్కరించ లేరుగదా!

వారం రోజులు గడిచాయి ఎప్పుడూ సరస్వతి నవ్వులతోను, పిల్లల అల్లరితోను పద్మావతి పురమాయింపులతోనూ కళ కళలాడే ఆ యిల్లు, పాడుబడ్డ కొంపలా కళా విహీనమయింది. శోకమూర్తి ఆ యింట్లో తిష్టవేసి కూర్చున్నాడు.

పరామర్శించటానికని గ్రామ వాసులింకా వచ్చి వెళుతూనే వున్నారు. క్రొత్త వారిని చూస్తే చాలు సరస్వతికి తెరలు తెరలుగా వసూంది ఏడుపు.

"చదువుకున్న దానివి అన్నీ తెలిసిన దానివి. నువ్విలా ఏమీ తినకుండా విచా

రిస్తూ కూర్చుంటే ఎలా చెప్పు'' ఎదురింటి రంగనాయకమ్మ సరస్వతి చేత రెండు మెతుకులు కతికిద్దామని అంది.

"నేను చాలా దురదృష్టవంతురాల్ని రంగనాయకమ్మగారూ. రఘుని చూసుకుని మురిసిపోయేదాన్ని, గర్వపడేదాన్ని. భగవంతుడికి కోపం వచ్చింది. అందుకే యిలా చేశాడు. నాకు అన్యాయంచేశాడు. సరస్వతి తనని తనే నిందించుకో సాగింది.

. . .

'ఏడవకమ్మా. ఏం చేస్తాం. వాడికి మనకి ఋణం తీరిపోయింది. చాలా తెలివయిన వాడు. బొద్దుగా 'నానమ్మా'అంటూ యిల్లంతా తిరుగుతూండేవాడు ఆ భగవంతుడు ఓర్వలేకపోయాడు '' సుభద్రమ్మ కోడల్ని ఓదార్చ ప్రయత్నించింది.

గత నాలుగు రోజులనుంచి రమ ఆరోగ్యం బాగాలేదు. జ్వరం వస్తూంది. డాక్టరు వచ్చి చూపి ' డెంగ మీద వచ్చిన జ్వరం'' అని చెప్పి ఏవో మందు లిచ్చి వెళ్ళాడు కూతురికి వచ్చింది మామూలు జ్వరమైనా ఎందువల్లనో చెప్పలేనంత ఆవే



దనగా వుంది పద్మావతికి. రమ రఘుకోసం బెంగపడ్డదంటే,...బెంగతో వచ్చిన జ్వరం యిన్ని రోజు లుంటుందా! రమకు జ్వరం హెచ్చిపోతే! ఏదైనా కాకూడనిదయితే! బాబోయ్' తను బ్రతకగలదా!!!—

"ఎందుకమ్మా ఏడుస్తున్నావ్? తమ్ముడి కోసమా?" ప్రక్కనే కూర్చుని జుట్టును సర్దుతూన్న పద్మావతి అడిగింది రమ.

"అబ్బె. ఏం లేదమ్మా. నీకు జ్వరం వచ్చిందని."



"తగ్గిపోతుందిగా."

"తగ్గుతుంది తల్లీ. తప్పకుండా తగ్గుతుంది. పడుకో. నిద్దరపో." రమ తల నిమిరి, ముద్దు పెట్టుకుంటూ అంది పద్మావతి.

రమను నిద్రబుచ్చి తనూ వెళ్ళి పడుకుంది పద్మావతి. కాని నిదుర రావడం లేదు. పగలంతా చాకిరీచేసి శరీరం అలసిపోయింది. విశ్రాంతిని కోరుతూంది. మనసు మాత్రం విశ్రాంతి తీసుకుంటానికి నిరాకరిస్తూంది. రమకు యిదివరలోనూ చాలా సార్లు జ్వరం వచ్చిందీ, తగ్గిపోయింది కూడాను. తను యింత బాధ పడలేదెప్పుడూ. ఇప్పుడు మాత్రం రమకి జ్వరం అన్నమాటే భయంకరంగా అనిపిస్తూంది. దానికి కారణం తనలో తనే ఆలోచించుకో సాగింది పద్మావతి—నే నేమయినా తప్పుచేశానా? రఘు నాప్రయత్న లోపంవల్ల మరణించాడా? ఒక వేళ నా ప్రయత్నలోపంవల్ల మరణించినా? తప్పులేదు. వాడ్ని చూసుకుని సరస్వతి నన్ను గురించి నలుగుర్లో ఎంత అగౌరవంగా నోటి కొచ్చినట్లు మాట్లాడింది. అంత గర్వం ప్రబలినప్పుడు తగిన శాస్తి జరగాల్సిందే. రఘుని రక్షించడంలో నా ప్రయత్నంలో లోపం వున్నా బాధ పడవలసిన పనిలేదు. నేను చేసిన పని మంచిదే. సరస్వతికి యిప్పుడుగానీ తెలిసిరాదు, తాను మగబిడ్డ తల్లినని విఱ్ఱవీగినందుకు ఫలితం....ఏమిటి నా మనసు ఇంత కఠినంగా ఆలోచిస్తూంది? తప్పు చేసింది సరస్వతయి నప్పుడు. రఘూ ఎందుకు చావాలనుకున్నాను? నాలో రాక్షసత్వం ఏర్పడిందా? పసివాడు వాడు నాకేం అపకారం చేయలేదే. అభం శుభం ఎరుగని వాడ్ని నే నెందుకు బలిగొన్నాను. సరస్వతి ఏదో అన్నంత మాత్రాన నాలో అంత పశుత్వం ఎందుకు ప్రబలింది. స్వార్థం వున్నప్పుడు సరస్వతికి మాత్రం స్వార్థం వుండకూడదా? అందులో ఆమె తప్పేముంది. ఆమె బైటకు అన్నది. నేను లోన అనుకుంటున్నాను. అదే బేధం. ఆమెపై నా కెందుకు ప్రతీకార వాంఛ. అటువంటి వాంఛే వుంటే సరస్వతిపై తీర్చుకోవాల్సింది. అంతేగాని పాపిష్టిదాన్ని ఎంత అన్యాయం చేశాను. నిండు ప్రాణిన్ని చేతులారా చంపానే! నా పిల్లకా వుసురు తగిలితే! రమకు జ్వరం హెచ్చిపోయి.... 'అమ్మో' కాకూడదు. అలా ఎన్నటికీ కాకూడదు. తప్పుచేసింది నేను. రఘుని చంపింది నేను. నా రమకేం అపాయం జరక్కూడదు - జరగకూడదు'

పద్మావతి బిగ్గరగా అరచిన అరపులకి వెంకట్రామయ్యతోబాటు అందరూ ఆమె పడుకునున్న మంచం దగ్గర కొచ్చారు.

"రఘూ చనిపోవటానికి కారణం నేను నేను" పద్మావతి బిగ్గరగా అరుస్తూ లేచి కూర్చుంది.

"పద్మా. పద్మా ఏమిటి? ఏమిటలా అరుస్తున్నావు?" పద్మావతిని తన చేతుల్తో

నిద్ర లేపుతూ అడిగాడు వెంకట్రామయ్య.

"ఈ ఇంటి కేదో అనర్థం పట్టిందమ్మా. లేకుంటే ఎప్పుడూ లేంది ఏమిటిదంతా?" పద్మావతి పెడుతున్న పిచ్చి కేకలు విని వాపోయింది సుభద్రమ్మ.

"ఏమండీ. రఘు భావిలో పడ్డప్పుడు బొక్కెన నూతిలో వేయిటంలో నేనే కొంచెంగా ఉపేక్షించానండీ. అందుకనే నా చిట్టితండ్రి వాడు చనిపోయాడు. నేను బ్రతికించ లేకపోయాను. సరస్వతీ... పది మందిలో నన్ను దూషించిందన్న కోపంతో రఘుని బైటకు తీయటంలో ఉపేక్షించాను. నేను శ్రద్ధగా ప్రయత్నిస్తే బ్రతికే వాడేనండీ" పద్మావతి ఏడుస్తూ చేతుల్తో ముఖాన్ని కప్పుకుంది.

"ఛ. ఏమిటా వెర్రి మాటలు. నువ్వు రఘుని రక్షించకుండా ఉపేక్షించటమేమిటి? మే మందరం రానే వచ్చాంగా. ఆ ఘడియొస్తే ఎంతటివాళ్ళయినా పోవాల్సిందే. వృథాగా నువ్వు వ్యధపడి మమ్మల్ని బాధ పెట్టకు—" వెంకట్రామయ్య మందలిస్తున్నట్లన్నాడు.

"అమ్మా సరస్వతీ" పద్మావతి వెర్రిగా అరిచింది. ఎదురుగా నుంచునున్న సరస్వతి పేలవంగా నవ్వింది. సరస్వతి నవ్విన ఆ నవ్వుని చూసి పద్మావతి విరగబడి నవ్వసాగింది. ఆమె నవ్వుని ఆపటం ఎవ్వరికీ సాధ్యం కాలేదు.



దారితప్పిన బాటసారి



ఎన్. కె. రామారావు

"రాత్రి నల్లని రాతి పోలిక—గుండెమీదనె కూరుచుండగా"—నిద్ర పట్టటం లేదు పోలికి.

రాత్రి - చిమ్మ చీకటిగా వుంది. రాకాసి బొగ్గు పొడిని ప్రపంచం అంతా పూశారా అన్నంత నల్లగా వుంది. కరువులో అధిక మాసంలాగా దానికి తోడు మబ్బులు.

మంచం ఇరుకుగా వుంది. కదిలినప్పుడల్లా కిర్రు మంటున్నది నులక మంచం. మబ్బులు గాలి, చీకటికి "విటమిన్లు"గా వుపయోగపడి లోకాన్ని మరింత చీకటి తరం చేస్తున్నాయి.

దూరాన—ఓకుక్క - దిక్కూ దివాణం

లేని వీధి కుక్క—"కుఁయ్యో"మని సైరన్‌లా అరిచింది.

ఉలిక్కిపడింది పోలి. లేచింది. నులక మంచం పట్టెమీద కూర్చుంది. రెండు చేతులూ తలగాయకు చేర్చి గుడిశె నలు మూలలా చూసింది. "కోడిగుడ్డు దీపపు" వెలుగులో ఓ మూల ఓ కాలు విరిగిన పీట - చిలుము పట్టిన ఓ రేకుపెట్టె— దండమీద ముదురాకు పచ్చ రెండు చీరలు- ఓ పల్చటి బిందె - రెండు కుండలు - ఎప్పుడూ కనపడేవే—కనిపించాయి.

బయట గాలి హోరు విపరీతంగా వుంది. "నేను లేకుంటే మీరు లేరు" అన్నతం ధీమాగా వుంది గాలికి.

మంచం కిర్రుమంది. దానిమీది బొంతలో పడుకున్న పోలి కొడుకు - దాసుకు జ్వరంగా వుంది.

పోలి వెళ్ళింది. మంచం దగ్గరగా వంగుని దాసు బుగ్గమీద చేయి వేసింది. వళ్ళు చాలా వేడిగా వుంది దీపపు వెలుతురు ఒక్కసారిగా ఎక్కువయింది. పోలి వెనక్కి తిరిగి దీపంవైపు చూసింది. దీపం ఆరిపోయే ముందు వెలిగే అద్భుతమయిన వెలుగది. పోలికి తెలుసు. ఆ దీపం ఎందుకలా వెలిగిందో, దాన్లో కిరసనాయిల్ లేదు

"అమ్మా....అమ్మో ఆకలే" మూలిగి పక్కకు తిరిగాడు దాసు. మంచం మళ్ళీ కిర్రుమంది. పోలి కడుపులో పేగులు కూడా "కేరు"మన్నాయి.

"చూడూ - పోలమ్మా - ఇలా అయితే ఏమీ బాగుండలేదు. నీ కొడుక్కి జ్వరమయితే మమ్మల్నేం చేయమంటావ్? ఏదో కాస్త మా మొహాన పడేయి. లేకుంటే పని మానేస్తాం"—బెదిరించాయి పోలి పేగులు.

చుట్టూ చీకటి. పోలి లేచింది. తడుము కుంటూ వెళ్ళి రేకు గ్లాసుతో రెండు గ్లాసుల నీళ్ళు పొట్టలోకి పంపించింది. కరువు భత్యం పెంచగానే సమ్మె మానేసిన వుద్యోగుల్లా. గప్‌చిప్‌గా వుండిపోయాయి పేగులు. "హమ్మయ్య" అనుకుంది పోలి.

కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి, "ఈః దుర్మార్గుడు ఇంక వచ్చి సావలే. కట్టుకున్న దాని సుకం లేకపోతే పీడా పోయె. కన్నోడికి జొరం కాసిందన్నా చూసే దిక్కు లేకపోయె. యాడ తాగుకుంటూ కూకున్నాడో"—చెరువు అలుగుమీద నుంచి పారే నీటిలా దుఃఖం వస్తున్నది.

దాసు మూలుగు మొదలెట్టాడు. మూలుగు మూలుగుకూ పోలి ప్రాణాలు వెళ్లుకు వస్తున్నాయి. "బగమంతుడా—ఈ ఒక్క రాత్తిరి నా కొడుకును రచ్చించు. తెల్లారి దరమాసుపత్తికన్నా తీస్కపోతా"

వాన మొదలయింది. బయట రిక్షా ఆగిన చప్పుడూ, దాని వెంట ఓ పాట- పాట తలుపుదాకా వచ్చి ఆగిపోయింది.

తడక తలుపుమీద వేళ్ళ చప్పుడు.

"టక్-టక్-టక్"

....

"కాయ్ రాజా కాయ్ రాజా కాయి"

....

'టక్-టక్-టక్"

....

"కాయ్ రాజా కాయి"

పాట ఆగింది. చప్పుడూ ఆగింది.

"ధూత్ - సీయ్యాలి - ఓకున్నదే లోనా-తలుపు తియ్యి—బద్మాష్ లం—"

తలుపు తెరవబడింది. సుడిగాలిలా లోనకు ప్రవేశించాడు సూరాయి.

సూరాయితోపాటు సారాయి కంపు కూడా లోపలికి వచ్చింది దాంతోపాటు కాస్త వానజల్లు, వానజల్లుతోపాటు ఓ కుక్కపిల్ల కూడా లోపలికి వచ్చాయి. జేబులో చేయి పెట్టాడు సూరాయి. అగ్గిపెట్టె తగిలింది. బయటకు తీసి ఓ పుల్ల గీశాడు ఆ వెలుతురులో పోలి ముఖం చూశాడు - మంచంమీద పిల్లడిని చూశాడు-ఇంటి కప్పుకేసి చూశాడు. చేయి చురుక్కు మంది. అగ్గిపుల్ల ఆరిపోయింది.

"బువ్వేమన్నా వుంటే పెట్టు."

'బువ్వ - అవ్వ - ఏడకెల్లి తెమ్మంటవ్ నిన్నటాల బట్టి గింజన్నా లేకపోయె. పిల్లోడికి జొరంగా వుండె—నువ్వు రాక పోతివి - నన్ను సావమంటావా - సెప్పు - సస్తా - లేపోతే నువ్వే నా గొంతు పిసుకు-సస్తా - ఈ బాదలు నేను పడ్లేను. ఈ యమ సెర నాకింకొద్దు. ఈ కత్తులమీద నడక - ఇంక నా సాత కాదు. ఇగ నువ్వు బతకమన్నా నేను బతకను. ఆ బగమంతుడి దయవల్ల ఈ ఒక్క పిల్లోడు. ఈడికి జొరం కాసిందన్నా సూసే దిక్కు లేక పాయె ఇక ఈ కట్టాలు నేను పడను కాక పడను"

అగ్ని పర్వతాన్ని బ్రద్దలు చేసుకుని బయటకు వచ్చిన లావాలా, వేడిగా, వాడిగా వేగంగా వస్తున్నాయి మాటలు.


"సర్లే—నాకిన్ని మంచినీళ్ళియ్యి—తెల్లారి దరమాసుపత్తిరికి తీస్కపోవాం అడిని."

వాన వెలిసింది. పోలి ముడుచుకుని దాసు మంచంలోనే పడుకుంది.

2

'దరమాసుపత్తిరి'వద్ద జనం 'క్యూ'లో నిలబడ్డారు. ఊర్లోని అనారోగ్యం అంతా మూట కట్టి అక్కడ దింపారా - అనిపిస్తుంది. డాక్టరుగారు టెర్లిన్ చొక్కా టెర్రికాటన్ ప్యాంటులోకి పంపించి, తెల్లగా, అయిసు ముక్కలా, అమెరికా వాడు కాలు పెట్టకముందు చంద్రుడిలా, (పెట్టింతర్వాత చంద్రుడు మారాడని కాదు - "ఛీ - చంద్రుడూ నువ్వెంత పనికి మాలినవాడివి" అని కార్టూనులు, కవితలూ వచ్చాయిగా) "నా ఆరోగ్యానికి కారణం" అన్న పోజులో వున్నారు. "హార్లిక్స్" తాగకున్నా—హమామ్‌తో స్నానమాడకున్నా సూరాయి కూడా రాయిలా గట్టిగానే వున్నాడు. వాడి చేతుల్లో దాసు—ఏసు ప్రభువు చేతుల్లో గొర్రెపిల్లలా

ఐ.ఓ.బి మీ ఆదాలను పెంచుతుంది



పసిబిడ్డను కన్నతల్లి ప్రేమతో పెంచి పెద్దచేసి గర్వించేటట్లే ఐఓబి మీ ఆదాలను జాగ్రత్తచేసి. వడ్డీవేసి వృద్ధి పొందించి మీకు అవసరమయేవరకు నిధిలో వుంచుతారు. IOB-5940

ఐఓబి ప్రతీవారికి అనువుగావుండేటట్లు అనేకరకాల సేవింగ్స్ సౌకర్యాలను కల్పిస్తుంది—సేవింగ్స్ బ్యాంక్ అంకౌటు—రికరింగ్ డిపాజిట్లు—టెర్మ్ డిపాజిట్లు—మొదలైనవి. మైనరు పిల్లలకు ప్రత్యేక సేవింగ్స్ సౌకర్యాలుగలవు. మరిచిపోవద్దు! సేవింగులమీద రూ. 3000ల వడ్డీ వరకు పన్నులుండవు. అదే విధముగా 1.5 లక్షల బ్యాంక్ డిపాజిట్లకు వెల్త్ టాక్సులేదు.

మీ ఆదాలు ఐఓబిలో పెరగనివ్వండి!

ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్

సెంట్రల్ ఆఫీసు 151 మౌంటు రోడ్డు మద్రాసు 2

పడుకుని వున్నాడు. వాడి కనురెప్పలు వాలి వున్నాయి. సూరాయిని కావిలించు కున్న వాడి రెండు చేతులూ రెండు బక్క-చిక్కిన బురదపాముల్లాగున్నాయి. వాడి జుత్తు మొక్కజొన్న పీచులా వుంది. గుండె ఎముకలు "ఎక్సరే" అక్కర్లే కుండానే కనిపించేలా వున్నాయి.

కొండచిలువలా వున్న "క్యూ" కదలటం మొదలెట్టింది.

"డాట్రుగారూ"— రెండు కాళ్ళూ లంకించుకున్నాడు సూరాయి లంకె బిందెల్లా-

"ఛత్-వదులు-వదర్లా" పక్కకి తిరిగి చూసి, నవ్వుతున్న నర్సును చూసి సిగ్గు పడిపోయాడు 'డాట్రు' గారు.

"తమరే రచ్చించాలి నా కొడు కును"— కాళ్ళు వదిలేశాడు సూరాయి.

ప్యాంటు నలిగిందో-లేదో చూసుకుని, జేబులోంచి రుమాలు తీసి నుదురు తుడుచు కున్నారు "డాట్రు"గారు. తీయని ఖరీదైన సెంటు వాసన, ఫాను ద్వారా హాలు నాలుగు మూలలా పాకింది.

కుర్రాడిని బల్లమీద పడుకోబెట్టారు. పదినిమిషాలు పరీక్ష చేశారు. పదిమాత్రలు ఇచ్చారు. ఒక ఇంజక్షన్ ఇచ్చారు. మాత్రలు పూటకొకటి వేయమన్నారు. మూడుపూటలా పాలు తాగించమన్నారు. రోజుకో గుడ్డు అన్నారు. అదికాక రోజుకో బత్తాయి అన్నారు. ఇంకా "ఇదిగో - ఈ రెండు మందులూ కొను క్కురా. చాలా ముఖ్యం-ఇవి ఆసుపత్రిలో దొరకవు" అన్నారు.

"ఆసుపత్తిరి నుంచే — ఇయ్యండి నాయనా-బీదోణ్ణి-కాళ్ళమీదపడతా" వేది రించాడు సూరాయి

"ఎవర్రా-మీకీ కాళ్ళమీదపడే టెక్నిక్ నేర్పింది. కాళ్ళమీద పడితే పన్లవుతయ్యా-ఆసుపత్రిలో వుంటే ఇవ్వాలని మాకు తెలియదా-లేపు! పో-పో" కసిరాడు డాక్టరు గారు.

"పోనీ, ఎంతవుద్దో నన్నా సెప్పం డయ్యా".

"ఎనిమిది రూపాయలు కావచ్చు"

ఎనిమిది రూపాయలంటే భయం వేసింది. పిల్లడిని ఇంటికితెచ్చి పడుకో బెట్టాడు.


"సూదిమందు-ఎనిమిది రూపాయలు ఎట్టా తెద్దాం" సమస్య ప్రశ్నగుర్తుతో ఎదురుగ్గా నిలుచుంది.

పేలికళ్ళు ఎఱ్ఱగా వున్నాయి. పొట్ట లోతుకు పోయింది.

"అట్టనే -- మనకిన్ని — నూకలకు పైసలు నూడు మాఁవా".

ఆ మాట చాలా చిన్నది. ఆ అభ్యర్థన వెనుక, "నిన్ను గనమైన కోరికలు కోర్లేదు కోకలు అడగలేదు-ఈ పొట్టలో ఇన్ని గంజినీళ్ళు పోసి నాల్రోజులు బత కని" అన్న అర్థం వుంది.

పెళ్ళాం ముఖం చూసేసరికి బాధని పించింది సూరాయికి. దాని మొహం వాడి



పోయిన మల్లెపూవు లాగున్నది.

"ఉచ్చాను, ఉచ్చాను-దానికి నేనేం న్యాయం సేసాను, కార్లు బంగ్లాలు మన జనమలకి రాసిపెట్టి లేవు.

ఓనాడు ఓ మంచి రవికె ముక్కయినా తెచ్చిచ్చానా?'' ఇయ్యాల కనీసం కడుపు నిండా కూడు కూడా పెట్టలేక పోతున్నా''—

ఇలా ఏన్నోసార్లు జ్ఞానోదయం కలుగుతూ వుంటుంది. సాయంత్రం కాగానే రిక్షా కిరాయిచ్చేసి, అలా సారాయిదుకాణం మీదనుంచి వస్తుంటే, ప్రాణాలు లాగుతాయి. దాంట్లోకి వెళ్ళింతర్వాత, ఎక్కడ లేని వేదాంతం వచ్చేస్తుంది. జన్మరహస్యాలన్నీ బోధపడినట్లవుతుంది. దేవుడు రాసిపెత్తే నూకలకి దబ్బులు మిగులుతాయి. లేకుంటే?''

"సర్లేవే తెత్తా'' హామీ యిచ్చి కదిలాడు.

3

బస్సుస్టాండులో జనం చాలామంది వున్నారు. వచ్చేబస్సులు వస్తున్నాయి. పొయ్యేబస్సులు పోతున్నాయి. వచ్చే బస్సులనిండా కిటకిటలాడే జనం, పోయే బస్సుల్లో కూడా అలాగే.

రాత్రి పడినవర్షం మూలంగా బస్టాండులోని నేలంతా తడి తడిగా బురద బురదగా వుంది. అరటిపళ్ళ తొక్కలు-బీడీ పీకలు-సిగిరెట్టు ముక్కలు, కిళ్ళీలు నమిలి వుమ్మేసిన తాలుకు రక్తారుణ చిహ్నాలు-బస్సులు తిరిగేచోట ఏర్పడిన గుంటలు-వాట్లో టీ లాంటి ఎఱ్ఱటి వాన

సీళ్ళు-దాంట్లో బస్సుల తాలూకు అఖిల్ కారి ఏర్పడిన తాత్కాలిక ఇంధ్ర ధన స్సులు.

సూరాయి మనస్సు కూడా బస్సుస్టాండు లానే గజిబిజిగా వుంది.

"హాం ఆదొర సూట్‌కేసు పట్టుకుని ఇటే వస్తుండు."

సీటుతీసి దులిపి మళ్ళీ వేశాడు. దారి తప్పి రాబోయి సరయిన దారి తెలుసు కున్న వాడిలా సూట్‌కేసువాలా వేరేవైపు వెళ్ళిపోయాడు.

"రిక్షా కావాలా సార్,"

"వద్దు."

"రిక్షా వద్దా సార్?"

"వద్దు."

"రిక్షా చాహియేసాబ్?"

"నై."

"రిక్షా నకో సాబ్?"

"నకో".

....

జాతీయ పోరుపు వుద్యమం మొదలు పెడుతున్నట్లుగా వున్నారు వాళ్ళందరు

"రాండి సార్-రాండి, విజయవిలాస్‌కు నలభై పైసలు."

హుంషారుగా అరిచాడు సూరాయి.

ముప్పయి పైసలు అనగానే వేరేవాడి రిక్షా ఎక్కి వెళ్ళిపోయాడతను.

"అరేయి లింగయ్యా! ముప్పయి పైసల కెన్నడన్నా తోలావురా రిక్షా-ఘోటే కొత్తావురా? దొంగ లం........"

సూర్యుడు నెడినత్తిమీద కొచ్చాడు. ఎసూరాయి రిక్షా నడివూళ్లోకి వచ్చింది. క్కడా బేరం లేదు. సాయంత్రం కిరాయి ఎలా కట్టాలో?

మర్రిచెట్టు కింద ఇద్దరు రిక్షావాళ్ళు బాలమ్మచేతి మిరపకాయ బజ్జీలు మహా వుషారుగా తింటున్నారు, సూరాయి రిక్షా చెట్టుక్రింద చేరింది. బజ్జీలు చూస్తుంటే నోరూరుతున్నది.

"అరేయ్ ఓ పదిపైసలుంటే ఇయ్యారా. అప్పటాళకిస్తా మళ్లీ" పక్క వాడి నడిగాడు.

"అప్పా? నన్నడగొద్దురా-పొద్దుటాళ బట్టీ బేరం లేదు."

"ఛే! ఇశ్వాసం లేదురా మీకు-నిన్న కాక మొన్న సుట్టపీకలకి సస్తావుంటే అర్ధ రూపాయ బదులు యియ్యలేదురా-ఈది కుక్క నయ్యంరా నీకంటె"——

బాలమ్మ కిసుక్కున నవ్వి, చిల్లుల గరిటలోని ఆఖరి నూనెచుక్క కూడా మూకుడు లోనే పడేట్టుగా పట్టుకుని వయ్యారంగా, తల సూరాయి వైపు తిప్పింది.


"ఎందమ్మా నవ్వుతావ్?"

"సూదికోసం సోదికి పోతే........"

యింకా పూర్తిగా చెప్పనే లేదు బాలమ్మ.

రక్కునలేచి నిల్చున్నాడు. రిక్షాను చెట్టునీడనుంచి ముందుకు నెట్టాడు.

"సూది---సూదిమందు——నూకలు——



LIFEBUOY
for health
LIFEBUOY Soap
ఎక్కడ
లైఫ్‌బాయ్
వున్నదో అక్కడ
ఆరోగ్యం
వున్నది
లైఫ్‌బాయ్
మురికిలో గల సూక్ష్మ
క్రిములను కడిగివేస్తుంది

మిరపకాయ బజ్జీలు-సాయంత్రం సారా-రిక్షా కిరాయి —— కిరాయి —— బజ్జీలు—— సూదిమందు —— నూకలు——నూకలు—— మేకలు——నూకలెట్టా మేకలు కాస్తావ్? నూకలు తింటా——నూకలు తింటా—— నూకలు —— మేకలు —— మేకలతో—— కేకలు——కేకలు——పోలమ్మకు రైకలు-- సూదిరా సూది. గుచ్చరా గుచ్చు——నా సాంవిరంగా——కిరాయరా కిరాయి-కిరాయి గాదు నాసాంవిరంగా——ఇత్తా——కిరాయి గాదురో —— ఆకురాయి —— సారాయి—— బండరాయి——ఏ రాయయ్యితేం. పన్నూడ గొట్టటాన్కి —— ఇస్తారా —— కిరాయి—— కిరాయి కాదు సారాయి నాస్వామిరంగా.

"ఏంపే? కళ్ళు నెత్తికొచ్చినయ్యా రిక్షా మీదనుంచి నడుపుతున్నావ్."

అమాంతం తెలివొచ్చేసింది.

"జర పక్కకెళ్ళి నడవకూడదా? రిక్షోళ్లు లోకువైనారు."

"నా జన్మభూమి ఎంతో చక్కనైన దేశము. అందులో నా యిల్లు చల్లని ప్రదేశము" రేడియోలో పాట వినబడు తున్నది.

"సక్కని ప్రదేశం-ఓడ్రా సెప్పింది. నా యిల్లుసూడు బహుసక్కని ప్రదేశం సల్లగా వుంటది రొరే? బురదకదూ—— పందులు కూడా ఉంటయి ఆడ్నే —— నేనా బురదలోనే పెరిగినా-అందులోనే సస్తా. అంతకంటే నేనేనాడు-మావోళ్ళు వోరూ పైకి పోలేదొ్రారేయి."

పాట మారింది, సైకిలురిక్షా పెడలు మీద కాలు గట్టిగా, కసిగా, మంటగా, పడుతున్నది. రిక్షా పెద్దాసుపత్రిదగ్గరకొచ్చేసింది,

4

ఆసుపత్రి గేటు దగ్గర ఓ నడివయ సాయన. బుగ్గలు పీక్కుపోయాయి. కళ్ళు ఎర్రగా వున్నాయి. చొక్కా మాసి వుంది. దాంతోపాటు గడ్డంకూడామాసింది. కొంకిరులాంటి ముక్కును మధ్య మధ్య ఒదుతున్నాడు. ఆయన పక్క నిలబడ్డ ఇద్దరూ-ఆయన కేదో చెపుతున్నారు.

జంతు కళేబరాన్ని మెడ రిక్కించి చూచిన రాబందులా, పెడలుమీద నిలుచుని వాళ్ళను చూశాడు సూరాయి. "సెడిండిరా! ఆడదానిదో——మొగాడిదో సిలక లేసిపోయింది" అనుకున్నాడు. దగ్గరగా పోతే బాగుండదని, బెట్టుగా వుండదనీ దూరంగానే రిక్షా ఆపాడు. కనుచూపుమేరలో రిక్షాలు లేవు.

"ఏయ్ రిక్షా"——నువ్వే రక్ష అన్నట్టుగా పిలిచాడు పెద్దముక్కాయన.

సూరాయి దగ్గరగా వెళ్ళాడు.

"పాలెం తెలుసునా?"

"ఆఁ ఎంతమంది. ఒక్కరా?ఇద్దరా?" లేక ముగ్గురా అన్నట్టుగా మూడోవాడివైపు చూశాడు.

"ఇతనూ-ఓ చిన్నపిల్ల శవం"

"పీనుగ నేసుకపోవాలా?"

"కాకపోతే నువ్వెందుకూ?"

"పాలెం కానా దూరం."

"ఈ మాటలన్నీ వద్దు-ఎంత కావాలో అడుగు."

"ఇరవయి రూపాయలిప్పించండి."

"పది ఇస్తాం—చూడూ—ఆపదలో వున్నారు కదా అని అడిగేయటమే ఎంత పడితే అంత."

"పదేను ఇప్పించండి."

"పన్నెండు చేసుకో."

బేరం కుదిరింది. లోపల్నుంచి పిల్ల శవాన్ని తెచ్చారు. చక్కటి చిలకను మెడపిసికి పారేసినట్లుగావుందిపిల్ల మొహం నిండా పదేళ్ళ లేవు.

'సక్కదనాల తల్లి-ఎట్టా సచ్చిందో? ఈ మాయదారి దేముడు ఇంతే. కొంత కొంతమందిని తొందర చేసి తీసుక పోతాడు. కొంతమంది సెన్నాళ్ళయినా మరిసే పోతాడు'—

నిట్టూర్చాడు సూరాయి.

5

సాయంకాలం చాలా చల్లగా వుంది.

బస్సుస్టాపులల్లో తిరిగే వాళ్ళు, సెంటర్లలో పోజులు కొట్టేవాళ్ళు తెల్లారే ఆపీసుందిగా తీరికుండదు అని కూర కాయలు కొనేవాళ్ళు, పార్కులో బఠాపీలు తింటూ రేడియో వినేవాళ్ళు, "వేడి పెసరట్" అరుపులు—తోపుడుబండ్ల కేకలు, రోడ్లపక్క మల్లెపూల కుప్పల సువాసలు అందరితో అన్నిటితో హడావిడిగా వుంది బజారు.

సూరాయి కివన్నీ చూడగానే హుషారు వచ్చింది. పొద్దుటినుంచి తిండి తినలేదు అని గుర్తుకు వచ్చింది. అలా వెళుతున్నాడు.

ఒకచోట జనం గుమికూడి వున్నారు. రంగు రంగుల కాగితాలు క్లిప్పులకు తగిలించి వేలాడదీశారు. రూపాయి కాయితాల్లా వున్నాయి.

"ఏంటి దొరా అయ్యన్నీ" అడిగాడు సూరాయి.

"లాట్రీ టిక్కట్లు. ఓ రూపాయిపెట్టి కొంటే అదృష్టం వుంటే లక్షాధికారి అయిపోవచ్చు." అంతా వివరంగా చెప్పాడు.

"కొను—కొను—ఏలాంటి వాళ్ళకే సామాన్యంగా తగులుతాయి," ఉత్సాహం ఇచ్చాడు రెండోవాడు.

"ఎవడికన్నా తగిలిందా దొరా?"

"మద్రాసులో పదిమంది రిక్షావాళ్ళు తెల్లారే సరికి లక్షాధికారు అయ్యారు. తెలుసా?" దుకాణదారు అందుకున్నాడు.

"ఒక్క రూపాయకు లచ్చ రూపాయలు. ఎన్ని జనమలకి సంపాదించేను. కొంటే బాగే తగులుతే తగులుద్ది. లేకుంటే రూపాయేగా పోయేది'? నిశ్చయించేసుకున్నాడు.

"ఏది కొంటే బాగుదొరా?"

"మద్రాసు తీసుకో"—

మద్రాసు స్టేటు లాటరీ టిక్కెట్టు ఒకటి కొనేశాడు.

"కేరళ టికెట్ ఒకటేవుంది. తగుల్తే దాంట్లోనే తగలచ్చు-అదృష్టం-నీ కోసమే మిగిలిందేమో."

కేరళ కూడా కొనేశాడు.

'హర్యానాఫస్టుప్రయిజు అయిదులక్షలు పెట్టాడు. చూస్తావా?"

"అయిదు-లచ్చలు" హర్యానా కొనేశాడు.

రిక్షా కదిలింది. ఓ పెద్దమేడ-దాంట్లో ఓ చిన్న తోట-మరి రిచ్చా ఏడ పెట్టాలి? లచ్చలు వచ్చింతర్వాత రిచ్చా లెందుకురా-లుచ్చా" —

లక్షలేమోగాని ఎదురుగా కారు రావడంతో ఆలోచనలకు అంతరాయం కలిగింది. ఇంతలో బాలమ్మ కూర్చునే మర్రిచెట్టు వచ్చింది. అర్థరూపాయ బజ్జీలు తినేశాడు.

రిక్షా కదిలింది. యజమానింటికి వెళ్ళి కిరాయి కట్టేశాడు. మొత్తం పన్నెండు రూపాయల్లో అయిదు కరిగి పోయాయి.

"అయిన పనేందో అయింది. కాస్త సుక్కేసుకపోతే" సారా దుకాణంలో దూరాడు.

అరగ్లాసుమీద అరగ్లాసు లోనకు పోతున్నది.

"పోలి ఏం చేస్తున్నాదో .... ఏం చేస్తది. ఏ పక్క గుడిశలోనో ఇన్ని నూకలు బియ్యం తెచ్చి వుడకేసి వుంటది. దాసుగోడో? బగమంతుకి దయ-జొరం తగ్గిపోయుండాల — మన సేతిలో — ఏముంది—"

....

చిమ్మచీకటి వేళ—చిరుత పులులు మేకల నోట కరుచుకపోయే వేళ—దగా పడిన చెల్లెళ్ళు—నూతులు,గోతులు వెదక్కునే వేళ.

దుకాణంలోనుంచి లేచి, నత్తగుల్లలా నడుస్తూ. మ్యునిసిపాలిటీ గుడ్డి దీపాల క్రింద తూలుతూ-ప్రేలుతూ-ఇల్లు చేరుకున్నాడు సూరాయి—

అంతా అయిపోయిందిరా దేముడో-దాసు సచ్చిపోయిండురో" ఏడుస్తున్నది పోలి.

నిషా దెబ్బకు దిగిపోయింది. ఎదురుగా దాసుగాడి శవం-శవంమీద శవంలాంటి పోలి-

నిశ్శబ్దంగా నిలబడిపోయాడు. ఏడుపు కూడా రావటంలేదు.

"ఛత్-ఇన్ని తెలిసి ఇయ్యాలకూడా దారితప్పాను" అనుకున్నాడు.

నిజమే వాడు "దారితప్పిన బాటసారి" బ్రతుకు బాట ఎప్పుడో తప్పాడు.

జోగీ, జోగీ

ఒక సన్యాసి:—మనం పుట్టటమే అదృష్టము. పుట్టకుండా ఉంటే ఎంత బావుండేది.

మరో సన్యాసి;-బావుండయ్యోయ్. అంత అదృష్టానికి పెట్టిపుట్టద్దూ?

రాక్షసీ, నీ పేరు రాజకీయమా? వర్ధిల్లు!

15

పూల మొక్కలికి నీళ్ళు పోయడం ముగించి, తన మేడవేపు చూసేరు రామదాసు.

ఆ మేడ ముందు చాలా కారులున్నాయి. గుండె గుభేలుమన్నది రామదాసుకి.


మరోతరం కథ అప్పుడే ప్రారంభమైందని తెలుసుకున్న ఆయన విచారించేడు.

'చిరంజీవి నా చేయిదాటి పోయాడు. వాడిని పాడుచేసింది నేను. నేనే పాడుచేసేను. ఈ తిమ్మాపురానికి మరో రామదాసు అప్పుడే వెలిసి సిద్ధంగా వున్నాడు. కారులొచ్చేశాయి. కారుల్లోనుంచి నక్కలూ, పులులూ, సింహాలు దిగేయి. ఇవి మనిషిని ప్రశాంతంగా బ్రతకనివ్వవు. చిరంజీవి చుట్టూతా వీళ్ళు కాళ్ళరిగేలా తిరిగి, తిరిగి వాడిని మోసంచేసి తదుపరి వీళ్లు మోసగింపబడతారు. కథ మళ్ళా ప్రారంభింపబడింది. ఈ కథకి ఇంతలో ముగింపు రాదు. ఈ కారుల్లో వచ్చిన మనుషులు ఈ కథని ఆశ్రయించుకు బతికే జాతివాళ్ళు వీళ్ళందరికీ చాలా గట్టి వ్యాపారాలూ, వ్యాపకాలూ వున్నాయి. అవి భద్రంగా వుండి పదికాలాలపాటు వర్ధిల్లాలంటే 'శాసనాల' సహకారం ఎంతైనా అవసరం! 'శాసనాలు' తయారుచేసే వ్యక్తి తమ చేతిలోని వాడైతే యింకా అంతకంటే వేరే వరం ఏముంటుంది? అందుకే ఈ వేట! చిరంజీవిని వీళ్ళు బతకనివ్వరింక! చేటుకాలం సమీపించేసింది!'

కారులన్నీ వెళ్ళిపోయింతర్వాత చిరంజీవి వచ్చేడు! అతనొచ్చేసరికి రామదాసు పేముకుర్చీమీద కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు.

తండ్రి ముందు నించున్న చిరంజీవి—

• ఆదివిష్ణు •



ఎక్కువసేపు నించునే ఓపిక లేక—

"కూచోనా?" అన్నాడు.

తండ్రి తలూపేడు. కొడుకు మరో కుర్చీలో కూర్చున్నాడు.

"కారులొచ్చేయి. చౌదరీ, నాయుడూ, రెడ్డి, పంతులూ యింకా చాలామంది పెద్దలొచ్చేరు." అన్నాడు కొడుకు జనాంతికంగా.

"చూసేను." అన్నాడు రామదాసు.

"నువ్వొ వస్తావనుకున్నా నాన్నా!"

"ఆమేడకింక రానురా!"

చిరంజీవి మనస్సు చివుక్కుమన్నది.

"ఇక్కడేం తోస్తుంది నీకు?" అన్నాడు.

కొడుకువేపు చిత్రంగా చూసేరు రామదాసు. ఆపైన ఆ పూలతోటనంతా కలియ జూసేరు. చల్లటి గాలికి వారి పల్చటి దుస్తులు రెపరెపలాడటమూ గమనించేరు. పూలమొక్కలనుంచి వచ్చేసుగంధ పరిమళాన్ని గుండెల్నిండా పీల్చుకొని చాలా ప్రశాంతంగా అన్నారు,

"ఇక్కడ నాకు తోచకపోవడమా? ఇక్కడింత ఆనందాన్ని వదులుకుని నేనా మేడదగ్గరికి ఎల్లా రానురా అబ్బీ: ఈ పూలమొక్కలూ, అందమైన క్రోటన్సూ, చల్లటి సాయింత్రమూ. మనసుకి హాయిగా యింత గాలీ-ఇన్నింటిని వదిలేసి ఎల్లా రమ్మంటావ్ చెప్పు? ఇన్నేళ్ళూ నేను ఆ మేడలో సుఖపడ్డానని భ్రమించేనే గానొరేయ్, సుఖమంతా ఇదిగో ఇక్కడీ ఆరుబయట ప్రశాంత వాతావరణంలోనే వుందిరా జీవీ! ఇక్కడేవుంది నిజమైన సుఖం, శాంతీని!"

కొడుకు మొహం చిట్లించుకున్నాడు. చెప్పవలసిందేదో టూకీగా చెప్పదలుచుకుని ప్రారంభించాడు.

"వచ్చే ఎన్నికల్లో మన నియోజక వర్గం నుంచినన్ను పోటీచేయమంటున్నారు ఈ పెద్దలు?"

"ఎప్పుడో ఏడాదికి వచ్చిపడే ఎన్నికల ఇంజక్షన్లు యిప్పట్నుంచే యిస్తున్నారన్నమాట-పెద్దలు" అన్నారాయన.

"నేను వాళ్ళ కోరికను కాదనలేక పోయేను. పోటీ చేస్తానని మాటిచ్చేను."

"అల్లాగా!"

"అల్లాగా అని చప్పరించేస్తే ఎల్లా నాన్నా? నీ సలహా ఏమిటో చెప్ప రాదూ?"

"చెబితే నువ్వు వింటావా? వాళ్ళు నిన్ను విననిస్తారా? ఎందుకొచ్చిన మాటలు. గానొరేయ్ జీవీ! ఈ వచ్చిన వాళ్ళంతా ఎవర్రా! ఒకప్పుడు నా చేతికింద బతికిన మనుషులేగా? ఇవాళ నన్నొదిలి నిన్ను పట్టుకుతిరుగుతున్నార్రా నాయనా! నీ మేడకొచ్చి వెళ్ళేరేగాని అక్కడికి వందడుగుల దూరంలో బతుకుతున్న నన్ను పలుకరించేరా! వీళ్ళనెవర్నీ నమ్మనొరేయ్ మొన్నటి వరకూ నేను, ఇవాళ నువ్వు, రేపు మరో చెవలాయ్ - ఇలా మనుషుల కోసం వేటాడే ఈ గుంట నక్కల్ని దూరంగా వుంచడం ఎంతయినా మంచిది! ఒప్పుకుంటావా?"

కొడుకుకి కోపం వచ్చేసింది—

"ఇంత '-నేను పోటీ చేయటం నీ కిష్టమా కాదా?" అన్నాడతను.

"నిజం చెప్పాలంటే నాకిష్టం లేదు."

"ఎందుచేత?"

"మనలాటివాళ్లు ఎన్నికల్లో పోటీచేయడం మహాపాపం!"


ప్రతివారికి
రక్షణ కావాలి
CINTHOL
DEODORANT
LUXURY
TOILET POWDER
WITH G-11
(Hexachlorophene)
BY
godrej
ఈ రక్షణ బాక్టీరియానుండి
చెమటవాసన నుండి—
మీరు, ఇతరులు సంకోచ
పడే అవస్థనుండి—
జి-11 (హెక్సాక్లోరోఫెన్)
తో కూడిన
సింథాల్ టాయిలెట్ పౌడరు
మీకీ రక్షణలన్నీ ఇస్తుంది
ఇవే కాదు-సువాసన
సుమసుగంధము
సింథాల్—
దుర్గంధముల నుండి
సంపూర్ణ రక్షణనిచ్చు
టాయిలెట్ పౌడరు
Interpub/GP/5 Tel

"మరి నువ్విన్నాళ్లూ చేసింది?"

"మహాపాపమే!"

"ఎందుకొచ్చిన మాటలివి నాన్నా! నిజమొక్కటి చెప్పు చాలు! నీకు నా పట్ల అసూయ అని చెప్పరాదూ, గొడవే వుండదు. రాజకీయంలో నువ్వు అనుభవించ తలపినదంతా అనుభవించేసి ఇవాళ నా వంతు వచ్చేసరికి మహాపాపమంటూరా నీతులు చెబుతావెందుకు? నేనూ రాజకీయాన్ని అనుభవించాలి. ప్రజల్ని ఏలాలి! ఏ మంత్రినో అయితేనేగాని నాకు తృప్తి వుండదు. అన్నేళ్ళూ నన్ను ఉత్సాహపరిచి, సరిగ్గా సమయం చేతికి వచ్చిం తర్వాత, ఇప్పుడు నన్ను నీతిగా బతకమని సలహా యిస్తున్నావంటే ఇది అసూయ కాదూ? గుర్తుందా నాన్నా! - నువ్వెక్కిన సింహాసనం నాకిస్తానని మునుపు మాటిచ్చావ్, జ్ఞాపకం వుందా? నేను నోరుజారి రాజకీయాన్ని తిట్టినప్పుడు నా కళ్లు పోతాయని కోప్పడ్డావ్, మరిచి పోయావా? ఇంతచేసి ఇవాళ ప్లేటుమార్చావంటే అసూయకాక మరేమవుతుంది? ఎలాగైతేనేం-పాపిష్టిడబ్బు నువ్వే సంపాయించేవనే గర్వంతో దాన్ని అడ్డంపెట్టుకుని నా నోరుమూసి నాపెళ్ళి చేసేవ్. ఆస్థినంతా సుమతికి దానంచేసి నా చేతులకి సంకెళ్ళు వేసేవ్ నీ ఆస్థిని నా యిష్టమొచ్చినట్టు ఖర్చు చేసేందుకు తగనా నేను? ఆ డబ్బు నా చేతిలో వుంటే, చక్రం తిప్పేస్తానని నీ భయం కదూ? చక్రం తిప్పి నిన్ను మించిన జాతకుడి నవుతానని అసూయకదూ? అవునా?"

తండ్రికి ఆ మాటలన్నీ శూలాల్లా గుచ్చుకున్నాయి. చాలా బాధపడిపోతూ అన్నాడు—

"గూండాలు చెప్పిన కథలు వినొచ్చే వొరేయ్ జీవీ! నిజమేరా, నన్నుమించిన జాతకూడివవుతావనే భయంకొద్దీ నిన్ను వారిస్తున్నాను. నాజాతకంలో పాపాలెక్కువరా. అది మరిచిపోవద్దు నిన్ను ఈపాడు రాజకీయాలవేపు తిప్పుకోడం నాతప్పే! చక్కగా బుద్ధి చెబుతున్నావ్. నా మనస్సాక్షిగా చెబుతున్నాను నాయనా!— నీలాటివాడు ప్రజల్ని తింటాడే తప్పించి పాలించలేడు. నిన్ను వక్రమార్గంలోనే పెంచేను. ఇప్పుడందుకు చాలా విచారిస్తున్నాను. తండ్రిగా నామీద నీకు గౌరవముంటే రాజకీయాల్నొదిలి బుద్ధిగాబతుకు. లేదూ, నీ ఖర్మ. అనుభవించు."

చిరంజీవి విసురుగా లేచి నించున్నాడు.

"చెప్పకింక నాన్నా! ఏ క్షణంలోనైనా నీ బుద్ధి మార్చుకుని నా పక్షం చేరతావని ఇన్నాళ్లూ ఎదురు చూసేను. ఇంక లాభం లేదు. నిన్నెవడో మార్చేసేడు స్వామెవడో నీకు మందుపెట్టాడు. నువ్వు స్వాముల్నాహ్వానించి నప్పుడే అనుకున్నాను నువ్వీ పాడుపనులేవో తప్పకుండా చేస్తావని లేకపోతే ఈ చికాకంతా ఏమిటి చెప్పు? వస్తా.... మరోమాట నాన్నా? నీ డబ్బు పాడు చేస్తానని బెంగ

పడుతున్నావు కాబోలు. నీమీదొట్టేసి చెబుతున్నాను. నీ ఆస్థిలో పూచికపుల్లయినా ముట్టను. చూస్తుండు. ఈ మెదడిచ్చిన బలంతో నీ పాపిష్టి ఆస్థికి రెండింతలు అయిదేళ్ళలో-నాకిచ్చే గడువులో, సంపాయించకపోతే నన్ను పేరుతో పిలవకు. ఇది నా ఛాలెంజ్ అనిగూడా హెచ్చరించి వెడుతున్నాను. వస్తా'' అని చెప్పేసి అతనక్కడ్నుంచి వెళ్ళిపోయేడు.

రామదాసు కళ్ళల్లో నీళ్లు తిరిగేయి.

'ఈ తిమ్మాపురాన్నీ, ఈ దేశాన్నీ, ఈ ప్రజల్నీ ఈ రౌడీకి బలికాకుండా దేముడే రక్షించాలి. వీడ్ని రౌడీగాతయారు చేసిన నన్ను ఆ దేముడే శిక్షించాలి! అనుకున్నాడాయన మనసారా!

* * *

ఆ సాయింత్రంనుంచీ ప్రసాదం కోసం రామదాసు ఎదురుచూస్తూనే వున్నాడు.

రాత్రి ఎనిమిది దాటినా ప్రసాదం రాకపోవడంతో రామదాసుకి ఎదురుచూడటంలో విసుక్కలిగింది. ఆనాడు, అర్ధరాత్రివరకూ ప్రసాదం కొరకు ఎదురు చూస్తూనే గడిపేడాయన.

ప్రసాదం రానేలేదు,

రాత్రంతా ఆయన నిద్ర పోనేలేదు తెల్లవారుతూనే ప్రసాదం గదికి వెళ్లేడు. ఆ గదికి తాళం వేసివుంది. ఆయనక్కడ తచ్చాడుతూ కాసేపు గడిపేడు.

ఆ యింటివాళ్ళు అడిగేరు.

"ఎవరికోసమండి ? ప్రసాదం కొరకేనా ?''

రామదాసు తలూపేడు.

"నిన్న సాయింత్రమే వెళ్ళిపోయాడు. వాళ్ళక్కయ్యకి సీరియస్‌గా వుందని కబురొచ్చింది.''

రామదాసు అక్కడింక నిలబడలేకపోయేడు. ఇంటికొచ్చి కూచున్నాడేగాని అక్కడా వుండలేకపోయేడు. సీత చివరి మాటలన్నీ గుర్తుకొచ్చేయి.

చివరి క్షణాల్లో కలుసుకుందా మన్నది సీత!

సీతకి ముంచుకొచ్చిందని ప్రసాదానికి కబురొచ్చింది. అంతా పూర్తిగాక మునుపే వెళ్ళాలి. తప్పనిసరిగా వెళ్ళి తీరాలి.

ఆయన వెంటనే బస్టాండుకొచ్చి, సిరిపల్లె వెళ్ళే బస్సెక్కేరు. ఆ బస్సు సిరిపల్లె చేరేసరికి అంతా అయిపోయింది.

ఆ యింటిలో ప్రసాదం సీత శవం ముందు కూచున్నాడు అతనెప్పట్నుంచి ఏడుస్తున్నాడో గాని, మనిషంతా నలిగిపోయి వున్నాడు. రవి భుజాలమీద వాలిపోయి వున్నాడతను, అక్కడ మరి కొంత మంది మనుషులూ ఉన్నారు. వాళ్ళందరూ ప్రసాదాన్ని ఓదార్చే ప్రయత్నంలో వున్నారు.

రామదాసుని వాళ్ళందరూ చూసేరు. కాని, ఆ పెద్దమనిషి అక్కడికెందుకు వచ్చి వుంటాడో అర్ధం చేసుకోలేక పోయేరు. రామదాసు తిన్నగా శవం దగ్గిరికి వెళ్ళేడు. ప్రసాదం ప్రక్కన కూర్చుని, ప్రసాదం

భుజమ్మీద చేయి వేసేడు.

"మా అక్క సార్!....సీతక్క" అన్నాడు ప్రసాదం.

"చూస్తున్నాను నాయనా! నీకు జరిగిన అన్యాయాన్ని చూస్తూనే వున్నాను." అన్నాడు రామదాసు.

"నాకు అమ్మ, నాన్న, అన్న, అక్క అన్నీ ఈ సీతక్కే సార్! కష్టాలన్నీ నాకోసం అనుభవించి....నావల్ల సుఖపడే రోజు వస్తుండగా కన్ను మూసింది. నా చేతులు సార్... ఈ చేతులు పుణ్యం చేసుకునే అవకాశాన్ని పోగొట్టుకున్నాయి సార్! అంతా అయిపోయిందండి దాసుగారు!" అన్నాడతను గాద్గదికంగా.

రామదాసు కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగేయి.

'సీతా! మనం మన మాట నిలబెట్టుకోలేక పోయేం సీతా'....నువ్వన్నట్టు చివరి క్షణాల్లో గాకుండా అంతా అయిపోయింతర్వాత కాళ్లీడ్చుకుంటూ వచ్చేను సీతా!' అనుకున్నారాయన.


ప్రసాదం రామదాసు వేపు చూసేడు,

ఆశ్చర్యం! అయనేడుస్తున్నారెందుకు?

"సార్! నన్ను ఓదార్చడానికి వచ్చి మీరెందుకు సార్ ఏడుస్తారు?"! అన్నాడు ప్రసాదం.

కన్నీరుబికి వస్తున్నా నవ్వగలిగేడు పేలవంగా రామదాసు.

'సీతా! నేనెందుకేడుస్తున్నానని ప్రసాదం అడుగుతున్నాడు. చెప్పేదా సీతా మన రహస్యం? మూడోవాడికి తెలీకూడదన్నావ్. మూడోవాడు ప్రసాదమ్ అయ్యేడిప్పుడు. చెప్పేదా?....'నాయనా ప్రసాదం, నీకు సీత అక్క కాదు. నిన్ను కన్న తల్లి! నవ మాసాలూ మోసి నిన్ను కన్న తల్లి బాబూ! ఇదిగో నేను....నేను నీ తండ్రిని. నేను నీ తండ్రిని. భగ్న ప్రేమికురాలిగానే సీత నీకు తెలుసు. నిన్ను కన్న తల్లిగా నీకు తెలీకుండా జాగ్రత్తపడింది సీత. నే చేసిన కిరాతకం తెలిసిన తర్వాత సీత తల్లితండ్రులు ఎప్పుడో ప్రాణాలు పోగొట్టుకున్నారు. అంత గొప్ప కిరాతకం నాది. కాని, సీత అప్పట్లో చావలేదు. నీకోసం బ్రతికింది నాయనా! సొంత వూరు వదిలి అక్కడికి కొన్ని వందల మైళ్ళ దూరం పారిపోయి అక్కడ నిన్ను కన్నది. తన తల్లితండ్రుల్ని నీ తల్లితండ్రులుగా చెప్పి నీకు నీ తల్లి అక్కగా కుదిరింది. అక్కగానే నిన్ను పెంచింది. నిన్ను గౌరవంగా పెంచుదామనీ, నీ పుట్టుకపట్ల నీకు అసహ్యం కలగరాదనీ అల్లా పెంచింది నిన్ను. సదాశయంతో, మనో ధైర్యంతో నిన్ను పెంచి పెద్ద చేసి కన్ను మూసింది, నీ తల్లి చరిత్ర మంచిది. నీ తల్లి ఆశయం మంచిది. నీ తల్లి మరణమూ మంచిదే! కాని, బాబూ! ఈ రహస్యాన్ని, నే చేసిన కిరాతకాన్నీ ఈ గుండెల్లో దాచుకుంటూ బతికి చచ్చిన మనిషిన్నేను నీ తండ్రిని. నేను విగిలేను' అని చెప్పేదా సీతా! మన కథంతా చెప్పేదా?"



గుండె పట్టుకుని రామదాసు పక్కకి ఒరిగిపోతుండగా ప్రసాదం ఆయన్ని పట్టుకుంటూ అన్నాడు—

"సార్! అయ్యో ఏమిటిది? మీకేం జరిగింది?"

ఈ విడ్డూరం యావత్తూ కళ్ళారా చూచిన మనుషులు 'ఏమిటో' అనుకున్నాం. దాసుగారిది జాలి గుండె! ఆ గుండెకి షాక్ తగిలింద'ని మాత్రం అనుకున్నారు.

రామదాసు తయారుచేసుకున్న పాపం కథ ఇక్కడితో పూర్తయింది.

* * *

"అంటె? కథ పూర్తయిందా?"

"కథ కాదు నవల!"

"అదే! పూర్తయిందా అంటున్నాను"

"ఆ. పూర్తయింది. ఎల్లా వుంది?"

"ఏమిటీ? పూర్తయిందా?"

"ఆశ్చర్యమెందుకు?"

"కథని—"

"కథ కాదు నవల!"

"అదే నవలని కావాలని ఆపి పూర్తయిందంటె ఆశ్చర్యంగానే వుంది మరి!"

"కావాలని అనలేదు. పూర్తయిందని ఆపేను."

"నేన్నమ్మను. ప్రసాదానికి తండ్రెవరో యిప్పటికొచ్చి తెలీదు. పోనీ. ఆ రహస్యం ఈ రామదాసు ఎప్పటికైనా చెబుతాడా? చెప్పడా? అవతల ఆ చిరంజీవి తన భార్య సుమతిని ప్రేమగా చూడగలడా? లేదా? ఆ సంసారం మూడు పూలూ ఆరు కాయలుగా వర్ధిల్లుతోందా? లేదా? ఆపైన-చిరంజీవి రాజకీయాలేవిటి? అతనెందర్ని పొట్టన పెట్టుకున్నాడు? అతనివల్ల తిమ్మాపురానికీ, దేశానికీ కలిగిన నష్టమేవిటి? ఇవన్నీ అటుంచి—అయ్యో లేచి వెళ్ళిపోతావేమిటి చోద్యం? కొంచెమాగు కథా-అదె-నవలా రచయితా! ఆగక్కడ. నా అనుమానాలు పూర్తిచేసి వెళ్ళు. ఇదిగో నిన్నే—" (సమాప్తం)

మాతృమూర్తి

శ్రీశైలక్

"జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరియసీ" నవలలోని మొదటి వాక్యం ఎంత బాగుంది అనుకున్నాడు రవి.... ఎంతో పట్టువలగా చదువుకు పోతున్న అతనికి "పోస్టు" అన్న కేక వినిపించలేదు. పోస్టుమాన్ 'పోస్టు సార్' అంటూ ఒక కవరు విసిరి వెళ్ళిపోయాడు. కవరు విప్పి చూచేసరికి సంతోషంతో తబ్బిబ్బై పోయాడు రవి.

"అమ్మా మిలటరీలో రిక్రూట్ మెంటుకు ఇంటర్వ్యూ మెమో వచ్చిందమ్మా. ఇంటర్వ్యూ ఎల్లుండి. అంటే రేపే వెళ్ళాలి" అంటూ హడావిడిగా వంట గదిలోకి వెళ్ళాడు.

"ఏమిటి నాయనా, అంత సంతోషం? ఏమిటసలు?" ఇంగ్లీషు పదాలు అర్థంగాక మరలా అడిగింది కామేశ్వరమ్మ.

"మిలటరీలో చేరటానికమ్మా. అంటే అదే సైన్యంలోకి చేరటానికి మెమో వచ్చిందమ్మా."

కామేశ్వరమ్మ కళ్ళు చెమర్చాయి. ఈ కొడుకు కూడ దూరమై పోతాడు. ఈ కళ్ళల్లో అదే ఉత్సాహం. అదే ఆనందం తొణికిస లాడుతున్నాయి. ఆ ఉత్సాహాన్ని తాను నలభై ఏళ్ళ క్రితం చూచింది ఈ కళ్ళల్లో కాదు తన భర్త కళ్ళల్లో, ఆ వీరత్వం, ఆ ఉత్సాహం అన్నీ. అతనివి తండ్రి పోలికలే. రవి పుట్టినప్పుడే అన్నారందరూ అతని తండ్రి పోలికలే అని. "నా కొడుకు కూడ నా అంతటి వీరుడు కావాలే అదే నా కోరిక" అన్నారు.

భర్త ఆనాడు అన్న ఆ మాటలు గుర్తుకు వచ్చాయి కామేశ్వరమ్మకు.

కొడుకులోని ఉత్సాహం చూస్తుంటే ఎంతో గర్వంగా ఉంది తనకు. కాని పంపటం ఎలా? యుద్ధభూమి అంటే ఏమిటి? మృత్యుద్వారం. ఆలోచనలతో సతమతమై పోతున్నది కామేశ్వరమ్మ.

ఇవేమీ పట్టించుకోకుండా "ఏం అమ్మా, అన్నీ రెడీ చేయి. ప్రొద్దునే వెళ్ళాలి" అంటూ బయటకు వెళ్ళిపోయాడు రవి.

"సరే" అనుకొంటూ తల్లి మరల తన పనిలో నిమగ్నమై పోయింది.

* * *

రవి ఇంటర్వ్యూ కెళ్ళాడు ఎంతో మంది యువకులు తండోప తండాలుగా వస్తున్నారు. ఆఫీస్ రూముకు రెండు ఫర్లాంగుల వరకు జనం నిండిపోయారు. ఇంతమందిని చూచేసరికి రవికి అను



మానం వచ్చింది 'అసలు తనకు ఛాన్సు లభిస్తుందా' అని. తన పేరు ఎప్పుడు వినపడుతుందా అందరితోపాటు తాను ఎదురు చూడ సాగాడు. ఇంతలో మైక్‌లో 'మిస్టర్ రవి' అని వినబడింది. అతని ఆనందానికి హద్దుల్లేవు. గబగబా ముందుకు నడిచాడు.

"నమస్తే సార్" వినయంగా చేతులు జోడించాడు.

"నీ పేరేనా రవి?" ఆఫీసరు కంఠం కంచులా మ్రోగింది.

"ఎస్ సార్."

"యువర్ ఛేస్ట్ ప్లీజ్" అని చెపుతో రవి ఛాతీ ఆఫీసరు కొలుచుకున్నాడు. "గుడ్, కావలసిన దానికంటె ఒక ఇంచి ఎక్కువే ఉన్నావు. నీ హైట్" అని

ఎత్తూ కొలిచాడు.

"ఆల్ రైట్, అన్నీ సరిపోయాయి. నీ తండ్రిగారి పేరేమిటి?'' కలం తీస్తూ వ్రాసుకోవటానికి అడిగాడు ఆ ఆఫీసరు.

''ప్రతాపరావుగారు సార్.''

"అయన వృత్తి? '

''ఆయన ఇప్పుడు లేరుసార్. నాల్గేళ్ళ క్రిందట పాకిస్తాన్—ఇండియా మధ్య జరిగిన యుద్ధంలో పోయారు సార్'' గంభీరంగా అన్నాడు రవి.

"అయితే మీ తల్లి ఉందా?''

"ఉన్నది సార్.''

"ఆవిడ వయస్సు?''!

' ఏభై ఎనిమిది ఏండ్లు.''

"మీ ఇంటిలో నీ కంటే పెద్ద వారెవ రన్నా ఉన్నారా?'' రికార్డ్‌లో నోట్ చేసి కొంటూ అడుగుతున్నాడు.

"ఎవరూ లేరు సార్.... నేను మా మదరే ఉంటున్నాం ''

"నీకు అన్నదమ్ములు కూడా లేరా?'' వెంటనే తల యెత్తి ప్రశ్నించాడు ఆఫీసర్.

"లేరు సార్,''

సైనికాధికారి బాధగా తల దించు కొన్నాడు. రవి ఆతురతగా ఆయన వైపు చూస్తున్నాడు,

"సారీ మిస్టర్, నిన్ను చేర్చుకోలేను''

నెత్తిన పిడుగు పడినట్లయింది రవికి. తాను కట్టుకున్న ఊహా సౌధాలన్నీ కూలి పోయాయి. అప్పటి దాకా ఎంతో ఉత్సాహంగా నున్న అతని ముఖం పాలి పోయింది.

"వై సార్'' అని గట్టిగ అరిచాడు.

"మీ తల్లి వృద్ధురాలు ...''

"అఫ్ కోర్స్. ఆవిడ వృద్ధురాలైతే ఏం, నేను యువకుణ్ణేగా'' అర్థంగాక ప్రశ్నార్థకంగా ముఖం పెట్టి అడిగాడు.

"అది కాదాయ్. యు ఆర్ పెర్ పెక్టలీ ఫిట్. (You are perfectly fit) కాని నువ్వు మీ తల్లికి సాయంగా ఉండాలి. బ్రదర్సు గాని సిస్టర్సుగాని ఎవ్వరూ లేరని చెప్పావు. మీ తల్లి జీవించినంత కాలం మీ తల్లికి దగ్గరే తల్లికి సాయం చేస్తూం డటం నీ ధర్మం ఇది నీ కర్తవ్యం....''

తర్వాతి మాటలేమీ రవికి వినిపించడం లేదు. మారు పలుకలేక పోయాడు. తాను కట్టుకున్నవి గాలిమేడలు అని తెలిపింది. నీరసంగా బరువుగా అడుగులు వేస్తూ రూము బయటకు వచ్చాడు.

''రేయ్ ఆ ఫేస్ (face) తెలియ టంలా? ఇప్పటికి ఎనభై ఒకటి''అన్నారు నివరో సంతోషంగా గుంపులో. ఆ వేమీ వినబడలేదు రవికి. అతని చెవుల్లో మారు మ్రోగుతున్నవి రెండే రెండు పదాలు—ధర్మం, కర్తవ్యం. "మీ తల్లికి సాయం చేస్తూండటం నీ ధర్మం....ఇది నీ కర్తవ్యం.''

కర్తవ్యం—కోరిక

ఇవి రెండూ రెండు సమ ఉజ్జీలు. మానవుడు ఎటు మ్రొగ్గాలి? కర్తవ్యం

నిర్వహించాలా? కోరిక తీర్చుకోవాలా! సాధారణంగా మానవుడు రెండిటి మధ్య ఫుట్ బాల్ వలె ఎగురుతూ వుంటాడు చివరకు ఎటు పడతాడు? ఎటు పడాలి? తెలియదు కోరికను నాశనం చేసుకొన లేడు అటు కర్తవ్యాన్ని చేతులారా విస్మరించలేడు ఈ పరిస్థితిలో ఉన్నాడు రవి

*   *   *

అమ్మా నన్ను చేర్చుకోలేదమ్మా రవి వస్తూనే నీరసంగా చెప్పాడు

ఏం నాయనా? బంగారంలా ఉన్న నిన్ను చేర్చుకొనటానికేం? తల్లి ఆశ్చర్యంగా అడిగింది

అవునమ్మా బంగారం లాగానే ఉన్నాను అన్నిటికి సరిపోయానని గూడ అన్నాడమ్మా ఆఫీసరు

అయితే ఇంకేం?

మీ తల్లి వృద్ధురాలు ఆవిడ జీవించినంతకాలం ఆవిణ్ణి కనిపెట్టుకొని ఉండాలి అందుకని సైన్యంలో చేర్చుకోను అన్నాడమ్మా

నేను ముసలిదాన్నైతే ఏం నాయనా? నా పని నేను చేసుకొనగలనులే నీలాంటి యువకులందరు నాలాంటి వాళ్ళ దగ్గర కూర్చుంటే ఇంకెలా? రేపీ పాటికి చైనా వాళ్ళు ఇద వచ్చి కూర్చుంటారు వెళ్ళి సైన్యంలో చేరు పో నాయనా! అవహాయకంగా అన్నది తల్లి

నేను చేర్చుకోలేను అని ఖచ్చితంగా చెప్పేశాడమ్మా

నేను ఒప్పుకున్నానని నేనే పంపానని చెప్పు నాయనా తప్పకుండా చేర్చు

కొంటారు. నాలాటి వాళ్ళందరు రేపో మాపో పోతారు. అప్పుడు దేశం బాగో గులు చూడవలసినవాళ్ళు నీలాటి యువకులే నాయనా! మేమేం చేస్తాం?'' చదువు లేక పోయినా ఆప్యాయత, అనురాగాలే కాకుండా దేశభక్తి కూడ ఉట్టిపడు తున్నాయి ఆ మాటల్లో.

"కాదమ్మా లాభం లేదు. ఎన్ని చెప్పినా వినలేదు. నీ దగ్గరే ఉంటాను. ఆయన చెప్పినది కూడ నిజమేగా. ఎప్పుడు నీ దగ్గరే ఉంటానమ్మా. ఇది నా కర్తవ్యం' అని తృప్తిగాను గంభీరం గాను అన్నాడు రవి.

ఆ తల్లికేం చేయాలో బోధపడటం లేదు. 'నా వల్ల అన్ని యోగ్యతలున్న నా కొడుకు సైన్యంలో చేరలేదు.'

*　　　*　　　*

గోడ గడియారం మూడుసార్లు రంగు రంగు మన్నది.

"బాబూ, రవీ, డ్రాయరు సొరుగులో రెండు రూపాయ లున్నాయి. అది తీసి కొని వెళ్ళి కూరగాయలు తీసికొని రా నాయనా, ప్రొద్దు పోతోంది'' అని వంట గదిలో నుంచి తల్లి కేకేసింది.

చేతిలో నున్న పుస్తకం డ్రాయరు మీద పడేసి లేచాడు రవి. డబ్బులు తీసి 'అలాగే నమ్మా' అంటూ వెళ్ళిపోయాడు. ఒక అర గంటలో కూరలతో సహా తిరిగి వచ్చాడు. తలుపులు తను వెళ్లేటప్పుడు ఎలా లేసి ఉన్నాయో అలానే ఉన్నాయి. తలుపులు త్రోసికొని సరాసరి వంట గది లోనికి వెళ్ళాడు. అక్కడ తల్లి లేదు. సంచి అక్కడే పెట్టి, 'అమ్మా' అని కేక వేసాడు. ఏమీ జవాబు రాలేదు. ఎందుకు వస్తుంది జవాబు??? ప్రక్కంటికి వెళ్ళింది కాబోలు' అని అనుకొని వసారాలోకి వచ్చాడు. ఏం చేయాలో తోచలేదు. మరలా నవల తీసికొని కుర్చీలో కూల బడ్డాడు గంట గడిచిపోయింది. కాని ఇంకా చదువుకు పోతున్నాడు.


అయిదు గంటలు కొట్టింది గడి యారం నిశ్శబ్దాన్ని చీలుస్తూ—

"రవీ'' అంటూ వచ్చాడు వేణు.

''ఏరా నువ్వు సెలక్టు అయ్యావా?'''' అని ప్రశ్నించాడు రవి.

''అది సరేగాని ఒక్క పాతిక రూపా యలు కావాలి. అర్జంటయిన అవసరం వచ్చింది. వారం రోజుల్లో ఇచ్చేస్తా నురా. మూర్తి దగ్గరకు వెళ్తే అసలు లేదన్నాడు. నిన్న నా ముందుగానే ఎమ్. ఓ. అందుకున్నాడు. రేయ్ లేదన కురా ప్లీజ్. ఎంతో ఆశతో వచ్చాను'' బ్రతిమాలాడు వేణు.

''ఇస్తాను కూర్చో.'' అంటూ కుర్చీలో నుంచి లేచాడు. డబ్బుకోసం గదిలోకి వెళ్ళబోయాడు. తలుపులు దగ్గరకు వేసి ఉన్నాయి. గుమ్మం వరకు వచ్చాడు. వంట గదిలో ఏమీ అలికిడి లేదు. అన్నం గాబోలు మాడిన వాసన వస్తోంది. వెనక్కు తిరిగి వంట గదిలోనికి వెళ్ళాడు. అక్కడ



అమ్మలేదు. తాను పెట్టిన సంచి అలానే ఉంది. అన్నం దించి, డబ్బుకో సంతిరిగి గదిలోనికి వెళ్ళాడు.

"అమ్మా" అని బావురు మన్నాడు రవి. తల్లి అక్కడ పడిపోయి ఉంది. ప్రక్కనే స్లీపింగ్ పిల్స్ బోటిల్ ఉంది. తల్లి తల తట్టుకొని "ఏమిటమ్మా. ఏం టమ్మా ఇది? ఎలా వున్నదమ్మా' అని పిచ్చిగాఅరుస్తూ అమ్మను కుదుపుతున్నాడు. జవాబు లేదు కదా, మూలుగన్నా విన బడటం లేదు. శరీరం చల్లగా ఉంది.

'అమ్మా! అమ్మా' అని పెద్దగా ఏడ్వ సాగాడు.

ఈ అరుపులు విని ఏమిటో అని కంగా రుగా లోపలకు వచ్చాడు వేణు.

"అమ్మా, ఒక్కసారి పలుకమ్మా. ఎన్నిసార్లు పిలిచినా పలకవేం అమ్మా!" అంటూ అమ్మని కవిసి ఏడు స్తున్నాడు రవి. వేణు ఆవిడ చేయ పట్టుకు చూచి 'అయిపోయిందిరా' అన్నాడు బరువుగా.

*　　　*　　　*

రెండు రోజు లయిపోయాయి. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉన్నది. రవి కుర్చీలో దిగాలుగా కూర్చున్నాడు. అప్పుడప్పుడు పుస్తకాలు సర్దుతూ వేణు ఏదో మాట్లాడుతున్నాడు.

"రవీ, ఇదేంటో ఏదో ఉత్తరంరా" అంటూ బల్ల మీదున్న ఒక కాగితం రవి చేతికిచ్చాడు.

"ఇప్పు డెందుకురా, అవన్నీ, అలా పడేయి" అంటూనే అందుకున్నాడు. అది తన అమ్మ దస్తూరి. ఏమిటో అని ఆతు రతగా చదివాడు.

'రేయ్ వేణూ, మా అమ్మ ఎంత పని చేసిందో చూశావా?'' రవి బాధగా అన్నాడు.

''ఏమిటిరా?'' అంటూనే లేచి వచ్చాడు వేణు రవి దగ్గరకు.

''ఇది చూడు'' ఉత్తరం వేణు కిచ్చాడు.

వేణు అందుకొని చదువ సాగాడు—

''చిరంజీవి రవికి

అమ్మ ఆశీర్వదించి వ్రాయునది—

నాయనా, నా వలన నిన్ను మిలటరీలో చేర్పించుకొనలేదు. కాని నాలాటి వృద్ధులు దేశంలో చాల మంది ఉన్నారు. వాళ్ళ కొడుకు లందరు నీ వలె సైన్యంలో చేరక పోతే దేశం ఏమవుతుందో తెలుసా? నీ లాటి యువకు లందరు తల్లుల దగ్గర కూర్చుంటే గాంధీజీ, నెహ్రూజీ. పటేలు లాంటి గొప్ప గొప్ప నాయకులు సంపాదించి ఇచ్చిన మన స్వాతంత్ర్య లక్ష్మి ఏమవుతుందో తెలుసా? నాయనా, స్వాతంత్ర్యం సముపార్జన కంటె స్వాతంత్ర్య సంరక్షణ కష్టం. ఆ బాధ్యత మీపైన ఉన్నది. నేటి యువకులే రేపటి అధినేతలు. నేను జీవించి ఉండటం వలన నీవు సైన్యంలో చేరకూడదన్నారు. ఇప్పుడు నీవు నిశ్చింతగా పోయి సైన్యంలో చేరి నీ మాతృభూమిని కాపాడుకో. అదే నాకు ఆత్మశాంతి కలిగిస్తుది. తప్పక చేరి నీ మాతృదేశ ఋణం తీర్చుకో. మీ నాన్న గారి కోరిక గూడ అదే. ఒకనాడు ఏమన్నారో తెలుసా—'నా కొడుకు కూడ నా అంత వీరుడైతే చూడాలని ఉంది' వారి కోరిక గూడ తీర్చు. అదే నాకు మహాభాగ్యం. నా కొరకు ఒక వీరుడయి నన్ను 'వీర మాత'గా పేరు పొందనీ.ఆ అదృష్టం నాకు దక్కనీ.

—ఆశీర్వాదములతో
నీ అమ్మ.''

ఉత్తరం పూర్తిచేసి చూసేసరికి రవి తల పట్టుకొని ఏడుస్తూ కూర్చున్నాడు.

''రేయ్ రవీ, ఇప్పుడు ఏడ్చి లాభం లేదురా. నువ్వు చేయవలసిందల్లా ఒక్కటే అదే—మీ అమ్మ కోర్కెను తీర్చాలి. అది నీ ధర్మం అంతేగాని విచారిస్తే లాభం లేదు. అందరు తల్లులు మాతృమూర్తులు. కాని మీ అమ్మ దేవతా మూర్తి. అ దేవతామూర్తి ఆశయం నెరవేర్చు. ఆమెకు ఆత్మశాంతి కలగనీ. నువ్వు అటువంటి మహిమాన్విత మూర్తికి కొడుకుగా పుట్టినందుకు ఆమె కడసారి కోరిక తీర్చు. లే'' అంటూ వేణు ప్రోత్సాహ మిచ్చాడు.

''నిజమే. అమ్మ కోరిక తీర్చాలి. నడు పోదాం. ఇంకో రెండు రోజులు టైముందిగా. పద'' గంభీరంగా అన్నాడు రవి.

ఎదురుగా పుస్తకం మీదున్న శీర్షిక కర్తవ్యాన్ని ప్రభోదిస్తున్నట్లుంది. ''జననీ జన్మ భూమిశ్చ స్వర్గా దపి గరియసీ.''

ఏజంట్లు కావలెను

ఈ దిగువ ప్రాంతాలలో తరావతు కట్టి తమ స్వంత బాధ్యతపై జ్యోతి మాసపత్రికను విక్రయించుటకు ఏజంట్లు కావాలి.

1. కృష్ణాజిల్లా
   - హనుమాన్ జంక్షన్
   - నూజివీడు
   - జగ్గయ్యపేట
   - పామర్రు
   - పెనమలూరు
   - అరుగొలను
   - కొండపల్లి
   - మాదికొండ
   - గుడివాడ
2. చిత్తూరుజిల్లా
   - కాళహస్తి
   - బి. కొత్తకోట
   - కలికిరి
   - పీలేరు
   - పుంగనూరు
   - సత్తివేడు
3. కడపజిల్లా
   - పులివెందల
4. తూర్పుగోదావరి జిల్లా
   - అనపర్తి
   - గొల్లలమామిడాడ
   - రాజోలు
   - సామర్లకోట
   - మోరి
   - తాపేశ్వరం
5. పశ్చిమ గోదావరి జిల్లా
   - ఆకివీడు
   - కొవ్వూరు
   - నిడదవోలు
   - ఆరవల్లి
   - పోలవరం
   - గణపవరం
   - పెనుగొండ
   - గుండుగొలను
6. గుంటూరు జిల్లా
   - కొల్లూరు
   - చిలకలూరిపేట
   - పొన్నూరు
   - పెదనందిపాడు
   - మేదరమెట్ల
   - చిలుపూరు
   - చేబ్రోలు
   - ఈమని
   - ఇంకొల్లు
   - కొల్లూరు
   - పెదకూరపాడు
   - టంగుటూరు

7. ఖమ్మం జిల్లా

భద్రాచలం
కొత్తగూడెం
చర్ల
మధిర
సత్తుపల్లి

8. కర్నూలు జిల్లా

కంభం
ఆదోని
ఆళ్ళగడ్డ
బంగనపల్లి
ధోన్
నందికొట్కూరు

9. కరీంనగర్ జిల్లా

హుజూరాబాద్
జగిత్యాల
పెదపల్లి

10. మెదక్

సిద్దిపేట

11. నల్గొండ జిల్లా

కోదాడ
మిర్యాలగూడ
బోనగిరి
దేవరకొండ

12 నెల్లూరు జిల్లా

బిట్రగుంట
అల్లూరు
పొదలకూరు
బుచ్చిరెడ్డిపాలెం
కోట
నాయుడుపేట

13. నిజామాబాదు

షక్కర్‌నగర్
ఆర్మూరు
బాన్‌స్వాడ
బోధన్

వివరాలకు:

సర్క్యులేషన్ మేనేజరు,

జ్యోతి

14-బి. బిర్కెట్ రోడ్డు.

టి. నగర్. మద్రాసు-17

సినిమా

విశ్వభారతి ప్రొడక్షన్స్ తొలిచిత్రం పాటల రికార్డింగ్

నూతన చలనచిత్ర నిర్మాణ సంస్థ విశ్వభారతి ప్రొడక్షన్స్ వారి తొలిసాంఘిక చిత్రం పాటల రికార్డింగ్ జెమిని స్టూడియోస్‌లో సెప్టెంబరు 16న ప్రారంభమయింది.

అత్యుత్సాహంగా జరిగిన ఈ ప్రారంభోత్సవానికి ఫిలిం పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు విచ్చేశారు.

"మొదటి పెగ్గులో మజా
వేడి ముద్దులో నిషా" పాటకు సంగీత దర్శకులు టి.చలపతిరావు రాగాలు కూర్చగా, ప్రఖ్యాత నేపధ్య గాయకులు ఘంటసాల పాడారు.

హైద్రాబాదు సారథి స్టూడియోస్‌లో అక్టోబరు 10వ తేదీ నుంచి ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమవుతుంది.

నటవర్గం; నాగేశ్వరరావు, గుమ్మడి, రమణారెడ్డి, రాజబాబు, జమున, సూర్యకాంతం మొదలగువారు.

సాంకేతిక వర్గం: కథ, మాటలు: ముళ్ళపూడి వెంకటరమణ. సంగీతం: టి. చలపతిరావు, కూర్పు: పి. శ్రీహరిరావు, నిర్మాత; జి. రాధాకృష్ణమూర్తి దర్శకులు: కె. ప్రత్యగాత్మ.

కథా నాయకురాలు

శ్రీయుతులు గిడుతూరి సూర్యం, నల్లా వెంకట్రావు గారలు సరస్వతీచిత్ర బ్యానర్‌తో నిర్మిస్తున్న విప్లవాత్మక సంచలన సాంఘిక చిత్రం "కథా నాయకురాలు" నిర్మాణం వేగంగా సాగుతోంది. వీనస్ స్టూడియోలో సెప్టెంబరు 14వ తేదీతో ముగిసిన షూటింగ్‌తో దాదాపు సగంపైన చిత్రం పూర్తయింది. పికరాజు రచించిన 'చూడు షరాబీ-ఈ లేత గులాబీ....వయారి-సై అందిరా....' పాటను కళాదర్శకులు కాంతారాం అద్భుతంగా నిర్మించిన రహస్య భవనం సెట్‌లో-జ్యోతిలక్ష్మి, నాగభూషణంలపై దర్శకులు గిడుతూరి సూర్యం ప్రతిభావంతంగా చిత్రీకరించారు.



"రెండు కుటుంబాల కథ"లో షావుకారు జానకి, విజయనిర్మల

ఫైటింగ్ మాష్టర్ స్వామినాథన్ అధ్వర్యాన కొత్త తరహా జూడో ఫైటింగ్ ఈ చిత్రంలో ఓ ప్రత్యేకత.

బీచ్‌లో - విజయశ్రీ, రాంమోహన్‌ల ప్రేమ సన్నివేశం, స్విమ్మింగ్ దుస్తులు ధరించి విద్యార్థి, విద్యార్థినులతో హాస్య జంట రాజ్‌బాబు, వరలక్ష్మి. (నూతన నటి) బీచ్‌లో పిక్‌నిక్ జరిపిన నవ్వుల దృశ్యం కొండల ప్రాంతంలో శోభన్‌బాబు, రావు

గోపాలరావుల ఫైటింగ్ సీను, ఈ షెడ్యూలులో హైలైట్స్‌గా భావిస్తున్నారు.

వాణిశ్రీ, పెరుమాళ్ళు, ఛాయాదేవి, అల్లు రామలింగయ్య, వరంగల్ వస్తాద్ కొత్త నటుడు జోసఫ్ మొదలగు వారితో అనేక రసవత్తర సన్నివేశాలను దర్శకులు దృశ్యీకరించారు. అక్టోబరు రెండవ వారంలో తిరిగి షూటింగ్ జరుగుతుంది.

శోభన్‌బాబు, వాణిశ్రీ, నాగభూషణం, విజయశ్రీ, రాజ్‌బాబు, వరలక్ష్మి, అల్లు రామలింగయ్య, ఛాయాదేవి, రామ్మోహన్, పుష్పకుమారి, పెరుమాళ్ళు, కాకరాల, రావు గోపాలరావ్, మోదుకూరి సత్యం, వసంతకుమార్, జి. జోసఫ్ (వస్తాదు), సునీత, పి. హెచ్. కృష్ణమూర్తి మొదలగువారు నటిస్తున్న ఈచిత్రానికి మాటలు: రెంటాల గోపాలకృష్ణ, పాటలు. శ్రీశ్రీ, ఆరుద్ర, సుంకర, ఏల్చూరి, సినారాజు, విజయరత్నం. సంగీతం: ఎ. ఎ. రాజ్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: గిడుతూరి సూర్యం, నిర్మాతలు: గిడుతూరి సూర్యం, వల్లె వెంకట్రావు.

'నెఫ్జా' నాటక కళావరిషత్తు సప్తమ వార్షికోత్సవం

నెల్లూరు ఫిలిం జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యాన, 1971 జనవరి రెండవ వారంలో, నెఫ్జా' నాటక కళాపరిషత్తు సప్తమ వార్షికోత్సవం జరుగుతుంది. ఈ సందర్భంలో, నెల్లూరు టౌన్‌హాలులో భారీయెత్తున నాటక, నాటిక, ఏక, బహుపాత్రాభినయ పోటీలు రాష్ట్రస్థాయిలో జరుపబడుతాయి. ప్రవాసాంధ్రులు సైతం ఈ పోటీలలో పాల్గొనవచ్చును. సినిమా నిర్మాతల. దర్శకుల, నటీనటుల, యితర సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో పోటీలు నిర్వహించబడుతాయి.

వివరాలకు:-కార్యదర్శి, 'నెఫ్జా' నాటక కళాపరిషత్తు, (నియర్ డిస్ట్రిక్టు కోర్టు) నెల్లూరు.

ఒకే కుటుంబం

రవి ఆర్ట్ థియేటర్స్ వారు తెలుగు, తమిళ, హిందీ భాషలలో ఖ్యాతి గడించిన ఎ. భీమ్‌సింగ్ దర్శకత్వంలో నిర్మిస్తున్న ఉత్తమ సాంఘిక చిత్రం 'ఒకే కుటుంబం' సెప్టెంబర్ పది నుంచి ఇరవయ్యో తారీఖు వరకు శ్రీ వెంకటేశ్వర సినీటోన్ స్టుడియోలో జరిగిన షూటింగ్‌లో మరికొంత దాదాపు పన్నెండు రీళ్ల చిత్రం పూర్తయింది.

రామారావు, కాంతారావు, నాగభూషణం, అల్లు రామలింగయ్య, ధూళిపాళ, పి. హెచ్. నారాయణరావు, రాజశ్రీ, లక్ష్మి, రుక్మిణి, రమణమూర్తి, పద్మ



తప్పక చూడండి!
శ్రీకాంత్ ప్రొడక్షన్స్
మారిన మనిషి
నిత్యజీవిత సత్యాలను
నిరూపించే ఈ చిత్రంలో
పద్మశ్రీ ఎన్.టి. రామారావుగారి
నటన మహోన్నత
స్థాయినందుకున్నది
దర్శకత్వం
సి. యస్. రావు
B.A.(LITT)
నిర్మాతలు
యస్. యర్. సహాతా
యస్. సౌందప్పన్.
రాజశ్రీ విడుదల



రవి ఆర్ట్సు థియేటర్స్‌వారి 'ఒకే కుటుంబం' చిత్రంలో పద్మశ్రీ ఎన్ టి రామారావు

నాథం వహిస్తున్న ఈ చిత్రానికి సహకార దర్శకులు దాసరి నారాయణరావు నిర్మాతలు కె బసవయ్య ఎ పొవ్ రాఘవులు

నవరత్న ఆర్ట్ ప్రొడక్షన్స్ నెం 1

ప్రతి మనిషిలో సహజంగా వుండే ఓ రకం చిలిపితనం ఎంత ఇబ్బందికరమైన పరిస్థితినైనా తేలికగా తయారుచేసే ఆలోచించి అడుగువేయగల శక్తిని యుక్తిని యిస్తూ శ్రీరామరక్షగా కాపాడగలుగుతూంటుంది అదే నవరత్న ఆర్ట్సు వారి తొలి సాంఘిక చిత్రంలోని ప్రతి పాత్రా చూపే ఓ ప్రత్యేకత

శారదా స్టూడియోలో యీ వరకు సాంఘిక చిత్రం యిటీవల ప్రారంభించబడింది ఫిలిం ఛాంబర్స్ అధ్యక్షులు శ్రీ ఎ ఎల్ శ్రీనివాసన్ కెమేరా స్విచ్ ఆన్ చేశారు హైదరాబాద్ ఉషాకిరణ్ మూవీస్ అధిపతి శ్రీసత్యనారాయణ క్లాప్‌కొట్టారు

పూజా గృహంలో బాలగోపాలా చాలు నీ లీలా అనే పాట సుశీల గానం విజయనిర్మలపై చిత్రీకరించారు దర్శకులు శ్రీ అనిశెట్టి అప్పారావు

హరనాథ్ నాగభూషణం రామ్మోహన్ రమణారెడ్డి పెరుమాళ్లు హేమలత ఉదయలక్ష్మి యింతవరకు ఎన్నికోబడిన ముఖ్యనటీనటులు

విరల్ ముంతాజ్ సంగీత సారథ్యం యీ చిత్రంలో ఒక ముఖ్యవిశేషం ప్పుంతో పాడించడ పాట ఎంతగా పేరుపొందిన వేణుగోపాల్ రెండు పాటలు వ్రాశారు కొసరాజు రెండు పాటలు వ్రాశారు

మాధవ బుల్‌బులే ఛాయ మార్తాండ్ కూర్పు నిర్వహిస్తున్న యీ చిత్రనిర్మాత శ్రీ యస్ ఎం ఖాద్రి సెప్టెంబరు 15 నుంచి రెండవ షెడ్యూలు ప్రారంభిం

బడి నెలాఖరు వరకు షూటింగ్ జరుగుతుంది. యువకులు, ఉత్సాహవంతులు, అనుభవజ్ఞులు అయిన అనిసెట్టి సోదరుల కృషి, నిర్మాత ఏకాగ్రత, యీ చిత్రాన్ని చక్కటి అపురూప కానుకగా ఆంధ్ర ప్రేక్షకులకు అందచేయగలుగుతుంది.

"మిడతం బొట్లు"

రేఖా అండ్ మురళీ ప్రొడక్షన్స్ బేనర్ క్రింద శ్రీ పద్మనాభం సమర్పించు హాస్య రసభరితమైన అత్యద్భుత చిత్రం "మిడతంబొట్లు" తెలుగు. కన్నడ భాషలలో ఒకే పర్యాయముగా వాయువేగ మనోవేగాలతో రూపొందుతోంది. సెప్టెంబరు 20 నుండి అక్టోబరు 10 వ తేదీ వరకు జరుగబోవు షూటింగ్‌లలో నాలుగు పాటలకు సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరింపబడుతుంది. . ఈ షెడ్యూలుతో 8 రీళ్ళ చిత్రం తయారవుతుంది. హాస్య నటరత్న శ్రీ పద్మనాభం జాతకరత్న మిడతంబొట్లు పాత్రను ప్రశంసనీయంగా నటిస్తోన్న యీ నవరసభరితమైన చిత్రంలో కాంతారావు, బాలకృష్ణ, పెరుమాళ్ళు. రావికొండలరావు, త్యాగరాజు, రామచంద్రరావు, శేషయ్య, రాజ్‌కుమార్, గీతాంజలి, రమాప్రభ, ఛాయాదేవి, ప్రమీలారాణి; బాలసరస్వతి, నిర్మల, లక్ష్మీకాంతమ్మ మున్నగు ప్రముఖ తారలతోపాటూ నూతన నటుడు భరణీకుమార్, నూతన నటి లత నటిస్తున్నారు.

రూపకల్పన

1969 నవంబర్ మొదటి తారీఖున ప్రారంభమైన 'రూపకల్పన' ఎడిటింగ్ హోమ్ దిన దినాభి వృద్ధిచెందుతూంది. ఎంతో నైపుణ్యాన్ని సంపాదించిన యువకుడు, ఉత్సాహవంతుడు ఆయిన పిసీ ఎడిటర్ శ్రీ శ్రీహరిరావు ఈ రూపకల్పన అధినేత. ప్రారంభమైన తర్వాత ఇప్పటికి 'గండరగండడు' 'పెళ్ళిసంబంధం' పసిడి మనసులు, ఇతర చిత్రాలు, ఇంటిగౌరవం, బందిపోటు భీమన్న శ్రీ శ్రీహరిరావు కూర్పుచేసిన చిత్రాలు ఎడిట్ చేయబడ్డాయి.

ప్రస్తుతం ఉషశ్రీవారి ద్వితీయ చిత్రం, అత్తలూ-కోడళ్లూ, ఇతర చిత్రాలు, ఉత్తమ చిత్రవారి 'మనసు మాంగల్యం,' రమణ చిత్రవారి 'మట్టిలో మాణిక్యం. విశ్వభారతి వారి ప్రథమ చిత్రం' శ్రీ శ్రీహరిరావు స్వయంగా కూర్చే చిత్రాలు వున్నాయి.

ఇదిగాక తమిళ, కన్నడ, మళయాళ చిత్రాలతో ఎల్లవేళలా ఎంతో సందడిగా కళకళలాడుతూండే రూపకల్పనలో హిందీ. చిత్రాలుకూడా కూర్పు చేయబడాలని 'జ్యోతి' హృదయపూర్వకంగా అభినందిస్తూంది.

'బస్తీ కిలాడీలు'

శ్రీచిత్ర పతాకం క్రింద నిర్మింపబడుతోన్న క్రైమ్ థ్రిల్లర్ "బస్తీకిలాడీలు"



శ్రీ స్వరాజ్యలక్ష్మి ప్రొడక్షన్స్ వారి "రైతేరాజు"లో రాజనాల.

చిత్రం ఇప్పటికి 19 రీళ్ళవరకు తయారయింది. అడుగడుగునా సంభ్రమాశ్చర్యాలు గొలిపే కథాగమనంగల యీ కమనీయ చిత్రంలో యస్. వి. రంగారావు, పద్మనాభం, హరనాథ్, రాజనాల, అల్లు రామలింగయ్య, రామచంద్రరావు, శేషయ్య, రామకోటి, పొట్టిప్రసాద్, నూతన నటుడు జి. రామారావు, విజయలలిత, సంధ్యారాణి. ఎల్. కాంచన, సుమ ప్రభృతులు నటిస్తున్నారు. కథ, మాటలు రాజశ్రీ. సంగీత దర్శకుడు: యస్. హనుమంతరావు యీ చిత్రంలోని ఆరు పాటలకు మధురమైన సంగీత బాణీలను పొదిగారు. కెమెరా: మధు, కళ: అనంతరామ్; దర్శకత్వం: జి. వి. ఆర్. శేషగిరిరావు; నిర్మాతలు: కె. శేషయ్య, జి. వి. రామచంద్రరావు. ఈ చిత్రాన్ని నవంబరు నెలాఖరుకల్లా పూర్తిచేసి డిశంబరు మాసంలో విడుదల చేయాలనే నిర్మాతల సంకల్పం. ఆంధ్రలో శ్రీ కుమారస్వామి పిక్చర్సువారు. నైజాంలో పద్మ పిక్చర్స్ వారు, సీడెడ్‌లో బలరామ్ పిక్చర్సువారు విడుదలచేస్తారు.

మల్లెల మనసులు


నిర్మల ఆర్ట్ పిక్చర్స్ వారు ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న సాంఘిక చిత్రం 'మల్లెలమనసులు.' నిర్మాతగా, రచయితగా చిత్రసీమకు పరిచయమవుతున్న శ్రీ టి. ఆర్. చౌదరి న్యాయశాస్త్ర పట్టభద్రులు. శ్రీ వెంకటేశ్వర సినీటోన్ స్టుడియోలో పదిరీళ్ళకు పైగా చిత్రీకరింపబడిన ఈ చిత్రంలో యస్. వి. రంగారావు, అంజలీదేవి, విజయనిర్మల, అనిత, నాగయ్య, హరనాథ్, రాజనాల, త్యాగరాజు, ఆర్జా జనార్ధనరావు, మంజుల మొదలగువారు నటిస్తున్నారు. దర్శకత్వం కె. నందనరావు. సంగీతం ఎల్. మల్లేశ్వరరావు.

పి. యస్. ఆర్. పిక్చర్సు
'విక్రమార్క విజయం'

"మాతా శాంభవీ! నీ దివ్యమంగళ స్వరూప సందర్శనం కోరి ఉపాసని బయల్దేరుతున్నాను. అనుగ్రహించి ఆశీర్వదించు తల్లీ" అంటూ వీరసేన మహారాజు తన ఆరాధ్య దైవమునకు భక్తిశ్రద్ధలతో మ్రొక్కాడు అతి గంభీరంగా.

ఈ దృశ్యాన్ని పి. యస్. ఆర్. పిక్చర్సు వారి మహత్తర జానపద చిత్రం "విక్రమార్క విజయం" సెప్టెంబరు మాసం 14 వ తేదీన వాహినీ స్టూడియోలో ఫస్టుఫ్లోర్‌లో ప్రారంభమైన సందర్భంలో తొలిషాట్ లో వీరసేన మహారాజు పాత్ర ధరించిన శ్రీ యస్. వి. రంగారావుపై చిత్రీకరించటం జరిగింది. పద్మశ్రీ ఎన్. టి. రామారావుగారు కెమెరా స్విచ్ ఆన్ చేయగా ప్రముఖ నిర్మాత శ్రీ తివిక్రమరావు క్లాప్‌కొట్టారు. ప్రారంభోత్సవానికి శ్రీ నాగిరెడ్డి తదితర నిర్మాతలు: నటీనటులు, సాంకేతిక నిపుణులు హాజరయ్యారు. శోభాయమానంగా రూపొందింపబడిన గంధర్వలోకం సెట్‌లో 14 వ తేదీని ప్రారంభమైన యీ షూటింగు 22 వ తేదీ వరకు జరిగింది. ఈ సెట్‌లోనే శ్రీ చిల్లర భావనారాయణ వ్రాసిన-

విజయధీరా రణవిక్రమా
సరసకళా మధురిమల



శ్రీ చిత్రవారి
"బస్తీ కిలాడీలు"లో
సంధ్యారాణి

సుమమాల అందుకోరా"—

పాటను రాజశ్రీ, ధనశ్రీల నృత్యాలపై చిత్రీకరించారు. ఈ పాటను ఎ సుశీల, యస్. జానకి మధురంగా పాడారు భూలోకం నుండి గంధర్వలోకానికి మణి సుంజరిపై మోహావేశంతో వెంటబడి వచ్చిన వీరసేన మహారాజు గంధర్వులతో భయంకరంగా యుద్ధం చేయటం మున్నగు



పి. యస్. ఆర్. వారి "విక్రమార్క విజయం" షూటింగు ప్రారంభోత్సవ సందర్భంలో నిర్మాత శ్రీ పింజల సుబ్బారావుకు డిస్ట్రిబ్యూటర్ శ్రీ వెంకటనారాయణ చెక్కును యిస్తున్నారు.

గంధర్వలోకానికి సంబంధించిన సన్నివేశాలను రమణీయంగా చిత్రీకరించటం జరిగింది. వీరసేన మహారాజుగా యస్. వి. రంగారావు, గంధర్వరాజు చిత్రరథుడుగా ప్రభాకరరెడ్డి అతని భార్య కాంతిమతిగా షహీదా, అతడి కుమార్తెలు రూపవతిగా రాజశ్రీ, మణిమంజరిగా ధనశ్రీ ఈ గంధర్వలోకం సెట్‌లో పాల్గొన్నారు.

ఇంకా ప్రముఖ తారాగణమంతా నటించనున్న యీ చిత్రాన్ని అతిత్వరలోనే పూర్తిచేసి విడుదల చేయాలనే నిర్మాత శ్రీ పింజల సుబ్బారావుగారి సంకల్పం.

ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే మరియు దర్శకత్వం, శ్రీ గిడుతూరి సూర్యం.



శ్రీ చిత్రవారి "బస్తీకిలాడీలు''లో పద్మనాభం, కాంచన.


మనసు మాంగల్యం

నిర్మాత శ్రీ కోగంటి కుటుంబరావు అతిప్రయాసల కోర్చి నిర్మిస్తున్న ఉత్తమ సాంఘిక చిత్రం 'మనసు-మాంగల్యం' దాదాపు పూర్తికావస్తూంది

పద్మశ్రీ నాగేశ్వరరావు, జమున జగ్గయ్య, పద్మనాభం, రమణారెడ్డి, చంద్ర మోహన్, రామకృష్ణ, సూర్యకాంతం, గీతాంజలి, అంజలిదేవి, మొదలగువారు ప్రతిభావంతంగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం సారధి శ్రీ పెండ్యాల దర్శక త్వం బాక్సాఫీస్ డైరెక్టర్ శ్రీ కె ప్రత్య గాత్మ

మాధవి ఆర్ట్ ప్రొడక్షన్స్ నెం 1

మాధవి ఆర్ట్ ప్రొడక్షన్స్ వారు సెప్టెం బర్ 12 నుంచి 20 వరకు గోదావరి తీర ప్రాంతంలో ఎక్కువ శ్రమకోర్చి చిత్రీక రించిన దృశ్యాలతో వారి నవీన చిత్రం పూర్తికావచ్చింది శ్రీ సాంబశివరావు దర్శకత్వంలో తయారవుతూన్న ఈ చిత్రంలో శోభన్‌బాబు, యస్ వి రంగా రావు కాంచన, మాలతి రావికొండల రావు, మాడా వెంకటేశ్వరరావు, బేబీడాలి, నటిస్తున్నారు. సహకార దర్శకులు జి కె.



"మిడతంభొట్లు" చిత్రం సెట్ మీద ప్రముఖులు

శేఖర్, వి. సత్యనారాయణరెడ్డి; నిర్మాత శ్రీ ఏ. యస్. ఆర్. ఆంజనేయులు.

'దేశమంటే మనుష్యులోయ్'

పిక్చర్ క్రాఫ్ట్స్ వారు అతిప్రయాసల కోర్చి భారతజాతి మనుగడను కళ్ళకు కట్టి నట్లు చిత్రీకరిస్తున్న విప్లవాత్మక చిత్రం 'దేశమంటే మనుష్యులోయ్' నాటి, నేటి భారతదేశ చరిత్ర ఎంతమారిందో ఏ విధంగా మారిపోయిందో జాతిని మేల్కొలిపే గీతాల ద్వారా, దేశభక్తిగల ప్రతివారి హృదయాలను ఆకర్షించే సంగీత బాణీలతో సమకూర్చడం జరిగింది.

శ్రీయుతులు కే. యమ్ కె. నాయుడు, జి. కె. నాయుడు ఎం. ఏ, గారలు నిర్మిస్తున్న ఈ చిత్రానికి రచన మహారధి, సంగీతం ఎస్. రాజేశ్వరరావు, దర్శకత్వం ఎ యస రావ్ బి ఎ [లిట్] *



అమెరికన్ వనిత మిస్‌మేరి కె రిన్ ట్రా తీసు ంనిత సుఃసా ంది

వద్ద సితార్ వాయిద్యాన్ని అ ం సిస్తు ్న దృశ్యం

పవి త్ర బం ధం

నేటి సమాజంలో నిరుద్యోగ సమస్య ఏ విధంగా తలెత్తుతుందో దాని పర్యవసానం ఎలా పరిణామం చెందుతుందో కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించి నిరూపించే చిత్రం అశోక్ మూవీస్‌వారి 'పవిత్ర బంధం

అక్కినేని నాగేశ్వరరావు వాణిశ్రీ కాంచన పద్మనాభం గీతాంజలి ముఖ్య భూమికల్లో కనుపిస్తారు దర్శకత్వం వి మధుసూధనరావు నిర్వహిస్తున్నారు శ్రీ టి గోవిందరాజన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సహనిర్మాత శ్రీ టి వి ఎస్ శాస్త్రి

స్వరాజ్యలక్ష్మి ప్రొడక్షన్స

స్వరాజ్యలక్ష్మి ప్రొడక్షన్స్ తమ మొదటి జానపద చిత్రం పద్మశ్రీ యన్ టి ఆర్ స్విచ్ ఆన్ చేయగా శ్రీ రాజనాల క్లాప్స్ కొట్టగా జూన్ 21 వాహిని స్టూడియోలో సుభముహూర్తాన షూటింగ్ ప్రారంభమైంది 21 నుంచి 27 వరకు నాలుగు సెట్స్‌లో పని పూర్తి చేశారు ఈ చిత్రంలో మొత్తం ఏడు పాటలుంటాయి కాంతారావు రాజనాల కె వి చలం త్యాగరాజు, ధూళిపాళ నాల కృష్ణ జగ్గారావు బేబీ రాణి విజయలలిత అంజలి గీతాంజలి విజయశ్రీ రాజ్

...మార్ నటిస్తున్న ఈ చిత్రానికి ... ఎం. ఐ. వి. శ్రీనివాస్, రచన జి. కె. ...మూర్తి, పాటలు సి. నారాయణరెడ్డి, దాశరథి. ... కె మూర్తి. నిర్మాణ నిర్వాహణ ...పల్లి శీతారామస్వామి, నిర్మాత కుదరపల్లి శ్రీరామమూర్తి.

సంగీతం టి. వి. రాజు.

విజయ కంబైన్స్ రిలీజ్.

పట్టిందల్లా బంగారం

శ్రీ తోట సుబ్బారావు సమర్పిస్తున్న శ్రీ లక్ష్మీ పిక్చర్స్ అండ్ కో 'పట్టినదల్లా బంగారం' చిత్రం శరవేగంతో తయారవుతూంది. తిరుమల చంద్రగిరి లోయ ప్రకృతి సౌందర్యంతో కొన్ని ముఖ్యమైన సన్నివేశాలు అతి శమకోరికతో చిత్రీకరించటం జరిగింది.

చలం, రాజశ్రీ, హరనాథ్, విజయలలిత, రేలంగి, సత్యనారాయణ, రమణారెడ్డి (గెస్ట్) అల్లు రామలింగయ్య, ఛాయాదేవి, సబిత, కె. వి. చలం, రామచంద్రరావు మరియు జగ్గయ్య నటీనటులు.

శ్రీ పి. వెంకటరత్నం నిర్మిస్తున్న ఈ చిత్రానికి బి. ఎల్. ఎస్. ఆచార్య సంభాషణలు; ఘంటసాల సంగీతం; ఎస్.ఎస్.లాల్ ఛాయ,వాలి కళ; బి.గోపాలరావు కూర్పు, జి. వి. ఆర్. శేషగిరిరావు.

రౌడీ రాణి

శ్రీ ఏ. పూర్ణచంద్రరావు శ్రీ లక్ష్మి ప్రొడక్షన్స్ బ్యానర్‌లో నిర్మిస్తున్న క్రైం థ్రిల్లర్ 'రౌడీ రాణి' గా విజయలలిత నటిస్తున్న ఈ చిత్రాన్ని జూన్ 9 న ప్రారంభించారు. మలేషియా నాట్య సుందరి కిస్‌మిస్ ఈ చిత్రంలో ప్రత్యేక పాత్రలో కనుపిస్తుంది. నిర్విరామంగా షూటింగ్ పూర్తి చేసుకుంటున్న ఈ చిత్రం ' ఆగస్టులో విడుదలకు సిద్ధమవుతూంది.

ఇతర పాత్రలో జ్యోతిలక్ష్మి, ...మతి, భవానీ, బేబీ బ్రహ్మాజీ, బేబీ శ్రీదేవి, రాజబాబు, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, త్యాగరాజు, పహిల్వాన్ కాంతారావు, ధూళిపాళ, రావి కొండలరావు, వెంకట్నాయుడు, రాజారెడ్డి మొదలగువారు నటిస్తున్నారు.

సతీ అనసూయ

శ్రీకాంత్ అండ్ శ్రీకాంత్ ఎంటర్‌ప్రయిజస్ వారు కలర్‌లో నిర్మిస్తున్న పౌరాణిక చిత్రం "సతీ అనసూయ" మహాసాధ్వి అనసూయగా జమున, ... భూమికను కాంతారావు ధరిస్తున్నారు. ఇంకా ముఖ్యమైన పాత్రలలో శోభన్, సత్యనారాయణ, శోభన్‌బాబు, రాజబాబు, ప్రభాకరరెడ్డి, మీనాకుమారి నటిస్తున్నారు. దర్శకత్వం బి. ఏ. సుబ్బారావు.

రంగేళీ రాజా

రాజ్యం పిక్చర్స్ నిర్మిస్తున్న 'రంగేళీ రాజా' జూలై 1 న హైదరాబాద్ సారథి స్టూడియోలో షూటింగ్ ప్రారంభమైనది. రంగేళీ రాజాగా అక్కినేని నాగేశ్వరరావు నటిస్తున్నారు. ఇది చక్కని హాస్య సమ్మిళితమైన ఫామిలీ, సెంటిమెంట్ కథ, ఇప్పటికి మూడు పాటలు రికార్డు చేయబడ్డాయి. ప్రధాన పాత్రలలో కాంచన, గుమ్మడి, చలం, సత్యనారాయణ వందనలు కనుపిస్తారు దర్శకత్వం సి. యస్. రావు, నిర్మాతలు శ్రీమతి లక్ష్మిరాజ్యం, శ్రీధరరావుగారలు.